

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





**బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం**

స్థానిక ఎన్నికల్లో వారికి అంతకంటే టిక్కెట్లు కేటాయిస్తాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

- వివరాలు 3 లో..

## నేడు ఏపీ కేబినెట్ అత్యవసర సమావేశం

**స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లపై చర్చ**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర మంత్రివర్గం శనివారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో అత్యవసరంగా సమావేశం కానుంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల కల్పన ప్రధాన అజెండాగా ఈ భేటీ జరగనుంది. మంత్రులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని సచివాలయం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. బీసీ రిజర్వేషన్లపై గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ విస్తృతంగా చర్చించనుంది. విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ సమర్పించిన నివేదికను మంత్రివర్గం సమగ్రంగా పరిశీలించనుంది. రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలు, వర్గాల ఆర్థిక-సామాజిక నివేదికలను పరిగణలోకి తీసుకుని బీసీలకు స్థానిక ఎన్నికల్లో గరిష్ఠంగా రిజర్వేషన్లు కల్పించేలా నిర్ణయం తీసుకోనున్నారు. పాత జీవోలను రద్దు చేసి కేబినెట్ ఆమోదించిన నూతన ప్రతిపాదనల ఆధారంగా ప్రభుత్వం వెంటనే కొత్త జీవోలను విడుదల చేయనుంది. కోర్టు ఉత్తర్వులకు లోబడి, బీసీ వర్గాలకు న్యాయం చేకూరేలా చట్టబద్ధమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

# పార్టీపరంగా బీసీలకు న్యాయం చేస్తాం

- రిజర్వేషన్లను అడ్డుకునేందుకే గొడ్డలి పార్టీ పిటిషన్లు
- రైతులు హలాన్ని పట్టుకోవాలి అర్జీలు కాదు
- రాజముద్రతో భూమికి భరోసా కల్పించాం
- కొండపిలో 2,915 ఎకరాల గర్భకండ్రిక భూ సమస్యల పరిష్కారం
- ప్రకాశం జిల్లా 'మీ భూమి-మీ హక్కు' బహిరంగ సభలో సీఎం చంద్రబాబు
- రూ.166 కోట్లతో పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన



2

*గత 45 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముకగా నిలిచారని, వారికి అన్నివేళలా అండగా నిలవడమే తనబాధ్యత అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకే గొడ్డలి పార్టీ కోర్టుల్లో పిటిషన్లు వేసిందన్నారు. కోర్టుల తీర్పులు ఎలా వున్నా పార్టీపరంగా బీసీలకు 34శాతం కంటే ఎక్కువ సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రైతులు హలం పట్టుకుని పొలానికి వెళ్లాలే తప్ప.. భూమి సమస్యల పరిష్కారం కోసం అర్జీలు పట్టుకుని అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా వచ్చే మార్చి నాటికి రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తామని ప్రకటించారు. ప్రకాశం జిల్లాలో నాలుగు మండలాల్లోని 2,915 ఎకరాల గర్భకండ్రిక భూముల సమస్యలను పరిష్కరించామని చెప్పారు. రూ.166.40 కోట్లతో పోతుల చెంచయ్య-పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు.*

## 50 ఏళ్ల 'గర్భకండ్రిక' భూ చిక్కులకు చరమగీతం

- 8 గ్రామాల రైతులకు శాశ్వత రైత్వారి హక్కులు కల్పించిన సీఎం చంద్రబాబు
- 4 మండలాల్లో 1,301 మంది రైతులకు చెందిన 2,915.10 ఎకరాల భూములకు విముక్తి
- 1959 నాటి రికార్డులను పరిశీలించి అక్కడికక్కడే 'వెబ్‌ల్యాండ్' సవరణకు ఆదేశాలు

4



*50 ఏళ్ల 'గర్భకండ్రిక' భూముల సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శాశ్వత పరిష్కారం చూపారు. శుక్రవారం ఆయన ప్రకాశంజిల్లా కొండపిలో ఎనిమిది గ్రామాల రైతులతో నేరుగా మాట్లాడి వారి దశాబ్దాల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. 1959 నాటి ఫారం-2 చారిత్రక రికార్డులను పరిశీలించి, చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా ఇనాం భూముల చిక్కులను తొలగిస్తూ 1,301 మంది రైతులకు రైత్వారి పట్టాలు జారీ చేయాలని నిర్ణయించారు. వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో తక్షణం సవరణలు చేయాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాల నాటి భూములాటలకు స్వస్తి పలికి తమ చేతికి పట్టాలు అందించడంతో ఎనిమిది గ్రామాల రైతులు తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.*

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై...

- సుప్రీంకోర్టులో చివరి వరకు చిత్తశుద్ధితో న్యాయ పోరాటం చేశాం
- కోర్టు తీర్పును గౌరవిస్తాం, పార్టీపరంగా బీసీలకిచ్చిన మాటను నిలబెట్టుకుంటాం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



9

- 24 శాతానికి తగ్గించింది మీరు కాదా
- గొడ్డలి పార్టీ నేతలు సమాధానం చెప్పాలి
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



7

- టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం
- భవిష్యత్తులో చట్టపరంగా కోటా అమలుకు సీఎం చంద్రబాబు యోచన
- ఎక్సైజ్ శాఖ మంత్రి రవీంద్ర



10

## అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు సహకరించండి

**మంత్రి నారా లోకేష్‌కు కోనేరు హంపి విజ్ఞప్తి**



అమరావతి (చైతన్యరథం): అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు సహకరించాలని ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. శుక్రవారం ఆమె మంత్రిని కలవగా చెస్ ఒలింపియాడ్-2026 వ్యక్తిగత విభాగంలో బోర్డు-1లో కాంస్య పతకం కైవసం చేసుకోవడంపై అభినందించారు. అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఫిడే ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా దక్కించుకున్న చల్లా నిహారిక కూడా మంత్రి లోకేష్‌ను కలవగా ఆమెను అభినందించారు.

3



చైతన్యరథం

# పార్టీపరంగా బీసీలకు న్యాయం చేస్తాం

- రిజర్వేషన్లను అడ్డుకునేందుకే గొడ్డలి పార్టీ పిటిషన్లు
- రైతులు హలాన్ని పట్టుకోవాలి అర్జీలు కాదు
- రాజముద్రతో భూమికి భరోసా కల్పించాం
- ఇప్పటికి 40.58 లక్షల పాస్ పుస్తకాల పంపిణీ
- 16.48 లక్షల ఎకరాలు 22 (ఎ) జాబితా నుంచి తొలగింపు
- కొండపిలో 2,915 ఎకరాల గర్భకండ్రిక భూ సమస్యల పరిష్కారం
- ప్రకాశం జిల్లా 'మీ భూమి - మీ హక్కు' బహిరంగ సభలో సీఎం చంద్రబాబు
- రూ.166 కోట్లతో పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన




కొండపి (చైతన్యరథం): రైతులు హలం పట్టుకుని పొలానికి వెళ్లాలే తప్ప.. భూమి సమస్యల పరిష్కారం కోసం అర్జీలు పట్టుకుని అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భూమి రైతుదేనని, దానిపై హక్కు కూడా రైతుదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో హక్కులను పరిరక్షించేందుకు రీ సర్వే ప్రక్రియ చేపట్టామని తెలిపారు. రీ సర్వే 2.0అనంతరం రాజముద్రతో కూడిన పటిష్టమైన భద్రతా ఫీచర్లతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం నర్సింగోలులో శుక్రవారం నిర్వహించిన 'మీ భూమి–మీ హక్కు' గ్రామసభలో ఆయన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. గత పాలనలో భూములకు భద్రత లేకుండా పోయిందని, ఆక్రమణలు, దందాలు, భూ వివాదాలతో రెవెన్యూ వ్యవస్థను దెబ్బతీశారని ముఖ్యమంత్రి విమర్శించారు. ప్రజల ఆస్తులపై ఫొటోలు వేసుకుని, సర్వే రాళ్లపై రాజకీయ నాయకుల బొమ్మలు పెట్టారని వ్యాఖ్యానించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో భూములపై వివాదాలు సృష్టించారని,అందుకే ఆచట్టాన్ని రద్దుచేశామని తెలిపారు. గతంలో రాజకీయంగా వ్యతిరేకంగా ఉన్న వారి భూములను 22(ఎ) నిషేధిత జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 16.48లక్షల ఎకరాలను 22(ఎ) జాబితా నుంచి తొలగించామని వెల్లడించారు. కంగుంది, అమలాపురం, శెట్టిపల్లి తదితర ప్రాంతాల్లో వివాదాల్లో ఉన్న 41వేల ఎకరాలకు విముక్తి కల్పించామని చెప్పారు. ప్రకాశంజిల్లాలో నాలుగు మండలాల్లోని 2,915 ఎకరాల గర్భ కండ్రిక భూముల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని వివరించారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించేందుకే ప్రతినెలా ప్రజల ముందుకు వస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమం సక్రమంగా పూర్తయ్యేంత వరకూ రైతుల వద్దకు వస్తూనే ఉంటానని చెప్పారు. రాష్ట్రంలో ఏఒక్కరికీ అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే తాను స్వయంగా పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నానన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 40.58 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశామని వెల్లడించారు. అక్టోబరులోనే 790గ్రామాల్లో నాలుగు లక్షలకు పైగా రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. ఇంకా పంపిణీ చేయాల్సిన 51లక్షల పాస్ పుస్తకాలకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని, అర్హులైన రైతులందరికీ అందిస్తామని చెప్పారు. చిట్టచివరి రైతు వరకూ పారదర్శకంగా హక్కు పత్రాలు అందించడమే లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.

## రూ.166 కోట్లతో పాలేరు రిజర్వాయర్

ప్రకాశం జిల్లాలోని ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు పోతుల చెంచయ్య–పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. రూ.166.40 కోట్లతో రెండేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. రిజర్వాయర్ ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లో 35వేల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. పొన్నలూరు మండలం వేమూరుపాడు రహదారి, పాలేరు నదిపై వంతెన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశామని తెలిపారు. రూ.28 కోట్లతో ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకొచ్చామని చంద్రబాబు చెప్పారు. ఆ ప్రాజెక్టు రెండో దశను కూడా పూర్తిచేసి అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. నీరు అందుబాటులోకి రాకుండానే రిబ్బన్లు కట్ చేయడం, ప్రాజెక్టులను జాతికి అంకితం చేసినట్టు ప్రచారం చేసుకోవడం తమ విధానం కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని 40 చిన్నా పెద్ద నదులను అనుసంధానించి నీటి గ్రిడ్ ఏర్పాటు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నుంచి పెన్నా వరకు నదుల అనుసంధానం జరిగితే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు నీటిని అందించవచ్చన్నారు. గోదావరి నుంచి కావేరి వరకు అనుసంధానం జరిగితే నాలుగు రాష్ట్రాల్లో నీటి కొరతను అధిగమించే అవకాశం ఉంటుందని చెప్పారు. రూ.35వేల కోట్లతో రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. భూగర్భ జలాల పెంపునకు కూడా పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



## గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో ప్రకాశం అభివృద్ధి

ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలను ప్రపంచ స్థాయి ఉద్యానవన పంటల కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రారంభించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి 'పల్లె పండుగ' ద్వారా రూ.11వేల కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, మంగళగిరి తదితర ప్రాంతాల్లో 60 వేల మందికి నివాస స్థలాలపై హక్కులు కల్పించామని, వాటి మార్కెట్ విలువ రూ.52వేల కోట్లుగా ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, అదనంగా మరో ఆరు లక్షల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నామని వెల్లడించారు. జల్‌జీవన్ మిషన్ 2.0లో భాగంగా అమరజీవి –జలధార కింద రూ.31వేల కోట్లతో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించేలా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నామని చంద్రబాబు చెప్పారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రూ.1.5 లక్షల కోట్లతో రిఫైనరీ ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. రామాయపట్నం పోర్టు గతంలోనే పూర్తి కావాల్సి ఉన్నా నిర్లక్ష్యానికి గురైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

## బీసీలకు పార్టీపరంగా 34 శాతం రిజర్వేషన్లు

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్ణయానికి సంబంధించి స్పందించిన ముఖ్యమంత్రి.. పార్టీ పరంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తామని ప్రకటించారు. టీడీపీకి బీసీలు వెన్నెముక అని... వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి పార్టీ ఎప్పుడూ కృషి చేసిందని చెప్పారు. గతంలో తాము తీసుకొచ్చిన 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా గొడ్డలి పార్టీ అడ్డంకులు సృష్టించిందని వాటిని 24 శాతానికి తగ్గించడం వల్ల అనేకమంది నష్టపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అయితే న్యాయస్థానాల తీర్పులతో ఆ రిజర్వేషన్ల అమలుకు ఆటంకం ఏర్పడిందన్నారు. సుప్రీంకోర్టు సంబంధిత జీవోను కొట్టివేసినప్పటికీ, పార్టీపరంగా బీసీలకు 34 శాతం ప్రాతినిధ్యం కల్పించి అండగా ఉంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఓటమి తప్పదనే 'సర్' పేరిట స్థానిక ఎన్నికలను కూడా అడ్డుకోవాలన్న ఆలోచనతోనే గొడ్డలి పార్టీ కోర్టులకు వెళ్లిందని సీఎం ఆక్షేపించారు.

## ప్రజాభిప్రాయం ఆధారంగా పాలనలో మార్పులు

ప్రజల బాగోగులే కూటమిప్రభుత్వానికి ముఖ్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేవుడిని ప్రార్థించే సమయంలో కుటుంబానికి మంచి జరగాలని కోరుకోవడంతోపాటు ప్రజలకు మేలుచేసే ప్రభుత్వ పని తీరుపైనా ఆలోచనచేయాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలను ఫోన్ ద్వారా నేరుగా తెలుసుకుని, అవసరమైన మార్పులు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు,అధికారుల పనితీరును ఎప్పటికప్పుడు నమోదు చేసి పౌరసేవల్లో పారదర్శకతను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగ సామర్థ్యాలను మరింత పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలాశ్రీవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



చైతన్యరథం

# నర్సింగోలులో సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

కొండపి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రకాశం జిల్లాలో పర్యటించారు. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొనేందుకు కొండపి నియోజకవర్గం నర్సింగోలు గ్రామానికి విచ్చేసిన సీఎంకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, కూటమి పార్టీల నేతలు, అధికారులు ఘన స్వాగతం పలికారు.











# మంగళగిరి వైసీపీ నేత జొన్నాదుల వరప్రసాదరావు (మణి) టీడీపీలో చేరిక

## కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): మంగళగిరి పట్టణానికి చెందిన వైసీపీ నేత, మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జొన్నాదుల వరప్రసాదరావు (మణి) మంత్రి లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో వరప్రసాదరావుతో పాటు ఆయన సతీమణి కృష్ణవేణిలకు పసుపు కండువా కప్పి లోకేష్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జొన్నాదుల వరప్రసాదరావు మొదటి నుంచీ చేనేత పరిశ్రమ ద్వారా అనేక మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించారు. మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం గౌరవ సలహాదారుగా, మార్కండేయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులుగా, మంగళగిరి చేనేత వృత్తి రక్షణ కమిటీ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. 2005లో మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 21 ఏళ్లుగా



ఆ పదవిలో కొనసాగుతున్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి వరప్రసాదరావు విశేషంగా కృషి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయ్ పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

- స్థానిక ఎన్నికల్లో వారికి అంతకంటే టిక్కెట్లు కేటాయిస్తాం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అమరావతి (చైతన్యరథం): బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న విషయంలో టీడీపీ చిత్తశుద్ధితో కట్టుబడి ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో రిజర్వేషన్ల అమలుకు న్యాయపరమైన అడ్డంకులు ఎదురైనప్పటికీ బీసీలకు రాజకీయంగా న్యాయం చేసే విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. చట్టపరంగా రిజర్వేషన్ల అమలుకు అవకాశం లేని పరిస్థితుల్లోనూ, పార్టీపరంగా 34 శాతం పైగా టికెట్లు కేటాయించి బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తామని ప్రకటించారు. బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో టీడీపీకి ప్రత్యేక చరిత్ర ఉందని పల్లా తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో 1987లో స్థానిక సంస్థల్లో బీసీలకు తొలిసారిగా 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా 1995లో వాటిని 34 శాతానికి పెంచిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. బీసీలను కేవలం ఓటర్లుగా చూడకుండా ప్రజాప్రతినిధులుగా, నాయకత్వ స్థానాల్లో నిలబెట్టేందుకు పార్టీ నిరంతరం కృషి చేసిందని చెప్పారు.



చంద్రబాబు నాయకత్వంలోనూ బీసీల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యం కొనసాగుతోందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో బీసీలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని, వారి రాజకీయ ఎదుగుదలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

### బీసీల రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవాలని వైసీపీ కుట్రలు

బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నాలను అడ్డుకోవడం ద్వారా వారి రాజకీయ ప్రాతినిధ్యానికి విఘాతం కలిగించారని వైసీపీపై పల్లా విమర్శలు గుప్పించారు. బీసీలు రాజకీయంగా ఎదగకూడదన్న దురుద్దేశంతోనే జగన్ అండ్ కో వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీసీల సంక్షేమం పేరుతో ప్రకటనలు చేయడం, ఎన్నికల వేళ వారి ఓట్లను పొందడం తప్ప, రాజకీయంగా వారికి బలమైన ప్రాతినిధ్యం కల్పించడంలో వైసీపీ విఫలమైందని విమర్శించారు. బీసీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడమే ఆ పార్టీ రాజకీయమైతే, వారికి అవకాశాలు కల్పించి నాయకత్వాన్ని పెంపొందించడం టీడీపీ విధానమని పేర్కొన్నారు.

బీసీలకు న్యాయం చేయాలన్న తమ సంకల్పాన్ని రాజకీయ అడ్డంకులు దెబ్బతీయలేవని పల్లా స్పష్టం చేశారు. న్యాయస్థానాల నిర్ణయాలను గౌరవిస్తూనే, బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు అందుబాటులో ఉన్న మార్గాలను అనుసరిస్తామని తెలిపారు. రిజర్వేషన్ల అమలులో ఎదురైన న్యాయపరమైన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, పార్టీపరంగా 34శాతం పైగా టికెట్లు కేటాయించే దిశగా కట్టుబడి పనిచేస్తామని పునరుద్ఘాటించారు. స్థానిక ఎన్నికల్లో బీసీ నాయకులు, కార్యకర్తలకు తగిన అవకాశాలు కల్పించి వారి రాజకీయ సాధికారతకు బాటలు వేస్తామని చెప్పారు, వారి రాజకీయ ఎదుగుదలకు పార్టీ అండగా నిలుస్తుందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# దేశ నిర్మాణంలో ఆయన పాత్ర నిరుపమానం

## రతన్ టాటా ప్రథమ వర్ధంతి సందర్భంగా మంత్రి లోకేష్ నివాళి

అమరావతి (చైతన్యరథం): 'ఒక దూరదృష్టి గల పారిశ్రామికవేత్త, దయా హృదయం కలిగిన పరోపకారి, అన్నింటికీ మించి ఒక అసాధారణమైన మహోన్నత వ్యక్తి. వ్యాపార రంగం ఎల్లప్పుడూ ఒక విస్తృతమైన లేదా ఉన్నతమైన ఆశయం కోసం పని చేయాలి అనే భావనకు ఆయన జీవితం ఒక నిదర్శనంగా నిలిచింది. వినయం, నిజాయితీ, దేశ నిర్మాణం పట్ల ఆయనకున్న అంకితభావం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ఆయన తాకిన అనేక జీవితాల్లో, ఆయన నిర్మించడంలో తోడ్పడిన భారతదేశంలో ఆయన వారసత్వం ఎల్లప్పుడూ సజీవంగా నిలిచి ఉంటుంది.' అంటూ రతన్ టాటా ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు.



# అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు సహకరించండి

## మంత్రి నారా లోకేష్‌కు ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి విజ్ఞప్తి



అమరావతి (చైతన్యరథం): ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి తన తండ్రి అశోక్‌తో కలిసి శుక్రవారం ఉండవల్లి లోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్-2026 మహిళల విభాగంలో భారత జట్టు కాంస్య పతకం, వ్యక్తిగత విభాగంలో కోనేరు హంపి బోర్డు-1లో కాంస్య పతకం కైవసం చేసుకోవడం పట్ల మంత్రి అభినందనలు తెలిపారు. అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం తరపున మద్దతుగా నిలవాలని కోనేరు హంపి చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

# మంత్రి లోకేష్‌ను కలిసిన చెస్ యువ క్రీడాకారిణి నిహారిక

## ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించడంపై అభినందన



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రానికి చెందిన చెస్ యువ క్రీడాకారిణి చల్లా నిహారిక కుటుంబ సభ్యులతో కలిసి శుక్ర వారం ఉండవల్లిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఇటీవల ఫిడే ఉమెన్ ఇంటర్నేష నల్ మాస్టర్‌హోదాను దక్కించుకున్న నిహారికను ఈసందర్భంగా మంత్రి అభినందించారు.తన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియా డారు. ఉమెన్ గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధించడమే తన లక్ష్య మని నిహారిక వివరించింది. ఇందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

చైతన్యరథం

# 50 ఏళ్ల ‘గర్భకండ్రిక’
# భూ చిక్కులకు చరమగీతం

- 8 గ్రామాల రైతులకు శాశ్వత రైత్వారి హక్కులు కల్పించిన సీఎం చంద్రబాబు
- 4 మండలాల్లో 1,301 మంది రైతులకు చెందిన 2,915.10 ఎకరాల భూములకు విముక్తి
- 1959 నాటి రికార్డులను పరిశీలించి అక్కడికక్కడే ‘వెబ్‌ల్యాండ్’ సవరణకు ఆదేశాలు
- రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు, పంటల బీమాకు మార్గం సుగమం



కొండపి (చైతన్యరథం): గత ఐదు పదుల కాలంగా పరిష్కారానికి నోచుకోక నలిగిపోతున్న ‘గర్భకండ్రిక’ భూముల సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చారిత్రాత్మక పరిష్కారం చూపారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల రైతులతో సీఎం నేరుగా మాట్లాడి వారి దశాబ్దాల కష్టాలను స్వయంగా విన్నారు. ఈ సందర్భంగా భూ సమస్య తీవ్రతను, చారిత్రక నేపథ్యాన్ని జిల్లా కలెక్టర్ రాజాబాబు ముఖ్యమంత్రికి వివరంగా సమర్పించారు. మొత్తం నాలుగు మండలాల పరిధిలోని 8 గ్రామాల్లో ఉన్న 2,915.10 ఎకరాల వివాదాస్పద భూములకు భూహక్కులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా 1,301 మంది రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత లభించింది.

జరుగుమల్లి మండలం నర్సింగోలు, పచ్చవ, వర్ధినేనిపాలెం, కె.బిట్రగుంట గ్రామాల్లో 569 మందికి 1,260 ఎకరాలు కేటాయించారు. (ఒక్క నర్సింగోలు గ్రామంలోనే 209 మందికి 400.24 ఎకరాల పట్టాలు అందించారు). కొండపి మండలం ఇలవర, వెన్నూరు గ్రామాల్లో 281 మందికి 1,003 ఎకరాలు జారీ చేశారు. నాగులుప్పలపాడు మండలం ఓబన్నపాలెంలో 430 మందికి 567 ఎకరాల మేర పట్టాలు అందజేశారు. సింగరాయకొండ మండలం కలికివాయ గ్రామంలో 21 మందికి 62 ఎకరాల భూమిపై హక్కులు కల్పించారు.

## చారిత్రక రికార్డుల ఆధారంగా పరిష్కారం:

ఈ భూ సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు స్వయంగా చొరవ తీసుకున్నారు. 1959 నాటి ఫారం-2 చారిత్రక రెవెన్యూ రికార్డులతో పాటు ప్రస్తుతం సాగులో ఉన్న రైతులు సమర్పించిన పత్రాలను స్వయంగా పరిశీలించారు. ఇనాం భూముల చిక్కులను చట్టబద్ధ ప్రక్రియ ద్వారా పరిష్కరిస్తూ రైత్వారి పట్టాల జారీకి ఆమోదం తెలిపారు. వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో భూముల వివరాలను తక్షణం సవరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ నిర్ణయంతో... భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లకు ఉన్న అడ్డంకులు తొలిగాయి. బ్యాంకుల నుంచి లభించే వ్యవసాయ రుణాలు, పంటల బీమా సులభంగా అందుతాయి. ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ పథకాలు పొందేందుకు రైతులకు పూర్తి అర్హత లభించింది.

దశాబ్దాల నాటి భూములాటలకు స్వస్తి పలికి, తమ చేతికి పట్టాలు అందించడంతో ఎనిమిది గ్రామాల రైతులు తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.













# స్టాల్స్‌ను తిలకించిన ముఖ్యమంత్రి

కొండపి(చైతన్యరథం): ప్రకాశంజిల్లా కొండపి నియోజకవర్గం నర్సింగోలులో పర్యటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం సభా ప్రాంగణంలో ఉద్యాన, జలవనరులు, ఉపాధి హామీలతోపాటు పలు శాఖల ప్రగతిని వివరిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. మహిళా సంఘాలు తయారు చేసిన వంట పదార్థాలను రుచి చూసి బాగున్నాయని కితాబు నిచ్చారు. 'ప్రైడ్ ఆఫ్ ప్రకాశం' పేరిట కలెక్టర్ రాజాబాబు రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. అమృతధార-జలహారతి ఫ్లెక్సీని ఆసక్తిగా చూశారు.
















# ఆర్థిక నివేదికల ఆధారంగా ప్రగతి సాధించేలా చర్యలు

- వివిధ రంగాల అభివృద్ధికి నిపుణుల సలహాలు
- సెప్టెంబరు నెల ఆర్థిక నివేదికపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): ప్రతి నెలా ఆర్థిక నివేదికలు సమర్పించడంతో పాటు ఆ నివేదికల ఆధారంగా ఆయా రంగాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. సెప్టెంబరు నెల ఆర్థిక నివేదికను ప్రణాళిక శాఖ అధికారులు సీఎం చంద్రబాబుకు సమర్పించారు. ఈ మేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థూల ఆర్థిక స్థితిగతులు, వివిధ రంగాల పనితీరు, ద్రవ్యోల్బణ పరిస్థితి వంటి అంశాలపై చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'రాష్ట్రంలో ఆర్థిక ప్రగతి క్షేత్రస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి. ప్రతినెలా సిద్ధం చేసుకుంటున్న ఆర్థిక నివేదికల ఆధారంగా వివిధ రంగాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. రిపోర్టులు తీసుకుని చర్చించుకోవడం కాకుండా... ఆ నివేదికల ఆధారంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. చేపట్టాల్సిన మార్పులు చేర్పులపై దృష్టి సారించాలి. ఈ మేరకు ఉన్నతాధికారులు మొదలుకుని... జిల్లా కలెక్టర్లు.. క్షేత్రస్థాయిలోని సిబ్బంది వరకు దానికి అనుగుణంగా నడుచుకోవాలి. ఆర్థిక నివేదికలను ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులకు అందించాలి. ఏమేం అంశాలు సరి చేసుకోవాలోననే విషయాలను వారికి వివరించాలి. వ్యవసాయ రంగంలో వృద్ధి కన్పిస్తోంది. అదే తరహాలో సేవల రంగం, పరిశ్రమల రంగం కూడా పుంజుకోవాల్సిన అవసరం ఉంది. ప్రణాళిక శాఖ రూపొందించిన నివేదికల ఆధారంగా తమ తమ శాఖల పనితీరును మెరుగుపరుచుకోవాలి. వివిధ నిపుణుల సలహాలను తీసుకోవాలి.

ఈ మేరకు నిపుణుల బృందాన్ని గుర్తించి వారి సేవలను వినియోగించుకోవాలి. ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాల్లో ఎక్కడెక్కడ ఉత్తమ పద్ధతులు ఉన్నాయో గుర్తించి.. వాటిని ఇక్కడి పరిస్థితులకు తగ్గట్టు అమలు చేయాలి. ఏ ప్రభుత్వమూ చేయని విధంగా నియోజకవర్గాల స్థాయిలో ప్రణాళికలను అమలు చేస్తున్నందుకు ప్రధాని అభినందించారు. క్షేత్రస్థాయిలో ఉన్న అవకాశాలను ప్రపంచ మార్కెట్లకు చేరేలా చూడాలని ప్రధాని సూచించారు. ఈ మేరకు నియోజకవర్గాల్లో విజన్ యూనిట్ ప్లాన్లు అమలు చేయాలి. ధరలు పెరగకుండా చూడాలి." అని చెప్పారు. సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, ప్రణాళిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతు బిడ్డగా సీఎం చంద్రబాబు

- రైతుల కష్టాలు తీర్చుతున్నారు
- రెండున్నరేళ్లలోనే కొండపి నియోజకవర్గంలో రూ.700 కోట్లకు పైగా అభివృద్ధి పనులు
- కొండపి నియోజకవర్గానికి వెలుగొండ, సాగర్ జలాలు
- కొండపి ప్రజల ఆదరణ, సీఎం చంద్రబాబు ప్రోత్సాహం, దామచర్ల కుటుంబ సహకారంతో మూడుసార్లు ఎమ్మెల్యేనయ్యా
- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి



జరుగుమల్లి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు బిడ్డగా రైతుల కష్టాలు తీర్చుతున్నారని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామంలో జరిగిన మీ భూమి మీ హక్కు కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సభలో మంత్రి డాక్టర్ వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... ప్రకాశం జిల్లాలో ఒకేరోజు 3,304 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలకు సీఎం పరిష్కారం చూపారన్నారు. కొండపి, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాలతో పాటు మొత్తం ప్రకాశం జిల్లాలోని 4 మండలాలు, 8 గ్రామాల్లోని 2,915 ఎకరాల గర్భకండ్రిక భూముల సమస్యకు పరిష్కారం చూపారన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న జగన్ గర్భ కండ్రిక భూముల సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొండపి నియోజకవర్గంలో 39వేల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. రెండున్నరేళ్లలోనే కొండపి నియోజకవర్గంలో రూ.700 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశామని, మరో రూ.700 కోట్లతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. సూపర్ ఎల్ నినో సమయంలోనూ నల్లమల సాగర్‌కి వెలిగొండ నీళ్లిచ్చిన వాటర్ మ్యాన్ సీఎం చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లు సంగమేశ్వర ప్రాజెక్టును పట్టించు కోకుండా వైసీపీ గాలికి వదిలిస్తే.... నేడు కూటమి ప్రభుత్వంలో టెండర్లు పూర్తి చేశామన్నారు. గొడ్డలి పార్టీ మాపై విమర్శలు చేయడం సిగ్గుచేట న్నారు. కొండపి నియోజకవర్గంలోని చివరి ప్రాంతాలైన పాలేరు, పాకల, బింగినపల్లిలకు వెలిగొండ జలాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి జీవో ఇచ్చారన్నారు. మూసీ నదికి సాగర్ జలాలు ఇచ్చేందుకు ఒంగోలు మేజర్ కెనాల్ నుంచి 6టీఎంసీల నీరిచ్చేందుకు రూ.50 లక్షలతో ఎస్కేప్ ఛానల్ మరియు కెనాల్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు జీవోలిచ్చారని చెప్పారు. కొండపి నియోజకవర్గానికి వెలిగొండ, సాగర్ జలాలు తీసుకొస్తున్న అపర భగీరథుడు సీఎం చంద్రబాబు అని కొనియాడారు.. కొండపి ప్రజల ఆదరణ, సీఎం చంద్రబాబు ప్రోత్సాహం, దామచర్ల కుటుంబం సహకారంతో మూడుసార్లు ఎమ్మెల్యేనయ్యానని మంత్రి వీరాంజనేయస్వామి అన్నారు. కొండపి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి మరికొన్ని నిధులు ఇవ్వాలని సీఎంను ఆయన కోరారు.

# ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శప్రాయం

## డేటాలేక్ ప్రాజెక్టు చాలా బాగుంది

### రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయకుమార్ నారాయణ్ ప్రశంస






**అమరావతి (చైతన్యరథం):** రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ పనితీరు, ఆ సంస్థ చేపడుతున్న వివిధ సాంకేతిక కార్యకలాపాలు ఆదర్శప్రాయంగా, అనుసరణీయంగా ఉన్నాయని రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ కుమార్ నారాయణ్ అభినందించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్‌జైన్ ఆయనకు స్వాగతం పలికి ఆర్టీజీఎస్ పనితీరు, దాని లక్ష్యాల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ చేపడుతున్న డేటాలేక్, అవేర్, ఆర్టీజీఎస్ సీసీటీవీ 360, యూనిఫైడ్ గవర్నెన్స్ డ్యాష్ బోర్డు, మనమిత్ర తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్న తీరు గురించి విపులీకరించారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఉన్న డేటాను ఒకచోట అనుసంధానం చేసి ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విశ్లేషించి పాలనను మరింత సరళీకృతం చేయడానికి దోహదపడే పలు రకాల యూస్ కేసెస్ రూపొందిస్తున్నట్టు తెలిపారు. తద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు సంక్లిష్టంగా కాకుండా సరళంగా మారి, ఎలాంటి అంతరాయాలు లేకుండా పౌరులకు సేవలు అందేలా చూస్తున్నట్టు తెలిపారు. అవేర్ విభాగం ద్వారా నిరంతరం వాతావరణ పరిస్థితులను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తున్నామన్నారు. దీనిద్వారా వాతావరణ మార్పులను ముందుగానే పసిగట్టి విపత్తుల నుంచి ప్రజలను, యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. వరదలు, తుఫాన్ లాంటి విపత్తుల సమయంలో అవేర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక విశ్లేషణల ద్వారా ప్రాణనష్టం, ఆస్తి నష్టాల తీవ్రతను గణనీయంగా తగ్గించగలిగేలా ఆర్టీజీఎస్ సాంకేతిక తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో నీటి లభ్యతను కూడా రియల్ టైమ్‌లో మానిటరింగ్ చేస్తున్నామన్నారు. సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీ టీఎస్ చేతన్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ప్రాజెక్టు గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మృత్యుంజయకుమార్ నారాయణ్ మాట్లాడుతూ ఆర్టీజీఎస్ చేపడుతున్న కార్యకలాపాలను కొనియాడారు. ప్రధానంగా డేటాలేక్ ప్రాజెక్టును ఆయన ఆసక్తిగా తిలకించారు. డేటాలేక్ లాంటి ప్రాజెక్టు అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సెన్సెస్ ఆపరేషన్స్ డైరెక్టర్ జె.నివాస్, ఆర్టీజీఎస్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ పి.శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లను...

# 34 నుంచి 24 శాతానికి తగ్గించింది వైసీపీ కాదా?

- **గొడ్డలిపార్టీ నేతలు సమాధానం చెప్పాలి**
- **బీసీలపై జగన్ కక్ష.. రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి అన్యాయం**
- **టీడీపీ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం**
- **తొలుత ఎన్టీఆర్ 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే.. 34 శాతానికి పెంచిన చంద్రబాబు**
- **వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలోనూ 34 శాతం అమలు.. జగన్ వచ్చాకే 24 శాతానికి తగ్గింపు**
- **అప్పట్లో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించలేదో వైసీపీ సమాధానం చెప్పాలి**
- **బీసీలకు మరింత రాజకీయ ప్రాతినిధ్యానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం**
- **వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



శ్రీకాకుళం (చైతన్యరథం): బలహీనవర్గాలపై 'గొడ్డలి పార్టీ' కక్ష కట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. బీసీలపై ప్రేమ, గౌరవం ఉన్నాయని చెప్పుకునే వైసీపీ నేతలు వారి ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి, సుమారు 17 వేల మందికి స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని ఎందుకు దూరం చేశారో సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు క్యాంపు కార్యాలయంలో శుక్రారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలహీనవర్గాల సంక్షేమానికి, రాజకీయ సాధికారతకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కట్టుబడి ఉందని తెలిపారు. 1985లో దివంగత నందమూరి తారక రామారావు స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని, అనంతరం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వాటిని 34 శాతానికి పెంచారని పేర్కొన్నారు. సమాజంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు వారి జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో రిజర్వేషన్లు పెంచినట్లు వివరించారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలోనూ 34 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయని మంత్రి గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి ఎన్నికలు నిర్వహించిందని విమర్శించారు. అప్పటివరకు అమలులో ఉన్న రిజర్వేషన్లను తగ్గించడానికి బాధ్యులెవరో వైసీపీ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు.

బీసీలపై నిజంగా ప్రేమ, గౌరవం ఉంటే రిజర్వేషన్లకు సంబంధించిన న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. చట్టాన్ని సవరించకుండా 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేయడం, హైకోర్టు ఆ జీవోను కొట్టివేసిన తర్వాత తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకోకపోవడంపై వైసీపీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పులను సాకుగా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు.

బీసీ రిజర్వేషన్ల అంశంలో సుప్రీంకోర్టు సూచించిన విధంగా డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా బీసీల జనాభా, సామాజిక స్థితిగతులను అధ్యయనం చేయాల్సి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు ఇచ్చిన హామీకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. న్యాయపరమైన పరిమితులను పరిగణనలోకి తీసుకుంటూ, సాధ్యమైన అన్ని మార్గాలను అన్వేషించి బీసీలకు 34 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బీసీలకు మరింత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఐదేళ్లపాటు మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్తులు, మండల పరిషత్తులు, గ్రామ పంచాయతీలకు తగిన నిధులు అందించకుండా అభివృద్ధిని దెబ్బతీసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా స్థానిక సంస్థలకు పెద్ద మొత్తంలో నిధులు అందే అవకాశం ఉందని, సకాలంలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఆ నిధులను పొందేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. అయితే అభివృద్ధి అంటే గిట్టని గొడ్డలిపార్టీ నేతలు స్థానిక ఎన్నికలను అడ్డుకుని, తద్వారా 16వ ఆర్థిక సంఘం నిధులు రాకుండా చేసేందుకు కోర్టుల్లో పిటిషన్లు వేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు.

ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయుడు వరకు బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తూ, బలహీనవర్గాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. ఎర్రన్నాయుడు, రామ్మోహన్ నాయుడులకు కేంద్ర మంత్రులుగా లభించిన అవకాశాలు బలహీనవర్గాల పట్ల పార్టీ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. బీసీలకు అలంకార ప్రాయంగా పదవులు ఇచ్చి, అధికారం మాత్రం వారి చేతుల్లో ఉంచుకోవడం వైసీపీ నేతల నైజమని, అందుకు టీడీపీ పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. బీసీ నాయకులకు స్వతంత్రంగా పనిచేసే అవకాశం కల్పించడమే తమ పార్టీ ప్రత్యేకత అని చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై విమర్శలు చేసే ముందు గతంలో అమలులో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను ఎందుకు తగ్గించారో వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బలహీనవర్గాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

- **ప్రత్యేక కౌంటర్లలో రూ.48కే కర్నూలు సోనా బియ్యం**
- **ప్రజలకు అందుబాటులోకి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు**
- **కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు**
- **20 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు**
- **రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**



ఏలూరు (చైతన్యరథం): రాష్ట్రంలో 37 లక్షల మెట్రిక్ టన్నుల ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాలు శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో జిల్లా సమీక్ష సమావేశం అనంతరం పాత్రికేయులతో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఎటువంటి ఇబ్బందులు, ఫిర్యాదులు లేకుండా రైతుల నుండి ధాన్యం సేకరణకు రైతు సేవా కేంద్రాల స్థాయిలో సంసిద్దతకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు నాణ్యమైన గొనె సంచులు అందిస్తామని, తేమ శాతం, రవాణా లో ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం సేకరించిన 24 గంటలలోగా రైతుల ఖాతాలో సొమ్ము జమ చేయడంతోపాటు, దేశంలో ఎక్కడా లేనివిధంగా రవాణా చార్జీలను కూడా అదేరోజు రైతులకు జమ చేస్తామన్నారు. రాష్ట్రంలో రూ. 48/-లకే కర్నూలు సోనా బియ్యంను ప్రజలకు అందిస్తామని, ప్రత్యేక కౌంటర్ల ద్వారా 1.60 లక్షల మెట్రిక్ టన్నులు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనాదక్షతతో రాష్ట్రంలో ఇప్పటివరకు 20 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకువచ్చారని, వీటి ద్వారా రాష్ట్రంలోని 20 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన సిఐఐ సదస్సులో 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో ఒప్పందాలు కుదిరాయన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలు, ఫుడ్ ప్రాసెసింగ్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాలలో పరిశ్రమల స్థాపనకు ఎంఓయులు కుదిరాయన్నారు. రాష్ట్రంలో 3 ఎకనామిక్ జోన్లు ఏర్పాటుచేసి, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి వ్యతిరేకంగా సాగాయన్నారు. అనంతపురంలో కియా పరిశ్రమకు అనుబంధ పరిశ్రమల స్థాపనలో గత ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు సృష్టించిందని, రూ.9500 కోట్ల రూపాయలతో అమరరాజా కంపెనీ కూడా తెలంగాణా కు తరలిపోయిందని, రూ.7500 కోట్ల రూపాయలతో రేణిగుంట లో పరిశ్రమను నెలకొల్పేందుకు ప్రయత్నించినా రిలియన్స్ కంపెనీ కూడా వేరే రాష్ట్రానికి వెళ్లిపోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్దంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్, జయమంగళ వెంకటరమణ, శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, డా.కామినేని శ్రీనివాస్, ఆర్టీసీ ప్రాంతీయ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తిగ నాగరాజు, వడ్డీల కార్పొరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అరకు పార్లమెంట్ టీడీపీ అబ్జర్వర్‌గా చిన్న శ్రీను



అమరావతి (చైతన్యరథం): అరకు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్‌గా మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు ఒక ప్రకటనలో పల్లా తెలిపారు.

చైతన్యరథం

# రతనాల 'సీమ' సీఎం చంద్రబాబు లక్ష్యం

- మంత్రి సవిత ఉద్ఘాటన
- రూ.790 కోట్లతో మడకశిర బ్రాంచ్ కెనాల్ సామర్థ్యం పెంపు పనులు ప్రారంభించిన మంత్రి

సోమందేపల్లి (చైతన్యరథం): రాయలసీమను రతనాల సీమగా మార్చడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం పందిపర్తి గ్రామ సమీపంలో హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) మడకశిర బ్రాంచ్ కెనాల్ నీటి ప్రవాహ సామర్థ్యాన్ని ప్రస్తుత 408 క్యూసెక్కుల నుంచి 642 క్యూసెక్కులకు పెంచేందుకు రూ.790 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు హిందూపూర్ ఎంపీ బీకే పార్థసారథితో కలిసి మంత్రి సవిత శుక్రవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కాంట్రాక్టర్లను అదేశించారు.



ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ లైనింగ్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని, సాగునీటి సదుపాయాల మెరుగుదలతో రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ కారణంగా కియా పరిశ్రమ ఏర్పాటై వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కంటే రంగులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి.. కూటమి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిపై చర్చకి సిద్ధమని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మూడు, నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని వెల్లడించారు. త్వరలో మండలంలోని పోలేపల్లి నుండి రాచూపల్లి, మరుకుంటపల్లి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని మంత్రి సవిత తెలిపారు. పందిపర్తి గ్రామం పేరును నందిపర్తిగా మార్చే అంశాన్ని అధికారులతో మాట్లాడి గ్రామ పేరును మారుస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, సంబంధిత అధికారులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# బీసీలను అణగదొక్కడమే గొడ్డలి పార్టీ అజెండా

- 34 శాతం కోటాకు కట్టుబడిన సీఎం చంద్రబాబు
- బీసీల సంక్షేమం, సాధికారత కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం
- స్థానిక ఎన్నికల్లో జగన్ ముఠాను బీసీ సోదరులు తరిమికొట్టాలి
- మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని, న్యాయపరమైన అడ్డంకులు ఎదురైనా బీసీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్సీపీ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్లను ఏకంగా 10 శాతం మేర కోత విధిస్తూ 24 శాతానికి తగ్గించి, బీసీల గొంతు నొక్కారని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు. అర్బన్ లోకల్ బాడీస్, పంచాయతీలలో బీసీ రిజర్వేషన్లను తిరిగి 34 శాతానికి పెంచుతూ జీవో నెం.105, 1065 జారీ చేసి చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా బీసీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. బీసీలకు మేలు జరుగుతుంటే ఓర్వలేని గొడ్డలి పార్టీ నాయకులు హైకోర్టులో కేసులు వేసి రిజర్వేషన్ల పెంపునకు గండి కొట్టే ప్రయత్నం చేశారు. హైకోర్టు తీర్పు ప్రతికూలంగా వచ్చినప్పటికీ కూటమి ప్రభుత్వం వెనకడుగు వేయలేదు. 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశాం. ఇందుకోసం మంత్రుల బృందం స్వయంగా ఢిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చించి, న్యాయపరంగా ప్రభుత్వం తరఫున చేయాల్సిన పోరాటాన్ని చిత్తశుద్ధితో నిర్వహించింది. తాజాగా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఒక బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా గౌరవిస్తున్నామని తెలిపారు. న్యాయపరంగా బీసీ రిజర్వేషన్ల రక్షణకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేసిందని గుర్తుచేశారు. కోర్టు పరిమితులు ఎలా ఉన్నప్పటికీ పార్టీ పరంగా బీసీలకు న్యాయం చేయడంలో వెనక్కి తగ్గేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతమే కాకుండా, అంతకంటే ఎక్కువ స్థానాల్లో పోటీ



చేసే అవకాశం కల్పిస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఇప్పటికే స్పష్టమైన భరోసా ఇచ్చారని వివరించారు. బీసీల సంక్షేమం, సాధికారత కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ఎన్ని న్యాయపరమైన చిక్కులు ఎదురైనా క్షేత్రస్థాయిలో బీసీలకు న్యాయం చేసి తీరుతామని రామారావు పునరుద్ఘాటించారు.

### తెలుగుదేశం పార్టీయే బీసీలు.. బీసీలే తెలుగుదేశం పార్టీ

తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ.. బీసీలే తెలుగుదేశం పార్టీ. ఈ బంధం ఈనాటిది కాదు, పార్టీ ఆవిర్భావం నుంచే పెనవేసుకుపోయిన బంధమని దువ్వారపు రామారావు స్పష్టం చేశారు. టీడీపీ బీసీలకు అన్యాయం చేసిందంటూ వైసీపీ నాయకులు 'బీసీ గర్జన' పేరిట ప్రజల్లోకి రావడం హాస్యాస్పదమని, బీసీలను నిలువునా మోసం చేసిన వైసీపీని ప్రజలెవరూ నమ్మరని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. 1982లో స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచే బీసీలకు పెద్దపీట వేశారు. 1987లో స్థానిక సంస్థల్లో చారిత్రాత్మకంగా 20 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎంతోమంది సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు వంటి ప్రజాప్రతినిధులను తీర్చిదిద్దిన ఘనత టీడీపీకే దక్కుతుంది. తరువాత చంద్రబాబు ప్రభుత్వం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచింది. రాష్ట్రంలో ఏ పార్టీకీ సాధ్యం కాని రీతిలో బీసీల పార్టీగా టీడీపీ శాశ్వత ముద్ర వేసుకుంది. 2019-24 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వం 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి ఏకంగా 10 శాతం కోత విధించింది. రిజర్వేషన్లను హైకోర్టు కొట్టివేస్తే కనీసం సుప్రీంకోర్టుకు వెళ్లే ప్రయత్నం కూడా చేయలేదు. ఫలితంగా దాదాపు 16,800 మంది బీసీ నాయకుల రాజకీయ భవిష్యత్తును వైసీపీ నిలువునా సమాధి కట్టింది. వైసీపీ హయాంలో 56 బీసీ కార్పొరేషన్లను కేవలం ఉత్సవ విగ్రహాలుగా మార్చి, నయా పైసా నిధులివ్వకుండా చేతులెత్తేశారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి, బీసీల జీవనోపాధిని పెంచే 'ఆదరణ' వంటి ప్రతిష్మాత్మక పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. బీసీల పొట్ట కొట్టడమే కాకుండా, ఎంతోమంది బీసీ నాయకులపై దాడులు చేసి ప్రాణాలు తీసిన పాపం ముమ్మాటికీ వైసీపీదే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించేందుకు అత్యంత శాస్త్రీయంగా ముందుకెళ్లింది. ఇందులో భాగంగా సీనియర్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో 'డెడికేటెడ్ కమిషన్'ను ఏర్పాటు చేసి, పకడ్బందీగా ఎంపిరికల్ డేటా సేకరించాం. కమిషన్ నివేదిక ఆధారంగానే 34 శాతం రిజర్వేషన్ల జీవోలను విడుదల చేశాం. న్యాయపరమైన చిక్కులు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పుల కారణంగా రిజర్వేషన్ల అమలుకు ఆటంకాలు ఎదురైనా కూటమి ప్రభుత్వం వెనకడుగు వేయలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా ప్రకటించినట్లుగా.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 34 శాతం మాత్రమే కాదు, అంతకంటే ఎక్కువ స్థానాల్లో టికెట్లు కేటాయించి రాజకీయ న్యాయం చేస్తాం. తెలుగుదేశం ప్రభుత్వం బీసీల సంక్షేమం, సాధికారత కోసం చేపట్టిన పనులను, ఇచ్చిన భరోసాను ప్రతి బీసీ సోదరుడి దగ్గరకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని రామారావు పిలుపునిచ్చారు.

### త్వరలోనే బీసీ రక్షణ చట్టం

బీసీల సంక్షేమం, సామాజిక న్యాయం కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, చేతల్లో చూపించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని రామారావు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో బీసీలను దగా చేసి, ఇప్పుడు కోర్టుల్లో కేసులు వేస్తూ వారి ప్రగతిని అడ్డుకుంటున్న వైసీపీ నాయకులకు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2014-19 మధ్యకాలంలో చంద్రబాబు నాయుడు గారి హయాంలో బీసీ సబ్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేశాం. 'ఆదరణ' పథకం ద్వారా ఆధునిక పనిముట్లు అందించాం, కుల సంఘాల భవనాల నిర్మాణాలు చేపట్టాం, సబ్సిడీ రుణాలతో బీసీలను ఆర్థికంగా నిలబెట్టాం. కానీ, గత వైసీపీ ప్రభుత్వం బీసీ సబ్ ప్లాన్ నిధులను పూర్తిగా ఇతర పథకాలకు దారిమళ్లించి, సంక్షేమానికి ఒక్క పైసా కూడా కేటాయించకుండా బీసీల పొట్ట కొట్టింది. నేడు రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేసింది. వారి ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. మంత్రి లోకేష్ తన 'యువగళం' పాదయాత్రలో బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనిచేస్తోంది. బీసీల రక్షణ చట్టం కోసం ఇప్పటికే క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశాం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమగ్రంగా చర్చించి, పటిష్టమైన చట్టానికి రూపకల్పన చేసే ప్రక్రియ చివరి దశకు చేరింది. త్వరలోనే బీసీ రక్షణ చట్టం అమల్లోకి వస్తుంది. 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి 16,800 మంది బీసీల రాజకీయ ఎదుగుదలకు సమాధి కట్టిన వైసీపీ నాయకులు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూస్తే కోర్టుల్లో పిటిషన్లు వేసి అడ్డుపడుతున్నారు. బీసీల సామాజిక న్యాయానికి, ప్రగతికి వైసీపీ నాయకులే ప్రధాన నిరోధకులని ప్రజలంతా గమనిస్తున్నారు. బీసీల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి బీసీ సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వైసీపీ చేస్తున్న కుట్రలను ప్రజలు తప్పకుండా తిప్పికొడతారని రామారావు హెచ్చరించారు.

### బీసీల ద్రోహులకు గుణపాఠం తప్పదు

రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే ఓర్వలేని వైసీపీ నాయకులు, కేంద్రం నుంచి రావాల్సిన వేల కోట్ల రూపాయల నిధులను అడ్డుకోవడానికి నీచమైన కుట్రలకు పాల్పడుతున్నారని రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో జరగకపోతే కేంద్ర 16వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోతాయన్న దురుద్దేశంతోనే కోర్టుల్లో కేసులు వేస్తూ అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్ర స్థానిక సంస్థలకు, పల్లెల అభివృద్ధికి సుమారు 16వ ఆర్థిక సంఘం నిధులు రూ. 12,500 కోట్ల నిధులు రావాల్సి ఉంది. ఈ నిధులు వస్తే రాష్ట్ర రూపురేఖలు మారిపోతాయని, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని భయపడుతున్న వైసీపీ.. ఏదో రకంగా ఎన్నికలను ఆపాలని చూస్తోంది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సైతం వివాదాల్లోకి నెడుతూ, కోర్టుల్లో పిల్స్, పిటిషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను స్తంభింపజేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బీసీ సోదరులంతా ఏకతాటిపైకి వచ్చి వైసీపీ ఆడుతున్న కుట్రలను, విష రాజకీయాలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా నిలిచి, బీసీ వ్యతిరేక పార్టీకి గట్టి గుణపాఠం చెప్పాలని, కూటమి అభ్యర్థులను నూరు శాతం భారీ మెజారిటీతో గెలిపించి వైసీపీ చెంపచెళ్లుమనిపించేలా బీసీల సత్తా చాటాలని దువ్వారపు రామారావు విజ్ఞప్తి చేశారు.

# విజయవాడ దసరా ఉత్సవాలకు విచ్చేయండి

- **లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, యూపీ సీఎం యోగికి ఆహ్వానం**
- **మంత్రి సత్యకుమార్‌తో కలిసి ఆహ్వాన పత్రిక అందజేసిన ఎంపీ కేశినేని శివనాథ్**

విజయవాడ/ఢిల్లీ/ఉత్తర్‌ప్రదేశ్ (చైతన్యరథం): విజయవాడలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0కు హాజరుకావాల్సిందిగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లను ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీకనకదుర్గమ్మవారి దివ్య దర్శనం చేసుకుని, విజయవాడలో ఘనంగా నిర్వహించనున్న పవిత్ర దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో, విజయవాడ ఉత్సవ్ 2.0లో పాల్గొనాలని వారిని సాదరంగా ఆహ్వానించారు. విజయవాడ నగరానికి ఉన్న విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యతను, ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పే లక్ష్యంతో ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తి, సంప్రదాయం, కళలు, సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకలు విజయవాడ నగరానికి మరింత ప్రత్యేక గుర్తింపును తీసుకురానున్నాయని పేర్కొన్నారు.





దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0లో ప్రముఖులు, భక్తులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఉత్సవాల విజయవంతానికి సహకరించాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాంక్షించారు. విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని జాతీయ స్థాయిలో ప్రతిబింబించేలా ఈ వేడుకలను నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం

- **రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఉద్ఘాటన**
- **సుప్రీంకోర్టులో చివరి వరకూ చిత్తశుద్ధితో న్యాయపోరాటం చేశాం**
- **కోర్టు తీర్పును గౌరవిస్తాం, పార్టీపరంగా బీసీలకిచ్చిన మాటను నిలబెట్టుకుంటాం**
- **బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్న జగన్, గత స్థానిక ఎన్నికల్లోనూ రిజర్వేషన్లకు గొడ్డలి పెట్టి కోత**
- **జనాభా ప్రాతిపదికను బీసీలకు పదవులు దక్కాలన్నదే మా అభిమతం**

పెనుకొండ/శ్రీసత్యసాయి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం చిట్టచివరి వరకూ, చిత్తశుద్ధితో న్యాయపోరాటం చేశామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తామని, అదే సమయంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని, వీటిని పార్టీ పరంగా వర్తింపజేస్తామని స్పష్టం చేశారు. బీసీలు రాజకీయంగా ఎదగడం జగన్ కు ఇష్టం లేదని, అందుకే హైకోర్టులో కేసులు వేసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నారని మండిపడ్డారు. శ్రీసత్యసాయిజిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా గుర్తింపు లభించేలా టీడీపీ ప్రభుత్వాలు కృషి చేస్తూ వస్తున్నాయన్నారు. 1987లో మొట్టమొదటి సారిగా స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లను అన్న ఎన్టీఆర్ అందజేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు 1995లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారన్నారు. ఆనాటి నుంచి 2021 వరకూ బీసీలకు రిజర్వేషన్లు అమలవుతూ వస్తున్నాయన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరవాత బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి.. 10 శాతం మేర కోత విధించారన్నారు. దీనివల్ల బీసీలు చివరిసారిగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 16,800 పదవులు కోల్పోయారని మంత్రిసవిత ఆవేదన వ్యక్తంచేశారు.



**బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న జగన్**

బీసీలకు జనాభా ప్రాతిపదికన పదవులు దక్కాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగానే బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించాలని నిర్ణయించారన్నారు. బీసీలు రాజకీయంగా ఎదగడం ఇష్టంలేని జగన్.. ఆయన పార్టీ వ్యక్తులతో హైకోర్టులో బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిల్ దాఖలు చేశారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు తీర్పుఇవ్వడంతో, సుప్రీం కోర్టును ఆశ్రయించామన్నారు. టీడీపీకి చెందిన కేంద్రమంత్రి రామ్మోహననాయుడు, రాష్ట్రానికి చెందిన మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో చర్చించారన్నారు. చివరి వరకూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు చిత్తశుద్ధితో న్యాయ పోరాటం చేశామని మంత్రి సవిత వెల్లడించారు..

**పార్టీపరంగా 34 శాతం రిజర్వేషన్లు**

సుప్రీం కోర్టులోనూ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పురావడం బాధాకరమని, దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును శిరసావహిస్తామని మంత్రి సవిత తెలిపారు. కోర్టులు కొట్టేసినా బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి తరపున 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని తెలిపారు. బీసీల బాగుకోరే ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబునాయుడని తెలిపారు. చరిత్రలో ఎరుగని విధంగా బడ్జెట్ లో బీసీల కోసం అత్యధిక నిధులు కేటాయించామన్నారు. బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఎంఎస్ఎంఈ పార్కుల్లో అవకాశమిస్తున్నామన్నారు. అన్ని బీసీ కులాలకు ఆర్థిక మేలు కలిగేలా పథకాలు, అభివృద్ధికార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు పదవులు దక్కాలన్నది తమ లక్ష్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు.

# బీసీల రాజకీయ సాధికారతకు టీడీపీ సముచిత నిర్ణయం

- **స్థానిక ఎన్నికల్లో పార్టీ తరపున 34 శాతం రిజర్వేషన్లు**
- **సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధికి నిదర్శనం**
- **రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు యాదవ్ కృతజ్ఞతలు**

నెల్లూరు (చైతన్యరథం): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు హర్షం వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ సాధికారత, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం పట్ల తెలుగుదేశం పార్టీ నిబద్ధతకు ఈ నిర్ణయం నిదర్శనమన్నారు. బీసీల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, మంత్రి లోకేష్‌కి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

**పార్టీ పరంగా బీసీలకు న్యాయం చేస్తాం**

వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లి 34% రిజర్వేషన్లను అడ్డుకుని బీసీలకు తీరని ద్రోహం చేశారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగకూడదని గొడ్డలి పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారు. బీసీలకు న్యాయం చేయాలన్నదే టీడీపీ లక్ష్యం. వారి హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరి. బీసీలకు 34% రిజర్వేషన్ అంశాన్ని వైసీపీ హయాంలో హైకోర్టు కొట్టివేస్తే సుప్రీంకోర్టుకు వెళ్లకుండా వదిలేసి బీసీలకు తీరని అన్యాయం చేశారు. తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధితో సుప్రీంకోర్టు వరకు వెళ్లి బీసీలకు న్యాయం జరిగేందుకు కృషి చేసింది. బీసీ మంత్రుల బృందం కూడా ఢిల్లీ వెళ్లి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చించడం మా నిబద్ధతకు నిదర్శనం. రిజర్వేషన్లను 50% పరిమితికి పెంచేందుకు అవసరమైన సమాచారాన్ని కూడా న్యాయవాదులకు అందించాం. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే పార్టీ తరపున బీసీలకు 34% రిజర్వేషన్లను ఇస్తాం. బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మస్తాన్ రావు స్పష్టం చేశారు.

**బీసీలకు అండగా తెలుగుదేశం పార్టీ**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. 1987లో ఎన్టీఆర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 1995లో చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచడం బీసీల రాజకీయ సాధికారత దిశగా కీలకమైన ముందడుగులు. ఈ చారిత్రాత్మక నిర్ణయాలు బీసీ వర్గాలకు ప్రజాప్రతినిధులుగా ఎదిగే అవకాశాలను విస్తరింపచేశాయి. అదే స్ఫూర్తితో నేడు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మా నాయకత్వం తీసుకున్న చొరవ అభినందనీయం.

ఈ నిర్ణయం అమలులోకి వస్తే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు తదితర స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం మరింత బలోపేతమవుతుంది. తద్వారా బీసీ వర్గాల సమస్యలు, అవసరాలు పాలనలో తగిన ప్రాధాన్యత పొందడంతో పాటు, ప్రజాస్వామ్య వ్యవస్థలో వారి భాగస్వామ్యం పెరుగుతుంది. రాజకీయంగా బీసీ యువతకు నాయకత్వ అవకాశాలు లభించి, తమ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అవకాశం ఏర్పడుతుంది.



బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పంతో, వారి హక్కులను పరిరక్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న చొరవ ప్రశంసనీయం. అదే సమయంలో బీసీ వర్గాల ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా మంత్రి లోకేష్ కృషి చేస్తున్నందుకు బీసీల తరపున మస్తాన్‌రావు ధన్యవాదాలు తెలియజేశారు.

# టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం

అమరావతి (చైతన్యరథం): బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా సముచిత స్థానం కల్పించింది తెలుగుదేశం పార్టీయేనని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి స్వర్గీయ నందమూరి తారక రామారావు పునాదులు వేయగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దానిని మరింత పెంచి కొనసాగించారని తెలిపారు. 1987లో నందమూరి తారక రామారావు బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో స్థానిక సంస్థల్లో దేశంలోనే తొలిసారిగా 20 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చారని గుర్తుచేశారు. 1996లో సీఎం చంద్రబాబు ఆ రిజర్వేషన్లను దాదాపు 34 శాతానికి పెంచి బీసీలకు ఆత్మస్థైర్యం కల్పించారని పేర్కొన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు కూడా 34 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ వచ్చాయని తెలిపారు. అందరికీ భిన్నంగా జగన్ రెడ్డి, వైసీపీ నాయకులు కుట్రలు పన్ని బీసీలకు అమలవుతున్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారని ఆరోపించారు. 2019లో జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా బీసీ రిజర్వేషన్లలో కోత విధించేందుకు జీవో విడుదల చేశారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఆ జీవోపై తనకు అనుకూలమైన వ్యక్తుల చేత కోర్టులో పిటిషన్లు వేయించి, ప్రభుత్వం తరపున సరైన వాదనలు వినిపించకుండా, సమర్థులైన న్యాయవాదులను నియమించకుండా వ్యవహరించారని విమర్శించారు. తద్వారా బీసీలకు 24 శాతం రిజర్వేషన్లే మిగిలేలా చేసి వారి హక్కులను హరించారని తద్వారా 16,800 మంది బీసీలు రాజ్యాంగబద్ధమైన పదవులకు అవకాశాలను కోల్పోయారని మంత్రి రవీంద్ర దుయ్యబట్టారు.

- 34 శాతం రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నాం
- కుంటిసాకులతో స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు గొడ్డలిపార్టీ పిటిషన్లు
- బీసీలకు, రాష్ట్ర అభివృద్ధికి నష్టం చేయాలని వైసీపీ కుట్రలు
- జగన్ హయాంలో బీసీలకు 50 శాతం పదవులు ఇచ్చామనటం పచ్చి అబద్ధం
- భవిష్యత్‌లో చట్టపరంగా 34 శాతం కోటా అమలుకు సీఎం చంద్రబాబు యోచన: మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ







**అసెంబ్లీలో తీర్మానం**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుపై అసెంబ్లీలో తీర్మానం చేశామని మంత్రి తెలిపారు. గతంలో తీసుకున్న నిర్ణయాలన్నింటినీ చర్చించామని చెప్పారు. స్థానిక ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న సమయంలో జగన్‌రెడ్డి మళ్లీ కుట్ర పన్ని తనకు అనుకూలమైన వ్యక్తుల చేత కోర్టులో పిటిషన్లు వేయించారని ఆరోపించారు. రిజర్వేషన్లను ఎలా అమలు చేయాలనే అంశంపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటు చేసి సర్వే చేయించామని, ఆ కమిషన్ నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనుందని చెప్పారు. నివేదికపై ప్రస్తుతం చర్చ జరుగుతోందని వివరించారు. ఇదిలా ఉండగా, స్థానిక సంస్థల పదవీకాలం ముగిసిందని, పదహారవ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి రావాలంటే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. దాదాపు రూ.12,500 కోట్ల ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి రావాలనే ఉద్దేశంతో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే, అడ్డుకునేందుకు వైసీపీ నేతలు మళ్లీ కుట్రలు మొదలెట్టారని విమర్శించారు.

**ఎన్నికలను అడ్డుకునే యత్నాలు**

హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసి అసలు ఎన్నికలే జరగకుండా చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నించారని మంత్రి రవీంద్ర ఆరోపించారు. రాష్ట్రానికి పదహారవ ఆర్థిక సంఘం నిధులు రాకూడదని, రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని, బీసీల రిజర్వేషన్ హక్కులు అణగదొక్కాలనే ఉద్దేశంతో వైసీపీ నాయకులు కోర్టును ఆశ్రయించారని విమర్శించారు. ఒకవైపు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో అవకతవకలు జరిగాయని మాట్లాడుతున్న వైసీపీ నాయకులు, మరోవైపు 'సర్' నివేదిక వచ్చే వరకు ఎన్నికలు నిర్వహించకూడదంటూ కోర్టులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. వైసీపీ ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనించాలని కోరారు. రాష్ట్రానికి రూ.12,500 కోట్ల నిధులు వస్తే ప్రజలకు మౌలిక వసతులు కల్పించవచ్చని, తద్వారా రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. రోజురోజుకీ వైసీపీ రాజకీయంగా దిగజారిపోతోందని, పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి ఉందని ఆ పార్టీ సర్వేలు సూచిస్తున్నాయని వ్యాఖ్యానించారు. అభ్యర్థులు దొరకరనే భయంతోనే ఎన్నికలను ఆపేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లను అణగదొక్కడం, ఆర్థిక సంఘం నిధులు రాకుండా చేయడమే వారి ప్రయత్నమన్నారు.

**గ్రామీణ వ్యవస్థను వైసీపీ నాశనం చేసింది**

ఐదేళ్ల పాలనలో రాష్ట్ర గ్రామీణ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా సర్వనాశనం చేసిందని మంత్రి రవీంద్ర విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండున్నర సంవత్సరాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, సాస్కి నిధులతోనూ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇటీవల వీబీ జీ రాంజీ పనుల కింద రూ.11,500 కోట్లను తీసుకువచ్చామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రూ.5,500 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.5,500 కోట్లు అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొందని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరగడం జగన్ రెడ్డికి ఇష్టం లేదని, ప్రజలు ఆనందంగా ఉండటాన్ని ఆయన చూడలేకపోతున్నారని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో కుట్రలతో రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఇప్పుడు కూడా ఏదో ఒక రూపంలో రాష్ట్రాన్ని పట్టిపీడించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

**బీసీల ఎదుగుదలకు అడ్డు**

రాజశేఖర్ రెడ్డి, రాజా రెడ్డి కాలం నుంచి బీసీల పట్ల ఒకరకమైన వ్యతిరేక ఆలోచనా ధోరణి ఉందని మంత్రి రవీంద్ర ఆరోపించారు. బీసీలు ఎదిగితే తమకు రాజకీయంగా అడ్డంకి అవుతారనే భావనతోనో, బీసీలు మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉన్నారనే కక్షతోనో వ్యవహరించారని విమర్శించారు. గతంలో జింకా వెంకట నరసయ్యకు సంబంధించిన గనిని ఆక్రమించుకుని, ఆయనను హత్య చేశారని ఆరోపించారు. బీసీ నాయకుడి పునాదుల మీద నుంచి ఎదిగిన కుటుంబమే రాజశేఖర్ రెడ్డి కుటుంబమని వ్యాఖ్యానించారు. ఆ కుటుంబం నుంచి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు రాష్ట్రంలో బీసీలను అణగదొక్కే కార్యక్రమాలు చేస్తున్నారని విమర్శించారు. రిజర్వేషన్ల నుంచి మొదలుకొని, అప్పట్లో బీసీ నాయకులుగా ఉన్నవారిపై కేసులు పెట్టి జైళ్లకు పంపించడం, అనేక మందిని హత్య చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. తోట చంద్రయ్యను నడిరోడ్డుపై గొంతు కోసి హత్య చేయడం, నందం సుబ్బయ్య, అమర్నాథ్ గౌడ్‌లపై పెట్రోల్ పోసి తగలబెట్టడం వంటి ఘటనలను రాష్ట్ర ప్రజలు మర్చిపోతారని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. బీసీల ఆస్తులను దౌర్జన్యంగా లాక్కోవడం వంటి ఘటనలు కూడా జరిగాయని అన్నారు. ఇన్ని దారుణాలకు పాల్పడ్డ వైసీపీ నాయకులు ఈరోజు కల్లబొల్లి మాటలు చెబుతూ రాజకీయంగా లబ్ధి పొందాలని ప్రయత్నిస్తే బీసీ సోదరులు నమ్మరని మంత్రి రవీంద్ర స్పష్టం చేశారు.

**బీసీ కార్పొరేషన్లకు నిధులు**

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బీసీలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని మంత్రి రవీంద్ర అన్నారు. వైసీపీ ప్రభుత్వం పేరుకే బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి, కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకుండా చేసిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అన్ని కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తోందని తెలిపారు. వాటిని సమర్థవంతంగా నడిపించడం, బీసీలను ఆర్థికంగా పైకి తీసుకురావడం కోసం అవసరమైన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. చేనేతలకు, నాయీ బ్రాహ్మణ సోదరులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, చేనేత కార్మికులకు నేతన్నల సేవలో, మత్స్యకారులకు మత్స్యకార సేవ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మద్యం దుకాణాల్లో గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించామని, మైనింగ్‌లో వడ్డెర సోదరులకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ఈ విధంగా అన్ని బలహీన వర్గాలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**చట్టపరంగా రిజర్వేషన్ల అమలుకు చర్యలు**

బీసీ కమిషన్ ఇచ్చే నివేదికను చట్టపరంగా ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తున్నామని కొల్లు రవీంద్ర తెలిపారు. రాబోయే కాలంలో స్థానిక సంస్థల్లో బలహీన వర్గాలకు 34 శాతం కన్నా ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి వారిని నిలబెట్టుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భవిష్యత్తులో చట్టపరంగా ఈ రిజర్వేషన్లను అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టం చేశారు. గతంలో అవకాశం ఉన్నప్పటికీ బీసీ రిజర్వేషన్ల కోసం వైఎస్ రాజశేఖరరెడ్డిగానీ, జగన్ గానీ పార్లమెంట్ స్థాయిలో ఏమీ చేయలేదని విమర్శించారు. ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వారు చేసిన కుట్రలను రాష్ట్ర ప్రజలు మర్చిపోరని వ్యాఖ్యానించారు. రాష్ట్రం కోసం, బలహీన వర్గాల కోసం, అభివృద్ధి కోసం నిబద్ధతతో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని తెలిపారు.

**ఎన్నికల వాయిదాకు యత్నాలు**

స్థానిక ఎన్నికలు జరగకుండా చేసేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని మంత్రి రవీంద్ర ఆరోపించారు. హైకోర్టు నిర్ణయం తర్వాత సుప్రీంకోర్టులోనూ ఈ వ్యవహారాన్ని సాగదీయాలని కోరుకున్నారని, ఎన్నికలు జరగకుండా ఉండాలన్నదే వారి లక్ష్యమని అన్నారు. "సర్" కార్యక్రమానికి, బీసీ రిజర్వేషన్ల అంశానికి సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ, ఒకవైపు ఆ కార్యక్రమంపై విమర్శలు చేస్తూ, మరోవైపు దానికి సంబంధించిన ఓటరు జాబితాలు వచ్చే వరకు ఎన్నికలను ఆపాలని కోరుతున్నారని అన్నారు. దీని వెనుక రాష్ట్రానికి రావాల్సిన రూ.12,500 కోట్ల పదహారవ ఆర్థిక సంఘం నిధులను అడ్డుకోవాలనే కుట్ర ఉందని ఆరోపించారు. ఎన్నికలు జరగకుండా చేయడం ద్వారా వైసీపీ నాయకులను కాపాడుకోవచ్చని ఆ పార్టీ భావిస్తోందని విమర్శించారు. ఆ పార్టీ నుంచి చాలామంది బయటకు వస్తున్నారని, రాజకీయంగా దూరమవుతున్నారని తెలిపారు. జగన్ రెడ్డి పోకడ, విధానం నచ్చక ఆ పార్టీ నేతలు చాలామంది బహిరంగంగానే విమర్శిస్తున్నారన్నారు. ఈ పరిణామాలను తప్పించుకోవడానికి, ఎన్నికలను వాయిదా వేయించడానికి అన్ని రకాలుగా ప్రయత్నించినప్పటికీ వైసీపీ విఫలమైందని పేర్కొన్నారు.

**జగన్ హయాంలో బీసీలకు అన్యాయం**

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు 50 శాతం పదవులు ఇచ్చామని చెప్పటం సరికాదన్నారు. బీసీలకు హక్కుగా రావాల్సిన పదవులను ఇచ్చి, వారేదో 50 శాతం పదవులు ఇచ్చామని చెబితే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. బీసీ కార్పొరేషన్లలో సంబంధిత సామాజిక వర్గాలకు చెందినవారికే పదవులు ఇస్తారని, వాటిని ఇచ్చి బీసీలకు 50 శాతానికి పైగా పదవులు ఇచ్చామని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్రంలోని బీసీ వర్గాలు ఈ వాదనను నమ్మే పరిస్థితిలో లేవన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క కార్పొరేషన్‌కు కూడా నిధులు ఇవ్వలేదని, ఒక్క బీసీ సోదరుడు కూడా ఆర్థికంగా పైకి వచ్చిన పరిస్థితి లేదని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్కులను ఏర్పాటు చేస్తూ యువతకు, బలహీన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు వెళుతున్నారని తెలిపారు. బీసీలు ఆర్థిక అభివృద్ధిని కోరుకుంటారని, ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేస్తుంటే వారు చూస్తూ ఊరుకోరని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# బీసీలకు 34శాతం రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

- న్యాయస్థానాలను గౌరవిస్తూనే పార్టీ పరంగా అమలుకు చర్యలు
- బీసీలకు సముచిత ప్రాతినిధ్యం సీఎం చంద్రబాబు ధ్యేయం
- గొడ్డలిపార్టీ అధికారంలో ఉండగా బీసీలకు అన్యాయం, నేడు మొసలి కన్నీరు
- జగన్ పాలనలో రిజర్వేషన్లను 24 శాతానికి ఎందుకు పరిమితం చేశారు?
- బీసీలకు జరిగిన అన్యాయంపై వైసీపీ సమాధానం చెప్పాలి
- గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గళ్లా మాధవి



అమరావతి (చైతన్యరథం): బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గళ్లా మాధవి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీలకు పార్టీ పరంగా న్యాయం చేసేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం నాడు, నేడు, ఎప్పటికీ బీసీల కోసం కట్టుబడి ఉన్న పార్టీగా రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. అన్న ఎన్టీ రామారావు 20 శాతం బీసీ రిజర్వేషన్లతో ప్రారంభించిన ప్రక్రియను చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 34 శాతం రిజర్వేషన్ల వరకు తీసుకెళ్లామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే ఆంధ్రప్రదేశ్‌లో బీసీ ప్రజానీకం రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు వారి జీవితాల్లోనూ సుస్థిరమైన మార్పును చూస్తూ వచ్చిందన్నారు.

**బీసీలకు న్యాయంలో రాజీ పడేది లేదు**

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం, రాజకీయంగా వారికి తగిన స్థానాలు అందించడం విషయంలో ఎలాంటి రాజీ పడకుండా సముచిత న్యాయం చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దానికి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ అయినా, నేటి కూటమి ప్రభుత్వం అయినా ఎప్పుడూ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న నాయకత్వమేనని అన్నారు. తెలుగుదేశం పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూనే వచ్చిందని, రాజకీయంగా వారికి ప్రాతినిధ్యం అందించడంతో పాటు ఎందరో బీసీ నాయకులను తయారు చేసిందని తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ, వారిని రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే కూటమి నాయకత్వ లక్ష్యమని గల్లా మాధవి పేర్కొన్నారు. దీనికి సీఎం చంద్రబాబు నాయుడు మొదటి నుంచి కట్టుబడి ఉన్నారని ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు.

**బీసీ రిజర్వేషన్లపై వైసీపీ వైఖరి ఏమిటి?**

కేవలం రాజకీయంగా లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే రిజర్వేషన్ల ప్రక్రియను వక్రీకరిస్తూ గొడ్డలి పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే మాధవి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీ తీర్మానం చేసి జీఓలు జారీ చేసినప్పటి నుంచి గొడ్డలి పార్టీ కోర్టును ఆశ్రయించి కౌంటర్ పిటిషన్లు దాఖలు చేసిందన్నారు. వైసీపీ పాలనలో సహాయ ప్రభుత్వ న్యాయవాదులుగా పనిచేసిన వ్యక్తుల నుంచి కూడా ఈ పిటిషన్లు వచ్చాయని పేర్కొన్నారు. 34 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారని, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతాయని చెబుతూ ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా కోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. బీసీలకు ప్రభుత్వం ఏదైనా చేయాలని ఆలోచించిన ప్రతిసారీ దాన్ని రాజకీయంగా ఎలా ఉపయోగించుకోవాలనే ఎజెండాతో వ్యవహరిస్తున్న పార్టీ ఏదైనా ఉందంటే అది వైసీపీయేనని విమర్శించారు. 34 శాతం రిజర్వేషన్లు రావని, అది తమకు ముందే తెలుసని, ప్రభుత్వం కావాలనే ఈ ప్రయత్నం చేసిందని కొందరు మాట్లాడుతున్నారని గల్లా మాధవి అన్నారు. నిజంగా జగన్‌మోహన్ రెడ్డికి, ఆయన నాయకులకు సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలు ఎలాంటి తీర్పులు ఇస్తాయో ముందే తెలిసే సామర్థ్యం ఉంటే, వారి నాయకులు కుంభకోణాలకు పాల్పడకుండా ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. తాము మాత్రం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతోనే సుప్రీంకోర్టును ఆశ్రయించామని తెలిపారు. అక్కడ సాధ్యం కాదని తీర్పు వచ్చినంత మాత్రాన వెనక్కి తగ్గి తమ ప్రయత్నాన్ని విరమించుకోలేదని చెప్పారు. చట్టాన్ని గౌరవిస్తూనే బీసీలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు.

**వైసీపీ హయాంలో బీసీలకు జరిగిన మేలు ఏమిటి?**

వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఏం చేసిందని ఎమ్మెల్యే మాధవి ప్రశ్నించారు. చట్టాన్ని గౌరవించామని చెప్పుకోవడం కాదని, బీసీలకు ఏం చేశారన్నదే ముఖ్యమని అన్నారు. రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి ఎందుకు పరిమితం చేశారని నిలదీశారు. బీసీలకు సముచిత న్యాయం కోసం పోరాడుతున్నామని చెప్పుకునే వైసీపీ, 34 శాతం రిజర్వేషన్ల కోసం ఎందుకు గట్టిగా నిలబడలేదని ప్రశ్నించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎందుకు ప్రకటించలేదని అడిగారు. 16,800 రాజకీయ ప్రాతినిధ్య అవకాశాలకు బీసీలను దూరం చేసిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేలా వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేకపోయిందని విమర్శించారు. బీసీలకు రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించడంలో వైసీపీ విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ చరిత్రను పరిశీలించినా బీసీలకు సముచిత న్యాయం చేసిన సందర్భాలు కనిపించడం లేదని గల్లా మాధవి అభిప్రాయపడ్డారు. కడప రాజకీయాలను ఉదాహరణగా తీసుకుంటే, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీ నాయకుడిని నిలబెట్టి గెలిపించేందుకు ప్రయత్నించిన సందర్భంలో, దానికి వ్యతిరేకంగా రెబల్ అభ్యర్థిని నిలబెట్టి ఓడించారని గుర్తుచేశారు. బీసీ నాయకత్వం ఎదగడాన్ని సహించని రాజకీయ ధోరణి అప్పట్లోనూ కనిపించిందని అన్నారు. అలాంటి రాజకీయ నేపథ్యం ఉన్న నాయకత్వం ఈరోజు బీసీల అభ్యున్నతి గురించి మాట్లాడటం ఎంతవరకు సమర్థనీయమని ప్రశ్నించారు. వారి పాలనలో బీసీలకు ఎంతో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించామని, మంత్రులుగా అవకాశాలు ఇచ్చామని వైసీపీ నాయకులు గొప్పగా చెప్పుకుంటున్నారని గల్లా మాధవి అన్నారు. అయితే ఆ నాయకుల పరిస్థితి ఏమిటో ఒకసారి విశ్లేషించాలని సూచించారు. వారి ప్రభుత్వం చేసిన తప్పులను సమర్థించడానికి, కుంభకోణాలపై ఎదురయ్యే విమర్శలను తిప్పికొట్టడానికి మాత్రమే బీసీ నాయకులను ఉపయోగించుకున్నారనే విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. బీసీ నాయకులను రాజకీయ అవసరాలకు వాడుకోవడం తప్ప, ఆ వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు వైసీపీ నాయకత్వం ఏనాడూ ఆలోచించలేదని ఎమ్మెల్యే మాధవి దుయ్యబట్టారు.

**బీసీ సంక్షేమ నిధులపై సమాధానం చెప్పాలి**

వైసీపీ పాలనలో కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని చెప్పుకోవడం ఒక్కటే సరిపోదని ఎమ్మెల్యే మాధవి అన్నారు. వాటికి నిధులు ఎంత కేటాయించారు? బీసీ సంక్షేమం కోసం కేటాయించిన నిధులను ఎలా ఖర్చు చేశారు? బీసీల సంక్షేమానికి కేటాయించిన నిధుల్లో దాదాపు రూ.70 వేల కోట్లను దారి మళ్లించలేదా? బీసీ కుటుంబాలు నిజంగా ఆర్థికంగా, రాజకీయంగా లబ్ధి పొందేలా ఏం చేశారు? అన్న ప్రశ్నలకు వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలకు నిజంగా మేలు జరగాలనే ఉద్దేశం ఉంటే, రిజర్వేషన్లను అడ్డుకునేలా కోర్టులో పిటిషన్లు ఎందుకు వేయించారని నిలదీశారు. ఇదే బీసీల పట్ల వైసీపీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని విమర్శించారు. బీసీల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని, బీసీ కుటుంబాలకు తగిన న్యాయం చేయలేదని ఆరోపించారు. అంతేకాకుండా వైసీపీ పాలనలో జరిగిన దమనకాండకు 300 మంది బీసీలు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజల పట్ల చిన్నచూపు ప్రదర్శించిన నాయకత్వం ఈ రోజు బీసీలకు ద్రోహం జరుగుతోందని మాట్లాడటం ఎంతవరకు సమర్థనీయమని ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న విమర్శగా కనిపించడం లేదా అని నిలదీశారు.

**బీసీలకు సముచిత ప్రాతినిధ్యమే లక్ష్యం**

కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మాధవి మరోసారి స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం, బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేయడం, బీసీ కుటుంబాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవడం తమ లక్ష్యమని తెలిపారు. తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకత్వం ఈ లక్ష్యంతోనే ముందుకు వెళ్తాయని చెప్పారు. ఇప్పటికైనా బీసీల రిజర్వేషన్లపై చేస్తున్న విమర్శలను వైసీపీ నాయకులు ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రతి అంశాన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోకుండా ప్రజల సంక్షేమం కోసం నిలబడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి విజ్ఞప్తి చేశారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లే లక్ష్యం

- వారి అభ్యున్నతికి కట్టుబడిన టీడీపీ
- కోర్టు కేసులతో రిజర్వేషన్లకు వైసీపీ అడ్డంకులు
- పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

అమరావతి (చైతన్యరథం): బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి కట్టుబడి ఉందని కృష్ణాజిల్లా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కూటమి ప్రభుత్వ ప్రయత్నాలను కోర్టు కేసుల ద్వారా అడ్డుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు బీసీలకు తొలిసారిగా 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే.. ఆ తర్వాత నారా చంద్రబాబు నాయుడు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని రాజకీయంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు పునాది వేశారని తెలిపారు. బీసీలకు మేలు జరగడం వైసీపీకి ఇష్టం లేదని, అందుకే న్యాయస్థానాల్లో కేసులు వేస్తూ రిజర్వేషన్ల అమలుకు అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ నాయకులైన కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, తదితరులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు.

**బీసీలకు సముచిత స్థానం టీడీపీ విధానం**

తెలుగుదేశం పార్టీలో కీలకంగా ఉంటూ రాష్ట్రానికి సేవలందించిన బీసీ నాయకత్వాన్ని అణగదొక్కేందుకు వైసీపీ హయాంలో ప్రయత్నాలు జరిగాయన్నారు. ఇప్పుడు కూడా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకునేందుకు ఆ పార్టీ న్యాయస్థానాలను ఆశ్రయిస్తోందని ఆరోపించారు. బీసీల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని కృష్ణప్రసాద్ వివరించారు. గౌడ సామాజిక వర్గానికి ఇచ్చిన హామీ మేరకు మద్యం దుకాణాలు, బార్ల కేటాయింపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. చేనేత రంగానికి సంబంధించి రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చడంతోపాటు, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న చేనేత సొసైటీల బకాయిలను విడతలవారీగా చెల్లిస్తూ ఆ రంగాన్ని ఆదుకుంటోందని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి వేట నిషేధ సమయంలో అందించే ఆర్థిక సాయాన్ని గతంలో ఉన్న రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి వారిని ఆదుకుంటోందని చెప్పారు. బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఉన్నత పదవులు కల్పించడంలో తెలుగుదేశం పార్టీకి ప్రత్యేక చరిత్ర ఉందని కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ పదవిని బీసీ సామాజిక వర్గానికి చెందిన తన తండ్రి కాగిత వెంకటరావుకి ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మరోవైపు వైసీపీ ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లను ఏర్పాటు చేసినప్పటికీ, వాటికి తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తూ ఆయా వర్గాల సంక్షేమానికి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 1976లో ఎస్వీ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే చంద్రబాబు నాయుడు బీసీలకు నాయకత్వంలో అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో



సభ్యుడిగా అవకాశం కల్పించడమే ఆ పార్టీ బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమన్నారు. బీసీ నాయకులను తయారు చేసి, వారికి ఉన్నత రాజకీయ స్థానాలు కల్పించడం తెలుగుదేశం పార్టీ విధానమని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ చెప్పారు.

**వైసీపీకి, టీడీపీకి అదే తేడా..**

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై తెలుగుదేశం పార్టీ, వైసీపీల వైఖరిలో స్పష్టమైన తేడా ఉందని కృష్ణప్రసాద్ అన్నారు. గతంలో హైకోర్టులో ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు వైసీపీ ప్రభుత్వం 24శాతం రిజర్వేషన్లకే పరిమితమైందని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం హైకోర్టులో అనుకూల నిర్ణయం రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించిందని తెలిపారు.

చైతన్యరథం

# స్థానిక సంస్థల అభివృద్ధికి జగన్ మోకాలడ్డు

- ఎన్నికలు జరక్కపోతే 16వ ఆర్థిక సంఘం నిధులు రావని తెలిసీ కోర్టుల్లో కేసులు
- ఓటమి భయంతోనే కుంటిసాకులతో న్యాయస్థానాల్లో పిటిషన్లు
- ఐదేళ్ల పాలనలో పల్లెలను ముంచేసిన చరిత్ర జగన్‌ది
- కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వెలుగులు
- స్థానిక ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు మరోసారి బుద్ధి చెప్పటం ఖాయం
- టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్



అమరావతి (చైతన్యరథం): 2024 ఎన్నికల్లో ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఛీత్కరించినా వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీరులో ఏ మాత్రం మార్పు రాలేదని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2024 ఎన్నికల ముందు "వై నాట్ 175, వై నాట్ కుప్పం, వై నాట్ పిఠాపురం అంటూ తన పార్టీ క్యాడర్‌ను మోసం చేసి, చివరకు తనను తాను మోసం చేసుకున్న నాయకుడు జగన్మోహన్ రెడ్డి.. ఎన్నికల్లో ప్రజలు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ఇంటికి పంపితే, ఓటమిని హుందాగా అంగీకరించకుండా ప్రజాతీర్పును కించపరిచారని విమర్శించారు. ఈవీఎంలను మేనేజ్ చేశారని, వ్యవస్థలను వాడుకున్నారని నిస్సిగ్గుగా మాట్లాడారు. నిజంగానే ప్రజల్లో తనకు ఇంకా ఆదరణ ఉందని జగన్ అనుకుంటే, ఇప్పుడు బ్యాలెట్ విధానంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఎందుకు ఎదుర్కోలేకపోతున్నారు? పార్టీ ఇన్‌ఛార్జ్‌ల సమావేశంలో "విజయమో వీరస్వర్గమో తేల్చుకోవాలి, ఒక్క సీటు ఏకగ్రీవమైనా ఊరుకోను అంటూ నాయకులను బెదిరిస్తున్న జగన్, మరోపక్క తెరవెనుక మాత్రం కోర్టుల్లో పిటిషన్లు వేయిస్తూ ఎన్నికలను వాయిదా వేయించేందుకు కుట్రలు చేస్తున్నారు. సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు ఆపాలని, వార్డుల పునర్విభజన బాగోలేదని రకరకాల కుంటిసాకులతో కోర్టులను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రంలో సర్ ప్రక్రియపై హైకోర్టు ఇప్పటికే స్పష్టతనిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 44.28 లక్షలకు పైగా నోటీసులు జారీ చేసి, వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించగా ప్రస్తుతం కేవలం 73,314 ఓట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఇది మొత్తం రాష్ట్ర ఓటర్లలో 0.47% మాత్రమే. ఈ స్వల్ప శాతాన్ని బూచిగా చూపి హైకోర్టులో మొట్టికాయలు తిన్నా, మళ్లీ సుప్రీంకోర్టు దాకా వెళ్లి ఎన్నికలను అడ్డుకోవాలని చూడడం జగన్ పిరికితనానికి నిదర్శనం. స్థానిక ఎన్నికలు సకాలంలో జరిగితేనే కేంద్రం నుంచి 16వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.16,627 కోట్లు రాష్ట్రానికి అందుతాయి. ఈ నిధులు వస్తే పల్లె పండుగ-3 కింద రూ.11,085 కోట్లు, పట్టణాల్లో ముఖ్యమంత్రి ప్రారంభించిన రూ.50,000 కోట్ల పనులతో కలిపి సుమారు రూ.60,000 కోట్ల పైచిలుకు అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తవుతాయి. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం లాంటి కనీస మౌలిక వసతులు ప్రజలకు దక్కకుండా చేసి, ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించాలనే రాక్షస ఆలోచనతోనే వైసీపీ ఎన్నికలకు అడ్డంకులు సృష్టిస్తోంది. బీసీ రిజర్వేషన్లు, సర్ ప్రక్రియల పేరుతో కాలయాపన చేస్తూ పారిపోవాలని చూస్తున్న వైసీపీకి స్థానిక ఎన్నికల్లోనూ ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అప్పసాని రాజేష్ స్పష్టం చేశారు.

### వైసీపీ కుంటిసాకులు

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడాన్ని, ప్రజలకు అందాల్సిన పౌరసేవలను అడ్డుకోవాలనే దుర్మార్గపు ఆలోచనతోనే వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తోందని రాజేష్ ధ్వజమెత్తారు. వైసీపీ నేతలు స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు రకరకాల సాకులు వెతుకుతున్నారు. బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను వంకగా చూపుతూ, రకరకాల కుంటిసాకులతో న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. వారి తీరు చూస్తుంటే ప్రజల్లోకి వెళ్లి ఎన్నికలను ఎదుర్కొనే నైతిక స్థైర్యం, దమ్ము వారికి లేవని స్పష్టంగా అర్థమవుతోంది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తున్నాం. పల్లెల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటమి భయంతోనే వైఎస్సార్‌సీపీ పారిపోతోంది. గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చేందుకు 'పల్లె పండుగ 1, 2' ద్వారా ఇప్పటికే సుమారు రూ. 16,960 కోట్లతో భారీ ఎత్తున అభివృద్ధి పనులు పూర్తి చేశాం. 7,500 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం, 8,300 కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు పూర్తి చేశాం. రైతులు, పశుపోషకుల కోసం 37,817 మినీ గోకులాల నిర్మాణం, మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు 15,188 పశువుల తాగునీటి తొట్ల నిర్మాణం చేశాం. గ్రామీణ ప్రజలు, రైతుల ప్రయోజనార్థం దాదాపు 1.70 లక్షల ఫామ్ పాండ్స్ (రైతు కుంటల) నిర్మాణం పూర్తి చేశాం. గ్రామాల్లో అభివృద్ధిని ఇంతటితో ఆపకుండా, 'పల్లె పండుగ 3' ద్వారా సరికొత్త పనులకు శ్రీకారం చుట్టాం. రూ. 2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు, రూ. 7,500 కోట్లతో 9,500 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లు, రూ. 300 కోట్లతో మరో 22,000 మినీ గోకులాల నిర్మాణపనులు ప్రారంభించాం. రూ. 225 కోట్లతో సుమారు 50,000 ఎకరాల్లో ఉద్యాన పంటల విస్తరణ, గ్రామ గ్రామాన అభివృద్ధి పనులు ఇంత స్పష్టంగా కళ్లముందు కనిపిస్తుంటే, ప్రజలు తమను చిత్తుగా ఓడిస్తారనే భయంతోనే జగన్మోహన్ రెడ్డి అండ్ కో ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రజల పక్షాన నిలబడి గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాజేష్ స్పష్టం చేశారు.

### ఓట్లు అడిగే నైతిక హక్కు జగన్‌కు లేదు

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంటే, దాన్ని చూసి ఓర్వలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని రాజేష్ మండిపడ్డారు. ప్రస్తుతం అదనంగా రూ. 110 కోట్ల వ్యయంతో 1,000 కిలోమీటర్ల మేర 'మ్యాజిక్ డ్రైన్ల' నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఇలాంటి అభివృద్ధి పనులు పల్లెల్లో నిరంతరం సాగుతుంటే చూసి వైసీపీ నేతలు తట్టుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. గ్రామాల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసిన తర్వాత, మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లి ఓట్లు అడిగే నైతికత వైసీపీకి ఏమాత్రం లేదు. ఐదేళ్ల పాలనలో పల్లెలను సర్వనాశనం చేసిన చరిత్ర వారిది. 2019-2024 మధ్య కాలంలో జగన్ సర్కార్ స్థానిక సంస్థలను ఎలా కాలరాసిందో రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదు. 2020లో కరోనా వల్ల వాయిదా పడిన ఎన్నికలను, 2021లో నిర్వహించిన సమయంలో రాష్ట్రవ్యాప్తంగా సాగించిన అరాచకాలు, భయానక పరిస్థితులు అందరికీ గుర్తున్నాయి. ప్రతిపక్షాలు నామినేషన్లు వేయకుండా దాడులు చేయడం, బలవంతంగా విత్‌డ్రాయల్స్ చేయించడం, బెదిరింపులతో ఏకగ్రీవాలు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. వార్డు మెంబర్ నుంచి సీఎం వరకు రాష్ట్రంలో 94% ప్రజాప్రతినిధులు తమ పార్టీ వారేనని నాడు జగన్ గొప్పలు చెప్పుకున్నారు. మరి అంతమంది ఉండి గ్రామాలకు ఒరగబెట్టింది ఏమిటి? నాడు వారు మిగిల్చిన వారసత్వం ఏంటంటే.. బస్సులు కూడా గుంతల్లో దిగబడిపోయే దారుణమైన రోడ్లు, గ్రామాల్లో పేరుకుపోయిన లక్షలాది టన్నుల చెత్త, కంపుకొట్టే పారిశుధ్య లోపాలు మాత్రమే. జగన్మోహన్ రెడ్డి పాలనలో కేంద్రం స్థానిక సంస్థలకు కేటాయించిన 14వ, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా పక్కదారి పట్టించింది. గ్రామ పంచాయతీల ఖాతాల నుంచి దొంగచాటుగా నిధులను మళ్లించడంతో, ప్రజలకు సమాధానం చెప్పుకోలేక సొంత పార్టీ ప్రజాప్రతినిధులే నిస్సహాయులయ్యారు. వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచులే పంచాయతీరాజ్ చాంబర్‌ను ముట్టడించి, జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు చేసిన చరిత్రను ఎవరూ దాచలేరు. పంచాయతీలను డిఫాల్టర్లుగా మార్చి, నిధులు లేకుండా నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌దే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెసీమల రూపురేఖలు మార్చేందుకు పటిష్ట ప్రణాళికలతో ముందుకెళ్తోందని, పల్లె ప్రజలు మళ్లీ జగన్ మాటలను నమ్మే పరిస్థితిలో లేరని రాజేష్ స్పష్టం చేశారు.

### కూటమి హయాంలో గ్రామీణ విప్లవం

వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసి, గ్రామీణ వ్యవస్థను అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని రాజేష్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు చెల్లించాల్సిన 'పర్ క్యాపిటా గ్రాంట్'ను వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టారు. గ్రామాల్లో వసూలయ్యే వృత్తి పన్నును కూడా పంచాయతీల ఖాతాలకు జమ చేయలేదు. చివరకు ఐదేళ్ల కాలంలో రాజ్యాంగబద్ధమైన 'స్టేట్ ఫైనాన్స్ కమిషన్'ను కూడా నియమించకుండా గ్రామాలను నిధుల లేమితో కొట్టుమిట్టాడేలా చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థను గొప్పగా ప్రచారం చేసుకున్న జగన్, వాటి నిర్వహణకు ప్రత్యేక నిధులు ఇవ్వలేదు. సచివాలయాల ఇంటర్నెట్ బిల్లులు, స్టేషనరీ ఖర్చులను పంచాయతీల జనరల్ ఫండ్స్ నుంచే బలవంతంగా చెల్లించేలా చేసి, స్థానిక సంస్థలపై అదనపు భారం మోపారు. 'సంక్షేమ లబ్ధిదారుడు, వాలంటీర్ ఉంటే చాలు.. స్థానిక ప్రజాప్రతినిధులతో పనేంటి?' అన్న అహంకారపూరిత ధోరణితో జగన్ వ్యవహరించారు. పాము తన గుడ్లను తానే తిన్నట్లుగా.. తన పార్టీ నుంచి గెలిచిన సర్పంచులు, వార్డు మెంబర్లను సైతం డమ్మీలుగా మార్చి, స్థానిక నాయకత్వాన్ని పూర్తిగా నాశనం చేశారు. దీనితో వైసీపీ ప్రజాప్రతినిధులే ఆయన నాయకత్వంపై విసిగిపోయారు. కూటమి ప్రభుత్వం రాగానే గత ప్రభుత్వం మిగిల్చిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ అభివృద్ధి బాట పట్టించాం. 2014-19 మధ్య నారా లోకేష్ పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నప్పుడు ఉపాధి హామీ అనుసంధానంతో దాదాపు 25,000 కిలోమీటర్ల సీసీ రోడ్లను నిర్మించి సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో 'పల్లె పండుగ' (1, 2, 3) ద్వారా వేలాది కిలోమీటర్ల మేర సీసీ, బ్లాక్ టాప్ రోడ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల కష్టాలను తీర్చేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో 'అడవి తల్లి బాట' కార్యక్రమాన్ని చేపట్టారు. రూ. 383 కోట్ల అంచనా వ్యయంతో 3,215 కిలోమీటర్ల మేర రోడ్ల లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, ఇప్పటికే 1,974 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసి డోలీ రహిత గ్రామాల సాధన దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధిని కళ్లముందు ఉంచి సూటిగా ఓట్లు అడిగే ధైర్యం, నైతికత కూటమి ప్రభుత్వానికి మాత్రమే ఉంది. అందుకే బ్యాలెట్ విధానంలోనైనా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. అయితే, 2024 ఎన్నికల నాటి ఘోర పరాభవం 2026 స్థానిక ఎన్నికల్లోనూ తప్పదనే నైరాశ్యంతో, కోర్టులను ఆశ్రయిస్తూ ఎన్నికలను వాయిదా వేయించేందుకు, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లను కాలయాపన చేయించేందుకు వైసీపీ కుట్రలు చేస్తోంది. జగన్ ఎన్ని కుతంత్రాలు చేసినా ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయమని రాజేష్ ధీమా వ్యక్తం చేశారు.

---

## పెద్దపులి సంచారంపై ఆందోళన వద్దు

- పూణేకు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాన్ని రప్పిస్తున్నాం
- పులిని పట్టుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు
- నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు మంత్రి దుర్గేష్ భరోసా
- స్పెయిన్ నుండి వీడియో సందేశం విడుదల




నిడదవోలు (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండల పరిధిలోని కాల్దారి, సూర్యరావుపాలెం, తాడిమళ్ల, కోరుమామిడి, పసలపూడి, తదితర ప్రాంతాల సమీప పొలాల్లో పెద్దపులి సంచరిస్తున్న వార్తలపై స్పెయిన్ పర్యటనలో ఉన్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం వీడియో సందేశం ద్వారా ప్రజలకు ధైర్యం చెబుతూ తక్షణ రక్షణ చర్యలను వివరించారు. పులి సంచారం పట్ల నియోజకవర్గ ప్రజలెవరూ ఎలాంటి అనవసర ఆందోళనకు గురికావద్దని మంత్రి దుర్గేష్ భరోసానిచ్చారు. సమాచారం అందిన వెంటనే తాను స్వయంగా జిల్లా అటవీ శాఖాధికారితో మాట్లాడినట్లు తెలిపారు. స్థానిక పోలీసులు, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పటిష్టమైన నియంత్రణ చర్యలు చేపడుతున్నారని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో మండపేట నియోజకవర్గం రాయవరం వద్ద పులిని విజయవంతంగా బంధించిన పూణేకు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాన్ని మళ్లీ నిడదవోలుకు రప్పించేందుకు తక్షణ ఏర్పాట్లు చేసినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఈ ప్రత్యేక బృందం శనివారం మధ్యాహ్నానికల్లా నిడదవోలుకు చేరుకుని స్థానిక అటవీ అధికారుల సహకారంతో పులిని బంధించి సురక్షితంగా అడవిలోకి విడిచిపెట్టేందుకు చర్యలు చేపడుతుందని తెలిపారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, రెండు రోజుల పాటు పులి సంచరిస్తున్న పరిసర ప్రాంతాల వైపు వెళ్లకుండా స్వీయ జాగ్రత్తలు పాటించాలని మంత్రి దుర్గేష్ కోరారు. ఆ రెండు రోజులు తగు జాగ్రత్తలు తీసుకున్న అనంతరం ప్రజలు యథావిధిగా తమ దైనందిన కార్యకలాపాలు నిర్వర్తించుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రత్యేక రక్షణ బృందాలు పులిని పట్టుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉండే బాధ్యత కూటమి ప్రభుత్వానిది అని మంత్రి దుర్గేష్ భరోసానిచ్చారు.

# డీసీసీబీలో జవాబుదారీ విధానం పెంచుతాం

**●ఋణాలు మంజూరులో అవకతవకలు చేస్తే చర్యలు తప్పవు**

**●సంస్థాగత సంస్కరణలో మార్పులకు శ్రీకారం**

**●గ్రీవెన్స్‌కు మంచి స్పందన : డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున**



విజయనగరం (చైతన్యరథం): తప్పులు జరిగినట్లు ఆరోపణలు ఉన్న సహకార సంఘాల్లోనూ సమగ్ర దర్యాప్తు చేపడతామని నాగార్జున తెలిపారు. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. తద్వారా వసూలు చేసిన డబ్బును జిల్లాలోని రైతాంగం కోసం ఉపయోగించి ప్రజలకు, రైతులకు డీసీసీబీపై నమ్మకం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

### 0.5% వడ్డీ తగ్గింపు

రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఎకరాకు ఋణ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. రుణాలపై వడ్డీ రేటును 12 శాతం నుంచి 11.5 శాతానికి తగ్గించటం వలన డీసీసీబీ పై 5 కోట్ల భారం పడిందని పేరొన్నారు. నాబార్డ్ వారు ఇస్తున్న ప్రతి రూపాయి కూడా పూర్తి పరదర్శకతతో డీసీసీబీ ద్వారా రైతాంగానికి రుణాలు మంజూరు చేస్తున్నాము. ఋణాల మంజూరులో ఎవరైనా లంచాలకు పాల్పడితే తనకి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ప్రతి డిసిసిబి బ్రాంచ్‌కు బహుళ న్యాయ సలహాదారులు

సంస్థాగత సంస్కరణలో భాగంగా సహకార సంఘాలు,డిసిసిబి శాఖల ఋణాలకు సంబంధించిన న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి ఇది వరకు మూడు డీసీసీబీ బ్రాంచ్ లకు గాను ఉన్న ఒక్క న్యాయ సలహాదారుడిని పెంచుతూ ప్రతి డీసీసీబీ శాఖకు ఇద్దరు లేదా ముగ్గురు న్యాయ సలహాదారులను నియమిస్తున్నామని దీనివల్ల న్యాయపరమైన అడ్డంకులకు త్వరితగతిన పరిష్కారం కలుగుతుంది అని నాగార్జున వెల్లడించారు.

### గ్రీవెన్స్‌కు స్పందన

ప్రజలు, రైతులు, సహకార సంఘాల ప్రతినిధుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని నాగార్జున తెలిపారు. అందిన వినతులను పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన కురుపాం ఎమ్మెల్యే

**● సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి**



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నాడు ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న “ప్రజా దర్బార్” కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను ఎమ్మెల్యేకి అందజేశారు. ఒక్కో సమస్యను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకోవడం తమ బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేసేందుకు ప్రజాదర్బార్ వేదికగా నిలుస్తోందని తెలిపారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

**● చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తూ న్యాయపరంగా ముందుకు వెళ్తాం : ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి**



శృంగవరపుకోట (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో జామి గ్రామంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ.. అత్యున్నత న్యాయస్థానం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వొద్దని చెప్పలేదని, చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తూ న్యాయపరంగా ముందుకు వెళ్లాలని మాత్రమే సూచించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ క్రమంలో బీసీ గణన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నివేదికకు ఆమోదం తెలిపి రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టం చేశారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని దాటుతున్నాయంటూ గతంలో హైకోర్టు జీవోలను రద్దు చేయగా, ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లిన క్రమంలో డెడికేటెడ్ కమిషన్ నివేదిక అమలుపై న్యాయస్థానం లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని చట్టపరమైన పరిష్కారాలు అన్వేషిస్తుందని చెప్పారు. చట్టపరంగా ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా, తెలుగుదేశం పార్టీ పరంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతానికి పైగా సీట్లను కేటాయించి సముచిత రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే భరోసా ఇచ్చారని ఆమె గుర్తుచేశారు.

# బీసీలకు పార్టీ పరంగా 34% రిజర్వేషన్లు ఇచ్చి తీరుతాం: ప్రభుత్వ విప్ గణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): కోర్టు తీర్పు ఎలా ఉన్నా స్థానిక సంస్థల్లో బీసీలకు పార్టీపరంగా 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరుతామని ప్రభుత్వ విప్ గణబాబు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 105, 1065లను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై ఆయన స్పందించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనే నిబంధన ఉన్నప్పటికీ, రాజీవ్ రంజన్ మిశ్రా కమిటీ రిపోర్ట్‌తో పాటు అవసరమైన ఎంపిరికల్ డేటాను కోర్టులకు సమర్పించి, బీసీ మంత్రులు ఢిల్లీకి వెళ్లి సీనియర్ న్యాయవాదులతో చర్చలు జరిపి కూటమి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో న్యాయపోరాటం చేసిందని గుర్తుచేశారు.

### బీసీల రాజకీయ ఎదుగుదలకు టీడీపీనే ఆద్యం:

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు లేవని, 1987లో నందమూరి తారకరామారావు తొలిసారిగా పంచాయతీలు, మండల పరిషత్తులు, మున్సిపాలిటీల్లో బీసీలకు 20% రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. ఆ తర్వాత విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు 1997లో దానిని 34 శాతానికి పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించారని, వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాలు కూడా అదే రిజర్వేషన్లను కొనసాగించాయని తెలిపారు.

### గత వైసీపీ ప్రభుత్వ ద్రోహం:

2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను ఏకపక్షంగా 24 శాతానికి తగ్గించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 మంది బీసీలు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అయ్యే అవకాశాన్ని కోల్పోయారని మండిపడ్డారు.

### కూటమి ప్రభుత్వ నిబద్ధత - పార్టీ పరంగా 34% రిజర్వేషన్లు:

2024 ఎన్నికల ప్రచారంలోనూ, ‘జయహో బీసీ’ సదస్సుల్లోనూ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం జీవోలు ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీల అభ్యున్నతి కోసం కోర్టు తీర్పు ఎలాంటిదైనా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో (పంచాయతీలు, మండలాలు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) తెలుగుదేశం పార్టీ తరఫున టికెట్ల కేటాయింపులో బీసీలకు ఖచ్చితంగా 34% స్థానాలు కేటాయించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు.

# 15వ ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టించిన వైసీపీ ఎంపీటీసీ

**●ప్రజా గ్రీవెన్స్‌లో గడ్డి ఈశ్వరికి పలువురు వినతులు**



పాడేరు (చైతన్యరథం): ఇడాపల్లి పంచాయతీ బొక్కెల్లు గ్రామంలో అందరి తాగునీటి అవసరాలకు ఉపయోగించాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన తాజా మాజీ ఎంపీటీసీ తన వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించుకున్నారని ఆ గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి గ్రీవెన్స్ ఆశ్రయించారు. తమ గ్రామస్తులకు మంచినీరు కోసం వినియోగించాల్సిన నిధులను తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఇదేమని అడిగితే తన ఇష్టమైనట్లుగా మాట్లాడుతున్నారని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ బంధువులు ఇంటి వద్ద వేయించుకున్న బోరు తమకు వద్దని గ్రామస్తులు అందరికీ ఉపయోగపడే ప్రభుత్వ స్థలంలో బోరు వేయించి తమకు ఇవ్వాలని సందర్భంగా వారు డిమాండ్ చేశారు. తాము ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఎంపీటీసీ కావాల్సిన వ్యక్తి ఇంటిదగ్గర పబ్లిక్ బోర్ కొట్టించాలని ఇది తమ అందరి కోసం కొట్టినట్లు బిల్లులు చేయించుకుని ప్రయోజనం పొందారని వారు ఆరోపించారు. దీనిపై తగిన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఈశ్వరి కోరారు.

# ఎన్నో ఏళ్ళ కల నెరవేరబోతోంది... రూ.194 కోట్ల మంచినీటి పథకానికి ఎమ్మెల్యే గోరంట్ల శంకుస్థాపన

రాజమహేంద్రవరం (చైతన్యరథం): గోదావరి పక్కనే ఉండికూడా మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాలకు ఉచితంగా గోదావరి నీటిని అందించబోతున్నామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారు. దీంతో ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది ఆయన అన్నారు. రూరల్ నియాజక వర్గ పరిధిలోని బొమ్మూరు హైవే డంపింగ్ యార్డ్ పక్కన జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ 194 కోట్లతో ఇంటింటికి గోదావరి నీటిని అందించే భారీ ప్రాజెక్ట్‌కి ఎమ్మెల్యే గోరంట్ల శుక్రవారం శంకుస్థాపన చేసారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బి.వి. గిరి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు , కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడంతోపాటు మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 30వేల కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా రూరల్ నియోజక వర్గంలోని గ్రామాలకు మంచినీటి సరఫరా ప్రాజెక్ట్ కోసం కృషి చేసి సాధించగలిగామని ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. రూరల్ నియోజకవర్గం, కడియం ఇతర ఆవాసాలకు ధవళేశ్వరం రిజర్వాయర్ నుంచి మంచినీటి సరఫరా చేసే ప్రాజెక్టు ఇదని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రతి మనిషికి రోజుకి 5.5లీటర్ల చొప్పున ప్రతి ఇంటిలో నలుగురు ఉంటారన్న అంచనాతో మంచినీరు సరఫరా చేసే విధంగా ఈ పథకం రూపకల్పన చేసినట్లు ఎమ్మెల్యే గోరంట్ల చెప్పారు. ఈ పథకం ద్వారా రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని 22,376 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. ధవళేశ్వరం వద్ద ఉన్న ఇన్‌టేక్ పాయింట్ నుంచి గోదావరి జలాలను శుద్ధి చేసి, పైపులైన్లు, ఎత్తైన నీటి నిల్వ ట్యాంకుల ద్వారా గ్రామాలకు సరఫరా చేయనున్నట్లు వివరించారు. బోర్లు, స్థానిక నీటి వనరులపై ఆధారపడుతున్న గ్రామాలకు ఈ పథకం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఏడాది వ్యవధిలో పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటికే 10 కొత్త నీటి ట్యాంకులను నిర్మించగా, మరో 23 ట్యాంకులను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పాత పైపులైన్ల స్థానంలో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయనున్నామని, ఈ నెల 15వ తేదీ నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తాం.. రాజకీయంగా బీసీలకు న్యాయం చేస్తాం

**●బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేలా టీడీపీ కృషి చేస్తుంది : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే రాజకీయంగా బీసీలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. బీసీలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, వారి రాజకీయ ప్రాధాన్యత, గౌరవం తగ్గకుండా తగిన చర్యలు తీసుకునేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనేక విధాలుగా అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. హైకోర్టులో న్యాయపరమైన సమస్యలు ఎదురైన నేపథ్యంలో వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని, చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించిందని పేర్కొన్నారు. హైకోర్టులో వాదనలు వినిపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో ఎందుకు అప్పీల్ చేయలేదని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల సుమారు 16,800 మంది బీసీలకు రాజకీయ అవకాశాలు దూరమయ్యాయని ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడంలో తెలుగుదేశం పార్టీకి చారిత్రక పాత్ర ఉందని, ఎన్టీఆర్ హయాం నుంచి చంద్రబాబు నాయుడు నాయకత్వం వరకు బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు కృషి జరిగిందని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందని ఆయన విమర్శించారు. బీసీలకు రాజకీయంగా మేలు చేసే నిర్ణయాలకు అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. గతంలో రిజర్వేషన్లు తగ్గించినప్పుడు వైసీపీలోని బీసీ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ప్రస్తుతం బీసీలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ముందుకు వస్తుంటే విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. బీసీల రాజకీయ సాధికారతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కట్టుబడి ఉన్నారని ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. చట్టపరమైన పరిధిలో తీసుకోవాల్సిన చర్యలతో పాటు, పార్టీ పరంగా బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర జనాభాలో సుమారు 50 శాతం ఉన్న బీసీలకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత, గౌరవం లభించాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక సంస్థల్లో బీసీలు ఐక్యతను చాటుతూ తమ రాజకీయ బలాన్ని నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీల హక్కులు, రాజకీయ సాధికారత కోసం కూటమి ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ కృషి కొనసాగిస్తాయని ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఏపీ ప్రభుత్వం

**● నందిగామలో మౌలిక వసతుల కల్పనకు మరో ముందడుగు : ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



నందిగామ (చైతన్యరథం): పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నందిగామలో మౌలిక వసతుల కల్పనకు మరో ముందడుగు పడింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా మంజూరైన రూ.19 కోట్ల నిధుల్లో భాగంగా నందిగామ పట్టణంలోని 13, 14, 15, 16వ వార్డుల్లో నిర్మించనున్న వివిధ సీసీ రోడ్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మున్సిపల్ కమిషనర్, అధికారులతో పాటు కూటమి నాయకుల సమక్షంలో శంకుస్థాపన చేశారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య తెలిపారు. రహదారుల అభివృద్ధి ప్రజల రోజువారీ ప్రయాణానికి ఎంతో అవసరమని, సీసీ రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు సులభతరమవుతాయని పేర్కొన్నారు. నందిగామ పట్టణానికి రూ.19 కోట్ల నూవీ నిధులు అందుబాటులోకి రావడంతో వివిధ ప్రాంతాల్లో రహదారులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రారంభమై ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**కూటమి ప్రభుత్వ లక్ష్యం.. అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికీ**

కూటమి ప్రభుత్వం ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే సౌమ్య తెలిపారు. నందిగామ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు సమకూర్చడం, పనులను పర్యవేక్షించడం, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడకుండా, నిర్ణీత ప్రమాణాల ప్రకారం పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. నందిగామ పట్టణ ప్రగతికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి టీడీపీ కట్టుబాటు

**●కొనకళ్ల నారాయణరావు, వీరంకి వెంకట గురుమూర్తి**

మచిలీపట్నం (చైతన్యరథం): బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నది తెలుగుదేశం పార్టీ స్పష్టమైన విధానమని, సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా లేకపోయినా పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు టీడీపీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. 1987లో ఎన్టీ రామారావు బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 1995లో చంద్రబాబు నాయుడు వాటిని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు. బీసీలకు రాజకీయ గుర్తింపు, గౌరవం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై న్యాయపరమైన అడ్డంకులు ఏర్పడటం వల్ల వారి రాజకీయ అవకాశాలకు నష్టం కలిగిందని అన్నారు. బీసీలకు న్యాయం జరిగేలా రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆయన కోరారు. వీరంకి వెంకట గురుమూర్తి గారు మాట్లాడుతూ... బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం, గౌరవం కల్పించడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షులు, రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించినప్పుడే గ్రామస్థాయి పాలనలో వారి భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ స్పష్టమైన వైఖరితో ముందుకు రావాలని గురుమూర్తి అన్నారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవం, రాజకీయ ఎదుగుదలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే విషయంలో టీడీపీ తన నిబద్ధతను కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# గుడివాడలో రూ.4.37 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభం : ఎమ్మెల్యే వెనిగండ్ల



గుడివాడ (చైతన్యరథం): పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను దశలవారీగా పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం గుడివాడ పట్టణంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే రాము రూ.4.37 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా రూ.1.18 కోట్లతో నిర్మాణం పూర్తిచేసుకున్న మున్సిపల్ పార్కును మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే రాము పరిశీలించారు. పార్కు నిర్వహణ, ప్రజలకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, పరిసరాల అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాము శంకుస్థాపనలు చేశారు. 19వ వార్డు సత్యనారాయణపురంలో రూ.2.30 కోట్లతో మూడు రోడ్లు, 25వ వార్డు పేద ఎరుకపాడులో రూ.67 లక్షలతో వార్పు రోడ్డు, 28వ వార్డు న్యూ ఇందిరానగర్ కాలనీలో రూ.1 కోటితో ఓల్డ్ మెయిన్ రోడ్డు, 36వ వార్డు పోలీస్ కాలనీలో రూ.40 లక్షలతో మొదటి రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను స్థానిక ప్రజలతోనే ప్రారంభింపజేయగా, మహిళలు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... ప్రజలకు నిత్యం ఎదురయ్యే సమస్యలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ముందుగా ఎక్కువ ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో పనులు ప్రారంభిస్తున్నామని, పట్టణంలోని ప్రతి వార్డులో పెండింగ్‌లో ఉన్న రోడ్ల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గుడివాడ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు తాగునీటి సరఫరాను మరింత పటిష్టం చేసేందుకు రానున్న రెండు నెలల్లో రూ.92 కోట్ల నిధులు రానున్నాయని ఎమ్మెల్యే రాము వెల్లడించారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల అభివృద్ధిని సమన్వయంతో చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. "ప్రతి కాలనీలో మెరుగైన రోడ్లు, సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ, ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడం నా ప్రధాన లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులు ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడాలన్నారు. సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన పనులను ప్రాధాన్యత ప్రకారం పూర్తి చేస్తామని ఉద్ఘాటించారు. గుడివాడ పట్టణాన్ని మెరుగైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తాం' అని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.

# గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

**● మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు**



మైలవరం (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. రెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని రాఘవపురం గ్రామంలో రూ.83.5 లక్షల అంచనా వ్యయంతో వీబీజీ రాంజీ నిధుల ద్వారా చేపట్టనున్న 1050 మీటర్ల పొడవునా సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ప్రజల దైనందిన జీవనానికి ఎంతో అవసరమని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామస్తులకు రాకపోకలు సులభతరమవడమే కాకుండా, రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, ఆశీస్సులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాఘవపురంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయితే గ్రామ ప్రజలకు రవాణా పరంగా మరింత సౌలభ్యం కలగనుంది. గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ, స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

**●ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించడమే మా బాధ్యత**

**●ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బొండా ఉమా కృషి**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుల వారి కార్యాలయం నందు ప్రతి శుక్రవారం నిర్వహించి ప్రజాదర్బార్ నందు నేరుగా ప్రజల నుండి వినతి పత్రాలను ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు స్వీకరించి, వివిధ సమస్యలతో తన వద్దకు వచ్చిన ప్రజల అభ్యర్థనలను స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావచ్చని, ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు తగ్గించి, వారికి అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సేవలు సకాలంలో అందేలా చూడటం తమ బాధ్యతని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ప్రజా దర్బార్ ద్వారా అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే ప్రజా దర్బార్ ప్రధాన ఉద్దేశమని బొండా ఉమామహేశ్వరరావు తెలియజేశారు.

# దసరా ఉత్సవాల నేపథ్యంలో గన్నవరం డిపో నుంచి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి

**●ఆర్టీసీకి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వినతి**



గన్నవరం (చైతన్యరథం): విజయవాడలో ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో గన్నవరం డిపో నుంచి మరిన్ని బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గన్నవరం డిపో మేనేజర్ ను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం డిపో మేనేజర్ తో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన యార్లగడ్డ ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ నగరంలో దసరా నవరాత్రి ఉత్సవాలు, సరస్ అజీవిక మేళా, విజయవాడ ఉత్సవ్ 2.0 లు ఒకేసారి మూడు ఉత్సవాలు జరుగుతున్నాయని వీటికి గన్నవరం నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వెళ్లే అవకాశం ఉన్నందున హనుమాన్ జంక్షన్, ఉంగుటూరు, గన్నవరం నుంచి మరిన్ని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని కోరారు. ఈ ఉత్సవాలు జరిగే పది రోజులు ప్రయాణికులు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాలు రాత్రి 11 గంటల వరకు జరిగే అవకాశం ఉన్నందున రాత్రి 11:30కు విజయవాడ నుంచి గన్నవరం, ఉంగుటూరు, హనుమాన్ జంక్షన్ కు బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. దసరా ఉత్సవాలకు భక్తులు వేకువజామున వెళ్లే అవకాశం ఉన్నందున ఉదయం 3 గంటల నుంచి ప్రతి అరగంటకు బస్సు చొప్పున షెడ్యూల్‌ను ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్‌కు యార్లగడ్డ సూచించారు.

# బీసీలకు 34 శాతం కంటే ఎక్కువ సీట్లు : బొండా సిద్ధార్థ



విజయవాడ (చైతన్యరథం): స్థానిక ఎన్నికలు జరగడం, బీసీలకు ప్రయోజనం కలగడం వైసీపీకి ఇష్టం లేదని, కోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని టీడీపీ యువనాయకుడు బొండా సిద్ధార్థ వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను అడ్డుకుంటూ ఎవరు కోర్టును ఆశ్రయించారో అందరికీ తెలుసునని అన్నారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లను అనుమతించబోమని ఈ రోజు సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని, కోర్టు తీర్పులను గౌరవిస్తాం.. అదే సమయంలో టీడీపీ కమిట్మెంట్ ప్రకారం 34 శాతం కంటే ఎక్కువ సీట్లను బీసీలకు కేటాయిస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటనను స్వాగతిస్తున్నామని, మా సెంట్రల్ నియోజకవర్గంలోనూ అన్ని కార్పొరేటర్స్ పదవులకు సంబంధించి 34 శాతానికి మించి బీసీలకు అవకాశం కల్పిస్తామని, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లనూ గౌరవిస్తామన్నారు.

# పేదల పక్కా ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం: చీఫ్ విప్ జీవీ

**●లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పీఎంఏవై అర్బన్ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ**



వినుకొండ (చైతన్యరథం): ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నిజం చేసి, పక్కా ఇల్లు అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్, జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో పీఎంఏవై అర్బన్ హౌసింగ్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. అనంతరం స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఈ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... పేదల ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత, వేగం, నాణ్యతకు చంద్రబాబు ప్రభుత్వ పాలనే నిదర్శనమని, అందుకే పీఎంఏవై 2.0 పథకానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. గత జగన్ ప్రభుత్వం 25 లక్షల ఇళ్లు కడతామని హామీ ఇచ్చి ఒక్క ఇల్లు కూడా నిర్మించకపోగా, ఆరు లక్షల ఇళ్లను రద్దు చేసి పేదల ఆశలను చిదిమేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# చంద్రబాబు కష్టమంతా ప్రజల కోసమే : పల్లెపండుగలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): జగన్ పాలనలో ప్రభుత్వ గొప్పలు.. ప్రజలకు అప్పులే మిగిలాయని, మరోసారి వైసీపీ అధికారంలోకి వచ్చి ఉంటే ప్రజల ఆస్తులు అన్యాక్రాంతమై.. రాష్ట్రం పరిస్థితి దారుణంగా తయారయ్యేదని, వయసుని, ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా నేడు చంద్రబాబు పడుతున్న కష్టమంతా ప్రజలకోసమేనని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో పల్లెపండుగ 2.0, 3.0 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత స్థానిక బీసీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించిన ప్రత్తిపాటి. అనంతరం ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ పాడి రైతులకు రూ.3 లక్షల విలువైన సంగం డెయిరీ బోనస్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు.

**అత్తెసరు సంక్షేమంతో.. జగన్ వేల కోట్లు కొల్లగొట్టాడు.**

జగన్ ఐదేళ్లు అత్తెసరు సంక్షేమాన్ని ప్రజలకు అందించి.. వేలకోట్లు కొల్లగొట్టాడని, ఆయన చేసిన అప్పులు తీరుస్తూనే, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు అవసరమైన సంక్షేమం.. రాష్ట్రాభివృద్ధిని కొనసాగిస్తున్నారని ప్రత్తిపాటి వివరించారు. తల్లికి వందనం పథకం అమలును ప్రభుత్వం, మంత్రి నారాలోకేశ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, జగన్ లా ఒకరికే ఇచ్చి, తల్లుల్ని మోసగించడం లేదన్నారు. చంద్రబాబు అనుభవానికి ప్రధాని మోదీ సహకారం తోడైనందునే ప్రజలకు ఎనలేని మేలు జరుగుతోందన్నారు. లింగారావుపాలెం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామ రూపురేఖలు మారుస్తామని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

# బీసీ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా... 34 శాతం రిజర్వేషన్ల సాధనే ధ్యేయం

**● గుంటూరు జిల్లా టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, టీడీపీ నేతలు కనపర్తి, తాళ్ళ వెంకటేష్**



గుంటూరు (చైతన్యరథం): బీసీ హక్కుల పరిరక్షణే టీడీపీ లక్ష్యమని 34 శాతం రిజర్వేషన్ల సాధనే ధ్యేయమని గుంటూరు జిల్లా టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన, పేద ప్రజలకు సంక్షేమం, బీసీల రాజకీయ సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన మహానుభావుడు అన్న ఎన్టీఆర్... దానిని కొనసాగిస్తూ 34 శాతం రిజర్వేషన్ పెంచిన ఘనత నారా చంద్రబాబునాయుడేదనని అన్నారు. వైసీపీ వైసీపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్‌ని 24 శాతానికి కుదించి 16,800 రాజకీయ అవకాశాలను దూరంచేసి బీసీల అభ్యున్నతిని అడ్డుకున్న ద్రోహి జగన్ రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ ఏపీ లక్ష్యంతో రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ.. గత ఏడాది సుమారు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్న మాట వాస్తవం కాదా..? గత 20 నెలల్లో రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్న అంశాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో పెట్టుబడుల వాతావరణం మెరుగుపడుతున్న విషయం వాస్తవం కాదా? అని ఈ సందర్భంగా ప్రశ్నించారు.

**టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ...**

వైసీపీ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ చేసిన అరాచకాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, అంబటి సిద్ధమేనా అని టీడీపీ నేత కనపర్తి సవాల్ చేశారు. దుగ్గిరాల ఎంపీపీ ఎన్నికల్లో బీసీ మైనారిటీ మహిళా అభ్యర్థికి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా హింసించినదెవరో అంబటి సమాధానం చెప్పాలన్నారు. రాజకీయాల్లో అంబటి లాంటి అనైతిక, అబద్దాల కోరు ఇంకెవరూ లేరని మండిపడ్డారు. అను నిత్యం ఎదో ఒక రూపంలో వార్తల్లో ఉండేందుకు అంబటి ఆరాటపడుతుంటాడని అన్నారు.

**గొడ్డలి పార్టీ నేతల కుట్రలను తిప్పికొడతాం : తాళ్ళ వెంకటేష్ యాదవ్**

కూలాల మధ్య చిచ్చుపెట్టి వైసీపీ చలి కాచుకోవాలని చూస్తుందని, జగన్‌కి బీసీలపై ఏమాత్రం ప్రేమ ఉన్నా 34 శాతం సీట్లు కేటాయించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్ డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలు ప్రాతినిధ్యం వహించే విధంగా వారికి సముచిత స్థానం కల్పించడమే టీడీపీ లక్ష్యమని, బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగకూడదని గొడ్డలి పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారని అన్నారు. బీసీలకు సామాజిక, రాజకీయ న్యాయం చేయాలన్నదే టీడీపీ లక్ష్యం, వారి హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరి అని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 శాతం అవకాశాలను ఇచ్చి బడుగు బలహీన వర్గాల రాజకీయ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందన్నారు. బీసీల హక్కుల కోసం టీడీపీ నిరంతరం పోరాడుతుంది, వారి అభ్యున్నతికి కట్టుబడి ఉంటుందన్నారు.

# చీపురుపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 100 కుటుంబాలు

చీపురుపల్లి: విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, మాజీ వార్డు సభ్యులు, వైసీపీకి చెందిన 100 కుటుంబాలు ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు సమక్షంలో టీడీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే కళా వెంకటరావు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో విశాఖ, ఉత్తరాంధ్ర ఎనలేని అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పైల బలరాం, బలగం వెంకటరావు, రెడ్డి గోవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# బీసీలకు 34 శాతం కంటే ఎక్కువ సీట్లిస్తాం

## సీఎం చంద్రబాబు ప్రకటనపై ఎమ్మెల్యే మద్దులూరి హర్షం



చీరాల (చైతన్యరథం): స్థానిక ఎన్నికలు జరగడం, బీసీలకు ప్రయోజనం కలగడం వైసీపీకి ఇష్టం లేదని శాసనసభ్యుడు మద్దులూరి మాలకొండయ్య విమర్శించారు. కోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను అడ్డుకుంటూ ఎవరు కోర్టును ఆశ్రయించారో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లను అనుమతించేది లేదని తాజాగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందన్నారు. కోర్టు తీర్పులను గౌరవిస్తామని, అదే సమయంలోతమ పార్టీ కమిట్మెంట్ ప్రకారం 34 శాతం కంటే ఎక్కువ సీట్లను బీసీలకు కేటాయిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. చీరాల నియోజకవర్గంలోనూ ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు సంబంధించి 34 శాతానికి మించి బీసీలకు అవకాశం కల్పిస్తామని, అలాగే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లనూ గౌరవిస్తామని వెల్లడించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో బీసీలకు చేసింది శూన్యమన్నారు. బీసీలను గౌరవించేది ఎప్పుడూ తెలుగుదేశం పార్టీనే...ఈ రోజు కేంద్రం, రాష్ట్ర మంత్రివర్గాల్లో కీలకశాఖల్లో బీసీలు ఉండటం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని వెల్లడించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుంచి బీసీలను గౌరవించుకుంటూ వస్తున్నామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కచ్చితంగా 34 శాతం కంటే ఎక్కువ అవకాశం కల్పిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం వైసీపీకి మొదటి నుంచి ఇష్టం లేదు..ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఎన్నికలు జరిగితే స్థానిక సంస్థలకు వేల కోట్ల 16వ ఆర్థిక సంఘం నిధులు వస్తాయి..ఆ నిధులు రావడం, వాటితో అభివృద్ధి జరగడం వైసీపీకి ఇష్టం లేదు. ఓ వైపు బీసీ రిజర్వేషన్లకు అడ్డుతగులుతూనే మరోవైపు సర్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు వార్డుల పునర్విభజన జరగకూడదని, ఎన్నికలు జరపవొద్దని మరో రెండు కేసులు వేసిందని తెలిపారు. ఆ కేసులను కూడా సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి అందుబాటులో ఉన్న జాబితాతోనే వెళ్లాలని వైసీపీకి చెంపపెట్టులా తీర్పు చెప్పిందని పేర్కొన్నారు.



# మంత్రి నారాయణ దాతృత్వం

### ఉచిత కళ్లద్దాల పంపిణీ

నెల్లూరు (చైతన్యరథం): 47వ డివిజన్‌లో నిర్వహించిన నారాయణ నేత్రజ్యోతి కార్యక్రమంలో భాగంగా ముళ్లమూడి బస్టాండ్ సెంటర్, ఆజాద్ సెంటర్‌లో 105 మంది లబ్ధిదారులకు ఉచిత కళ్లద్దాలను పంపిణీ చేశారు. డాక్టర్ సుధ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ పాల్గొని లబ్ధిదారులకు కళ్లద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ అధ్యక్షులు చెంగయ్య ఆచారి, మైనారిటీ అధ్యక్షులు ఫిరోజ్ షేక్, ప్రధాన కార్యదర్శి కలవకుంట భాస్కర్, యూనిట్ ఇన్‌చార్జ్ అడంకి చంద్రశేఖర్, సిద్ధాకల చారి, శివశంకర్, సుభాని తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు కంటి ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేయడంతోపాటు ఉచిత కంటి చికిత్సలతో పేద వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారని నిర్వాహకులు తెలిపారు. అన్ని వ్యవస్థలో తన దైన శైలిలో అనేక సేవా కార్యక్రమాలు అభివృద్ధి పదంలో దూసుకుపోతున్నారని కొనియాడారు.

# కూటమి పాలనలోనే బీసీలకు న్యాయం

## నెల్లూరు టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర




నెల్లూరు (చైతన్యరథం): చట్టసభల్లో బీసీలు ప్రాతినిధ్యం వహించే విధంగా వారికి సముచిత స్థానం కల్పించడమే టీడీపీ లక్ష్యమని బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగకూడదని గొడ్డలి పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర విమర్శించారు. బీసీలకు సామాజిక, రాజకీయ న్యాయం చేయాలన్నదే టీడీపీ లక్ష్యమన్నారు. వారి హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరిగా తెలుస్తోందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 శాతం అవకాశాలను ఇచ్చి బడుగు బలహీన వర్గాల రాజకీయ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని వెల్లడించారు. బీసీల హక్కుల కోసం టీడీపీ నిరంతరం పోరాడుతుందని వారి అభ్యున్నతికి కట్టుబడి ఉంటుందని చెప్పారు. బీసీలకు 34శాతం రిజర్వేషన్ అంశాన్ని వైసీపీ హయాంలో హైకోర్టు కొట్టివేస్తే సుప్రీంకోర్టుకు వెళ్లకుండా బీసీలను తీరని అన్యాయం చేశారన్నారు. బీసీల అభ్యున్నతి, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 105, 1065 లను వైసీపీ నేత శివప్రసాద్ రెడ్డి పిటిషన్ ద్వారా అడ్డుకున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో 34 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లయితే 16,800 మంది బీసీలు నాయకులుగా ఎదిగేవారన్నారు. ఇటువంటి అద్భుత అవకాశాన్ని నీరుగార్చి బీసీల అభ్యున్నతికి వైసీపీ ప్రభుత్వం తమ హయాంలో రాజకీయ సమాధి కట్టిందని విమర్శించారు.

# అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, కొత్త ఇళ్ళు

## అధికారులతో సమీక్షలో మంత్రి సవిత

పెనుకొండ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం లోని 5 మండలాల తహసీల్దార్లు, హౌసింగ్ శాఖ అధికారులతో మంత్రి సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందించే అంశంతో పాటు, నూతన గృహాల మంజూరు పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అర్హుల గుర్తింపు, ఇళ్ల పట్టాల పంపిణీ, నూతన గృహాల మంజూరులో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన పేదలకు అందేలా రెవెన్యూ, హౌసింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సవిత సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో 5 మండలాల ఎమ్మార్వోలు హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మాట్లాడే ముందు చరిత్ర తెలుసుకో చీ..చీ..రెడ్డీ!

## విరుచుకుపడిన డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్

నెల్లూరు (చైతన్యరథం): జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. కమిషనర్ నియామకం, ఆయన అర్హతలపై సుదీర్ఘ ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రశేఖర్ రెడ్డికి అసలు అర్హతల గురించి మాట్లాడే హక్కు ఎక్కడిదని రూప్ కుమార్ యాదవ్ ప్రశ్నించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే ఇదే ఓబులేష్ నందన్‌ను నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్‌గా నియమించింది నిజం కాదా అని నిలదీశారు.అంతేకాకుండా, అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సొంత జిల్లా వైఎస్సార్ కడపకు వైస్ ఛైర్మన్‌గా కూడా రెండేళ్ల పాటు ఇదే బొబులేష్ నందన్ పనిచేశారని గుర్తుచేశారు. అప్పట్లో చంద్రశేఖర్ రెడ్డి రాజకీయాల్లో లేకపోవడం వల్లే ఈ విషయాలు తెలియలేదని, నోటికొచ్చినట్లు కాకుండా తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. కమిషనర్‌గా ఎవరిని నియమించాలి, ఎవరితో పనిచేయించుకోవాలనేది ప్రభుత్వ ఇష్టమని, నిబంధనలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నేతలకు నచ్చినట్లు అధికారులను నియమించాలంటే ఈ ప్రభుత్వంలో కుదరదని తేల్చిచెప్పారు. గ్రూప్-1 సాధించి ఉన్నత చదువులు చదివిన ఒక అధికారిపై ఇలాంటి విమర్శలు చేయడం తగదని, కమిషనర్ పనితీరును నెల్లూరు ప్రజలు చూస్తున్నారని తెలిపారు. మంత్రి నారాయణపై ప్రతీసారీ వీఆర్ హై స్కూళ్ల బస్సులు, చెట్లు, కాంపాక్టర్లు, స్వీపింగ్ మెషిన్లు అంటూ ఒకే రకమైన పాత విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాజాగా బాలాజీ నగర్‌లోని ఎంఎస్‌ఎం హైస్కూల్ అభివృద్ధికి 10 కోట్ల అంచనాతో నారాయణ శంకుస్థాపన చేశారని వివరించారు. నెల్లూరు నగరంలోని ప్రతీ ప్రభుత్వ హైస్కూళ్లను దాదాపు 10 కోట్లకు పైగా అంచనాతో, తమకున్న విస్తృత పరిచయాలు, సంబంధాలతో నారాయణ అభివృద్ధి చేస్తున్నారని వెల్లడించారు..కార్పొరేషన్ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా వీఆర్ హై స్కూల్‌కే కాకుండా ఏ ప్రభుత్వ స్కూల్‌కూ ఖర్చు పెట్టలేదని స్పష్టం చేశారు.బస్సుల రవాణాకు లేదా అద్దెలకు కార్పొరేషన్ నిధుల నుంచి లక్ష డ్రా చేసినట్లు నిరూపిస్తే ఏం చెప్పినా చేస్తామని సవాల్ విసిరారు. వీఆర్ హై స్కూల్ నిర్వహణ కోసం ప్రతీ నెల నారాయణ తమ సొంత డబ్బులు లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రజల కోసం మీ జీవితంలో ఎప్పుడైనా 20 వేలు అయినా ఖర్చు పెట్టారా అని చంద్రశేఖర్ రెడ్డిని ప్రశ్నించారు. అక్రమంగా డబ్బులు సంపాదించాల్సిన కర్మ నారాయణ కుటుంబానికి లేదని, సొంత కష్టార్జితాన్ని ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారని కొనియాడారు. కళ్లకు గంతలు కట్టుకోకుండా అభివృద్ధిని చూడాలని, టీవీల్లో పాత టేపులు ప్లే చేయడం కాదని ఎద్దేవా చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాకుండానే వైఎస్సార్సీపీ అభ్యర్థిని ప్రకటించడం వారి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమని మండిపడ్డారు.తమ 30 ఏళ్ల రాజకీయ జీవితంలో రిజర్వేషన్ రాకముందే అభ్యర్థిని ప్రకటించడం ఎప్పుడూ చూడలేదన్నారు. ఓసీ అభ్యర్థి అని విజయ్ కుమార్ రెడ్డి గారి పేరు చెప్పిన వైఎస్సార్సీపీ నేతలు, బీసీ లేదా ఎస్సీ అభ్యర్థుల పేర్లను ఎందుకు ప్రకటించలేదని సూటిగా ప్రశ్నించారు. ఇది బీసీ, ఎస్సీ వర్గాల పట్ల వైఎస్సార్సీపీకి ఉన్న చిన్నచూపేనని విమర్శించారు. ఎన్నికలు వస్తున్నాయనే మళ్లీ బీసీలను మోసం చేయడానికి బీసీ గర్జనలు పేరిట నాటకాలాడుతున్నారని ఆరోపించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, నారా లోకేష్ నిరంతరం శ్రమిస్తూ లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తున్నారని, ప్రజలంతా కూటమి ప్రభుత్వం వైపే ఉన్నారని చెప్పారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వైఎస్సార్సీపీకి తగిన గుణపాఠం చెప్పి, కూటమి ప్రభుత్వానికి నారాయణకు మద్దతుగా స్పష్టమైన తీర్పు ఇస్తారని రూప్ కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి, నాయకులు జహీర్, తిరుమల నాయుడు, మైనుద్దీన్, కువ్వరపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల సాధికారత... టీడీపీ ప్రధాన బాధ్యత!



## అనంత టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం (చైతన్యరథం): బీసీల అభివృద్ధి, అభ్యున్నతి, రాజకీయ సాధికారతకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు స్పష్టం చేశారు. శుక్రవారం అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్లు, టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే తన విధానంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు బీసీలకు రాజకీయంగా గుర్తింపు, సముచిత స్థానం కల్పించేందుకు విశేష కృషి చేశారని తెలిపారు. ఆ ఆశయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. రాష్ట్రంలోనే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ అనేక మంది బీసీ నాయకులకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు తదితర పదవుల్లో అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది తెలుగుదేశం పార్టీ లక్ష్యమని పూల నాగరాజు స్పష్టం చేశారు. చట్టపరమైన అడ్డంకుల కారణంగా రిజర్వేషన్ల అమలులో సమస్యలు ఎదురైనా, బీసీలకు రాజకీయంగా న్యాయం చేయాలన్న తమ నిబద్ధతలో ఎలాంటి మార్పు లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 34 శాతం ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నాలకు న్యాయపరమైన అడ్డంకులు ఎదురైనప్పుడు, వాటిని అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోలేదని పూల నాగరాజు విమర్శించారు. వైసీపీ నేతలు న్యాయస్థానాలను ఆశ్రయించడం వల్ల బీసీల రాజకీయ అవకాశాలకు నష్టం జరిగిందని ఆరోపించారు. 34 శాతం రిజర్వేషన్లు అమలై ఉంటే సుమారు 16,800 మంది బీసీలకు వివిధ స్థానిక సంస్థల పదవుల్లో అవకాశం లభించేదని తెలిపారు. ఈ అంశంపై వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 1987లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తొలిసారిగా 20 శాతం రిజర్వేషన్లు, 1995లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనని పూల నాగరాజు గుర్తు చేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై పార్టీ న్యాయపోరాటం చేసిందని, ఈ విషయంలో బీసీ మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చించిందని తెలిపారు. రిజర్వేషన్ల పరిమితిని 50 శాతానికి పెంచేందుకు అవసరమైన గణాంకాలను కూడా సమర్పించామని పేర్కొన్నారు. న్యాయస్థానాల తీర్పులను గౌరవిస్తూనే, పార్టీ పరంగా బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. గ్రామస్థాయిలో సర్పంచుల నుంచి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, జిల్లా పరిషత్ చైర్మన్ల వరకు బీసీలు ఎదిగేందుకు తెలుగుదేశం పార్టీ అవకాశాలు కల్పిస్తుందని పూల నాగరాజు గారు తెలిపారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, వారి రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల హక్కులను పరిరక్షించడం, వారికి నాయకత్వ అవకాశాలు కల్పించడం, సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించడం తమ పార్టీ ప్రధాన లక్ష్యాలని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా 34 శాతం ప్రాతినిధ్యం కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని పూల నాగరాజు పునరుద్ఘాటించారు. బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంక్షేమ బోర్డు చైర్మెన్ వెంకటశివుడు యాదవ్, వీరశైవ లింగాయత కార్పొరేషన్ చైర్మన్ తుల్జాపూర్ స్వప్న, అరెకటిక కార్పొరేషన్ చైర్మన్ హరికృష్ణ రావు, కార్పొరేషన్ డైరెక్టర్లు మంగళ ఆదినారాయణ , పోతుల లక్ష్మీనరసింహులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, మాజీ గ్రంథాలయ చైర్మన్ జిరాయితీ గౌస్ మోద్దీన్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ముత్తుములకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

గిద్దలూరు (చైతన్యరథం): గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అంకితభావంతో సేవలందిస్తూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని రాష్ట్ర మంత్రులు తమ శుభాకాంక్షల ద్వారా ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రుల నుంచి జన్మదిన శుభాకాంక్షలు అందుకోవడం పట్ల ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



# నీటి మడుగులో నడిచి...

## సమస్యలు తెలుసుకున్న మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): పట్టణంలోని సీపీఐ కాలనీలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను మంత్రి సవిత దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నో ఏళ్లగా కాలనీలో నివాసం ఉంటున్నామని తమకు నివాస స్థలాలకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేవని, తమ నివాసాలకు సంబంధించిన పొజిషన్ పత్రాలు అందజేసి తమకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. అదేవిధంగా వార్డులో నెలకొన్న ఇతర సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కాలనీవాసుల సమస్యలను విన్న మంత్రి సవిత, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డిఓ ఆనంద కుమార్ ఎంఆర్ఓ ఇతర అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పరిగి మండలం నరసాపురంలో రోడ్డు నిర్మాణానికి ఎంపీ పార్థసారధి భూమి పూజ

# కూటమి పాలనలోనే బీసీలకు న్యాయం

## రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్

తిరుపతి (చైతన్యరథం): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం105, జీవో నెం1065 జారీ చేసింది అని,జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్లో వైసిపి నేత శివప్రసాద్ రెడ్డి పిటిషన్ వేసి అడ్డుకున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ ఆరోపించారు.శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర క్యాబినెట్ అత్యవసర సమావేశంలో బీసీల జనాభా ప్రాతి ప్రతికన బీసీల రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బీసీలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోబోతున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు కొట్టు వేసిన, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో బీసీలకు న్యాయం చేసేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయించిందని, అక్కడ న్యాయం జరగలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ తెలుగుదేశం పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బీసీలకు టీడీపీ పార్టీ పరంగా న్యాయం చేస్తామన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలలో ప్రజలు,ఓటర్లందరూ ఏకమై వైసీపీకి రాజకీయ సమాధి కట్టాలని నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రవి శంకర యాదవ్, తెలియాలి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వి ఎం శ్రీధర్, చికెన్ కార్పొరేషన్ డైరెక్టర్ కరాటి చంద్ర, ఆముదాల తులసి దాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.




# కావలిలో ఖాళీ అవుతున్న వైసీపీ

## కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



కావలి (చైతన్యరథం): కావలి రూరల్ మండలం పెద పట్టపుపాలెం పంచాయతీలో, పెద పట్టపుపాలెం,చిన్న పాలెం, నందెమ్మ పురం, పల్లిపాలెం, కొత్త నందిమ్మపురం, సీతారాం నగర్,మత్స్యకార గ్రామాలకు సంబంధించి మాజీసర్పంచులు, నాగన్నగారి శ్రీనివాసులు, చిన్నంగారి బాబు, మత్స్యకార కాపులు, ముఖ్య నేతలు వందల కుటుంబాలు టీడీపీలో చేరారు. కావలి టీడీపీ కార్యాలయంలో మత్స్యకార నాయకులకు పసుపు కండువా కప్పి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సాదరంగా ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు పాలన, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కావలి మత్స్యకార గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వారి అభివృద్ధికి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కృషి చేయడంపై మత్స్యకార గ్రామాల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ మత్స్యకారులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని హామీ ఇచ్చారు.

# అంతర్జాతీయ ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లో భారత్ ఘనత

## నాలుగు స్వర్ణాలు, ఒక రజతంతో సత్తా చాటిన విద్యార్థులు




**వియత్నాం:** అంతర్జాతీయ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్‌లో భారత విద్యార్థులు ప్రతిభ చాటారు. వియత్నాంలో నిర్వహించిన 19వ ఒలింపియాడ్‌లో భారత బృందం నాలుగు స్వర్ణాలు, ఒక రజత పతకాన్ని కైవసం చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ప్రాంజల్ దీక్షిత్, ఢిల్లీకి చెందిన సుమంత్ గుప్తా, గురుగ్రామ్‌కు చెందిన అక్షిత్ శ్రీవాత్సవ, ఫరీదాబాద్‌కు చెందిన అర్యాన్ సెహ్రావత్ స్వర్ణ పతకాలు సాధించారు. వడోదరకు చెందిన హర్షిల్ అమిత్‌కుమార్ పటేల్ రజత పతకం గెలుచుకున్నారు. పాల్గొన్న ఐదుగురు విద్యార్థులూ పతకాలు సాధించడంతో భారత్ ఆతిథ్య వియత్నాంతో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచింది. చెరో ఐదు స్వర్ణాలతో ఇరాన్, దక్షిణ కొరియా దేశాలు అగ్రస్థానాన్ని దక్కించుకున్నాయి.

**2026లో చారిత్రక రికార్డు:**

ఈ విజయంతో 2026వ సంవత్సరం అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్లలో భారత్‌కు సరికొత్త చరిత్రగా నిలిచింది. ఈ ఏడాది గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవ శాస్త్రం, ఆస్ట్రానమీ ఒలింపియాడ్లలో పాల్గొన్న మొత్తం 24 మంది భారతీయ విద్యార్థులూ పతకాలు (16 స్వర్ణాలు, 8 రజతాలు) సాధించారు. 1989లో భారత్ అంతర్జాతీయ ఒలింపియాడ్లలో అడుగుపెట్టిన నాటి నుంచి పాల్గొన్న విద్యార్థులందరూ పతకాలు గెలవడం ఇదే తొలిసారి కావడం విశేషం.




### ఏఐఏ ఆధ్వర్యంలో
## దసరా, దీపావళి ధమాకా

**కాలిఫోర్నియా:** అమెరికాలో ప్రవాస భారతీయుల సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా అసోసియేషన్ ఆఫ్ ఇండో అమెరికన్స్ (AIA), బోల్లీ 92.3 ఎఫ్‌ఎం (Bolly 92.3 FM) ఆధ్వర్యంలో దసరా, దీపావళి ధమాకా-2026కు వేడుకలకు సర్వం సిద్ధమైంది.

**తేదీ:** అక్టోబరు 17, శనివారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 11 గంటల వరకు

**వేదిక:** అలమేడా కౌంటీ ఫెయిర్‌గ్రౌండ్స్, ప్లెజంటన్, కాలిఫోర్నియా (Alameda County Fairgrounds, Pleasanton, CA)

ఈ వేడుకల్లో భాగంగా రెండు వేదికలపై నాన్‌స్టాప్ సాంస్కృతిక కార్యక్రమాలు, రామలీల ప్రదర్శన, డిస్కో దాండియా, భారీ బాణసంచా కాల్పులు, ఆకట్టుకునే రీతిలో 40 అడుగుల రావణ దహనం నిర్వహించనున్నారు. రథయాత్ర, సింధూర్ ఖేలా, మహా మంగళహారతి, 10 అడుగుల దుర్గాదేవి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

### డల్లాస్‌లో 'టీపాడ్' ఆధ్వర్యంలో
## బతుకమ్మ, దసరా వేడుకలు

**ఫ్రిస్కో:** టెక్సాస్‌లోని ఫ్రిస్కో వేదికగా తెలంగాణ పీపుల్స్ అసోసియేషన్ ఆఫ్ డల్లాస్ (TPAD) ఆధ్వర్యంలో ఈ ఏడాది బతుకమ్మ, దసరా సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మరింత ఘనంగా, అట్టహాసంగా ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టాలీవుడ్ యంగ్-టాలెంటెడ్ హీరో, మనందరి 'జాతిరత్నం' నవీన్ పోలిశెట్టి ప్రత్యేక అతిథిగా విచ్చేయనున్నారు.

**తేదీ:** అక్టోబరు 17, శనివారం

సమయం: మధ్యాహ్నం 12 నుంచి అర్ధరాత్రి 12 వరకు వేడుకలు నిరంతరం కొనసాగుతాయి.

**వేదిక:** కొమెరికా సెంటర్, 2601 ఎవెన్యూ ఆఫ్ ది స్టార్స్, ఫ్రిస్కో, TX 75024 (Comerica Center, Frisco, TX 75024)

**కార్యక్రమ ప్రత్యేకతలు...**

టాలీవుడ్ ప్రముఖ నటుడు నవీన్ పోలిశెట్టి లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ప్రముఖ యాంకర్ మృదుల తన మాటలు, యాంకరింగ్‌తో మరింత ఉత్సాహపరచనున్నారు. ప్రముఖ ఇన్ఫ్యూజన్ బ్యాండ్ (Infusion Band) అందించే హై-ఎనర్జీ మ్యూజిక్ బీట్స్ అందరినీ ఉర్రూతలూగించడంతో పాటు సాయంత్రం ఉత్సాహంగా చేసే నృత్యాలు అలరించనున్నాయి. ఈ వేడుకల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఉచిత ప్రవేశంతో పాటు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించారు.




# ఇండియన్ బిజినెస్, ప్రొఫెషనల్ కౌన్సిల్ కువైట్ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకారం



**కువైట్:** ఇండియన్ బిజినెస్ అండ్ ప్రొఫెషనల్ కౌన్సిల్ (IBPC) కువైట్ 2026-28 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. సాల్మియాలోని హాలిడే ఇన్‌లో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశం, ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. గౌరవ్ ఒబెరాయ్ చైర్మన్‌గా, సునీత్ అరోరా సెక్రటరీగా, సురేష్ కేపీ వైస్ చైర్మన్‌గా, కృష్ణన్ సూర్యకాంత్ జాయింట్ సెక్రటరీగా, రామదాస్ కార్తీక్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ గౌరవ్ ఒబెరాయ్ మాట్లాడుతూ భారత్-కువైట్ మధ్య వ్యాపార, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సభ్యులకు కొత్త వ్యాపార అవకాశాలు, నెట్‌వర్కింగ్ వేదికలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భారత రాయబార కార్యాలయం, కువైట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, భారతీయ పారిశ్రామిక సంస్థలు, అంతర్జాతీయ బిజినెస్ కౌన్సిళ్లతో భాగస్వామ్యాలను మరింత విస్తరిస్తామని తెలిపారు. తాజా మాజీ చైర్మన్ డాక్టర్ కైజర్ టి.షకీర్, మాజీ చైర్మన్లు ధీరజ్ ఒబెరాయ్, టోనీ జష్నమల్, ఎన్‌కే వాధ్వాన్, శివీ భాసిన్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలు, వృత్తి నిపుణులు ఐబీపీసీలో మరింత చురుకుగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. వ్యాఖ్యాతగా వ్యవహరించిన సునీత్ అరోరా వందన సమర్పణ చేశారు.

# అప్రమత్తంగా ఉండండి

## సౌదీలోని భారతీయులకు ఎంబసీ హెచ్చరిక

**రియాద్:** సౌదీ అరేబియాలోని భారత పౌరులు తీవ్ర మెలకువతో, అప్రమత్తంగా ఉండాలని రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర సలహా పత్రం (అడ్వైజరీ) జారీ చేసింది. స్థానిక అధికారులు అధికారిక మార్గాల ద్వారా ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైనప్పుడు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని కోరింది. ప్రస్తుత పరిస్థితులకు సంబంధించి ఎలాంటి వీడియోలు, వార్తలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం కానీ, పోస్ట్ చేయడం కానీ చేయవద్దని ఎంబసీ గట్టిగా విజ్ఞప్తి చేసింది.

**రాయబార కార్యాలయ సేవలు యథాతథం:**

పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని, రియాద్‌లోని ఎంబసీ, జెద్దాలోని కాన్సులేట్ సహా VFS అవుట్‌సోర్స్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రవాస భారతీయుల సేవార్థం 24X7 పనిచేసే హెల్ప్‌లైన్ టోల్-ఫ్రీ నెంబరు 8002471234 అందుబాటులో ఉంది.

**రియాద్ విమానాశ్రయంపై క్షిపణి దాడి:**

యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు రియాద్‌లోని 'కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయం' లక్ష్యంగా బాలిస్టిక్ క్షిపణి దాడి చేసినట్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. దాడి కారణంగా ఎయిర్‌పోర్టులో పొగలు అలుముకోవడంతో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**విమాన రాకపోకల నిలిపివేత:**

భద్రతా కారణాల దృష్ట్యా ప్రయాణికులను ఖాళీ చేయించి, పలు విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. పరిస్థితి సాధారణ నిలకడకు వచ్చే వరకు ప్రవాసీయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### న్యూజెర్సీలో 24, 25 తేదీల్లో
## 'టీఫాస్ స్టార్స్ 2026' పోటీలు

**ఎన్నారై విద్యార్థుల కోసం తెలుగు కళా సమితి ఏర్పాట్లు**

**న్యూజెర్సీ:** అమెరికాలోని న్యూజెర్సీలో ప్రవాస తెలుగు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా తెలుగు కళా సమితి (Telugu Fine Arts Society-TFAS) ఆధ్వర్యంలో టీఫాస్ స్టార్స్ 2026 పోటీలు నిర్వహించనున్నారు. 'లెట్ యువర్ టాలెంట్ షైన్' నినాదంతో ఈ వేడుకలు జరగనున్నాయి.

సంగీతం, మోనోలాగ్ & ఇన్‌స్ట్రుమెంటల్: అక్టోబరు 24 (శనివారం)

డ్యాన్స్: అక్టోబరు 25 (ఆదివారం)

వేదిక: 145 టాల్‌మడ్జ్ రోడ్, సూట్-18, ఎడిసన్, NJ 08817 (145 Talmadge Rd, Ste-18, Edison, NJ 08817)

**దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ:** అక్టోబరు 15, గురువారం)

**రిజిస్ట్రేషన్ ఫీజు:** ఒక్కో వ్యక్తికి $15, కనీసం నలుగురు సభ్యులున్న గ్రూప్‌నకు $50, ఎనిమిది మంది కంటే ఎక్కువ ఉన్న గ్రూప్‌నకు $70గా నిర్ణయించారు. రిజిస్ట్రేషన్ కోసం https://www.cognito forms.com/Tfas1/_2026TFASSTARSSM లింకును లేదా పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

**పోటీల విభాగాలివే...**

**సంగీతం:** సోలో క్లాసికల్ సింగింగ్, సోలో నాన్ క్లాసికల్ సింగింగ్, గ్రూప్ క్లాసికల్ సింగింగ్, గ్రూప్ నాన్ క్లాసికల్ సింగింగ్.

**నృత్యం:** సోలో క్లాసికల్ డాన్స్, సోలో నాన్ క్లాసికల్ డాన్స్, గ్రూప్ క్లాసికల్ డాన్స్, గ్రూప్ నాన్ క్లాసికల్ డాన్స్.

జనరల్ విభాగాలు: ఇన్‌స్ట్రుమెంటల్ (సంగీత వాయిద్యాలు), మోనోలాగ్ (తెలుగు), పాత్రధారి (తెలుగు), క్యారెక్టర్ పెర్ఫార్మెన్స్ (తెలుగు).

విజేతలకు TFAS దీపావళి ఈవెంట్‌లో అవార్డులు అందజేస్తారు. నియమ, నిబంధనల కోసం www.tfasnj.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. మరిన్ని వివరాల కోసం రాణి శంషాబాద్ (954-465-7856), మీనా కురిచేటి (630-229-5234), వైశాలి పొనకాల (424-390-3456)లను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

SCAN TO REGISTER





# ఆ స్టేషన్లకు రైళ్లన్నీ రద్దు

## సీజేపీ నిరసనల నేపథ్యంలోఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ నిర్ణయం

దేశ రాజధాని న్యూఢిల్లీలో అక్టోబర్ 10వ తేదీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల నేపథ్యంలో న్యూఢిల్లీ రైల్వే స్టేషన్, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చి పోయే రైళ్ల సర్వీసులు అన్నింటినీ రద్దు చేసింది. ఈ మేరకు భారతీయ రైల్వే శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. శనివారం ఉదయం 4.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల మధ్య ఆయా స్టేషన్లకు రైల్వే సర్వీసులు నడవవని స్పష్టం చేసింది.

ఈ స్టేషన్ల నుంచి మొత్తం10 గంటల పాటు రైళ్ల రాకపోకలను రద్దు చేసినట్లు తెలిపింది. ఆ క్రమంలో ఈ రెండు స్టేషన్లకు దేశంలోని పలు ప్రాంతాల నుంచి అక్టోబర్ 9వ తేదీన బయలుదేరే సర్వీసులను రద్దు చేసినట్లు భారతీయ రైల్వే చెప్పింది. తూర్పు రైల్వే పరిధిలోని పశ్చిమ బెంగాల్ నుంచి న్యూఢిల్లీ చేరుకోవాల్సిన రెండు రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు.. 12301 హౌరా, న్యూఢిల్లీ, 12313 సీల్దా, న్యూఢిల్లీ సర్వీసులు రద్దయ్యాయని వివరించింది. శనివారం న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ల వద్ద భారీగా ట్రాఫిక్ ఏర్పడే అవకాశం ఉందని నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారతీయ రైల్వే వివరణ ఇచ్చింది. మరో వైపు న్యూఢిల్లోని 57 మెట్రో స్టేషన్లు మూసి వేసినట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్(డీఎంఆర్‌సీ) ప్రకటించింది. శుక్రవారం రాత్రి 9.00 నుంచి శనివారం వరకు ఈ మెట్రో స్టేషన్లు మూసి వేస్తున్నటు జారీ చేసిన ప్రకటనలో డీఎంఆర్‌సీ వివరించింది. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల కారణంగా మెట్రో స్టేషన్ల ఎంట్రన్స్, ఎగ్జిట్స్ మూసి వేయ్యాలని డీఎంఆర్‌సీకి ఢిల్లీ పోలీసులు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో మెట్రో ఈ నిర్ణయం తీసుకుంది.

# దేశ రాజధానిపై ఆంక్షలా... నిలదీసిన సుప్రీం కోర్టు

## ఢిల్లీలో మెట్రో మూసివేతపై అసహనం...






కాక్రోచ్ జనతా పార్టీ నిరసన చేపట్టనున్న తరుణంలో అధికారులు ఆంక్షలు విధించడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనకు హాజరయ్యే వారిని నియంత్రించేందుకు నగరాన్నంతా స్తంభింపజేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. పౌరుల ప్రాథమిక హక్కులు, నిరసనకారుల హక్కుల మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరాన్ని న్యాయస్థానం నొక్కిచెప్పింది. ఈ మేరకు శుక్రవారం సుప్రీంకోర్టులో సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్ సిబల్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఢిల్లీలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. న్యాయస్థానం దీనిపై జోక్యం చేసుకోవాలని కోరారు. ఇది శాంతియుత నిరసన అని, ప్రజలు ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆయన చెప్పుకొచ్చారు. మరో సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ మాట్లాడుతూ.. అసమర్థత కారణంగా నగరం మొత్తాన్నీ బంద్ చేయలేరని వ్యాఖ్యానించారు. సీజేపీ నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. రాజధానికి వచ్చే పలు రైళ్లను రద్దు చేయడం సహా నిరసనకు అనుమతినిచ్చేందుకు నిరాకరించారు. అయితే నిరసనకు సంబంధించి పోలీసుల సూచనలు, భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 అమలుపై నోటీసులు, రైళ్ల రద్దు, యాప్ ఆధారిత ట్యాక్సీలపై ఆంక్షలకు సంబంధించిన మీడియా కథనాలతో కూడిన 16 పేజీల పత్రాన్ని పిటిషనర్లు న్యాయస్థానానికి సమర్పించారు. మతపరమైన ప్రార్థనా స్థలాలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లను పోలీసులు సంప్రదించడం, హోటళ్లు, హాస్టళ్లలో తనిఖీలు చేపట్టడం వంటి అంశాలనూ ప్రస్తావించారు. ఈ విషయమై జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ స్పందిస్తూ.. నిరసన తెలిపే హక్కులను సమర్థిస్తూనే అవి పూర్తిగా చట్టబద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. కానీ ఆ నిరసనల్ని అనుమతితోనే నిర్వహించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే అందుకు తగిన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఆంక్షలను పూర్తిగా తొలగిస్తే నిరసన తెలిపే వారి హక్కులను కూడా ప్రభావితం చేసే అవకాశముందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇరువర్గాల వాదనలు, వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా సమతుల్య నిర్ణయానికి రావడం సాధ్యంకాదని పేర్కొంది. ఒకవైపు ప్రాథమిక హక్కులు కోరుతున్న పౌరులు తమ ఎదుట ఉన్నారన్న ధర్మాసనం మరోవైపు నిరసన చేపట్టాలనుకుంటున్న వారి వివరాలు మాత్రం తమవద్ద లేవని తెలిపింది. ఈ నేపథ్యంలో నిరసనకారుల వివరాలు, ఎంతమంది పాల్గొంటారనే వివరాలు సమర్పించాలని కోరింది. సంబంధిత అన్ని వివరాలతో న్యాయస్థానానికి హాజరవుతామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు.

# తాపీ నదిలో నవదంపతుల మృతదేహాలు

మహారాష్ట్రలో నవ దంపతుల మృతదేహాలు లభ్యమవడం తీవ్ర కలకలం రేపుతోంది. ధులే జిల్లాలోని తాపీ నదిలో కాళ్లకు ఇనుప గొలుసులు కట్టి, తాళం వేసిన స్థితిలో వారి మృతదేహాలు బయటపడ్డాయి. మృతులను జలగావ్ జిల్లాకు చెందిన శ్యామ్‌హరి పాటిల్, స్వప్న పాటిల్‌గా పోలీసులు గుర్తించారు. శ్యామ్, స్వప్నలు కొన్ని నెలల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్నారని అధికారులు తెలిపారు. సావల్దే ప్రాంతంలోని నదిలో వారిరువురి మృతదేహాలను గుర్తించినట్టు చెప్పారు. వారి కాళ్లకు తాళం వేసిన ఇనుప గొలుసులు ఉన్నాయని వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు. వారు ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేక ఎవరైనా హతమార్చారా? అనే కోణంలో విచారణ సాగిస్తున్నారు. అన్ని రకాలుగా దర్యాప్తు చేపట్టి తదుపరి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



# మచ్చార్‌కు ఇజ్రాయెల్ శౌర్య పురస్కారం

## ఇజ్రాయెల్ అధ్యక్షుడు హెర్జాగ్ వెల్లడి



ఒమనీ కోపైలట్ హమామ్ అల్ హమ్మామీ ఉగ్రదాడి ఘటనలో 174 మంది ప్రయాణికులను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌కు ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత శౌర్య పురస్కారాన్ని ప్రకటించింది. త్వరలో మచ్చార్‌కు తమ దేశ అత్యున్నత అవార్డు అందిస్తామని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాగ్ హెర్జాగ్ తెలిపారు. ఫ్లైదుబాయ్ విమానంలో గత నెల 30న మచ్చార్‌పై ఒమనీ కోపైలట్ హమ్మామ్ దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో తాను తీవ్రంగా గాయపడినా.. కోపైలట్‌ను మచ్చార్ ప్రతిఘటించారు. తర్వాత కాక్‌పిట్ తలుపులు తెరవడంతో విమానంలోని ప్రయాణికులు వచ్చి హమ్మామీని పట్టుకున్నారు. అతడిని పట్టుకుని నిలువరించిన ఐదుగురు ప్రయాణికులను జెరుసలెంలో అధ్యక్షుడు హెర్జాగ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచ్చార్ చూపిన తెగువ, ధైర్యసాహసాల వల్లే పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. అబుధాబిలోని ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న మచ్చార్ కోలుకోగానే ఆయనకు అవార్డు అందిస్తామన్నారు.



# మాజీ సీఎం విజయన్‌కు చుక్కెదురు

## ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కేరళ హైకోర్టు ఆదేశం



కేరళ మాజీ సీఎం, సీపీఎం సీనియర్ నేత పినరయి విజయన్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన కుమార్తె వీణాకు చెందిన ఐటీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కు కొచ్చి మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్(సీఎంఆర్ఎల్) నుంచి అక్రమ చెల్లింపులు జరిగాయన్న ఆరోపణలపై.. విజయన్ సహా వీణా, ఆమె భర్త, మాజీ మంత్రి మహమ్మద్ రియాస్ తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కేరళ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జస్టిస్ బదరుద్దీన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం రాష్ట్ర విజిలెన్స్, అవినీతి నిరోధక విభాగాలకు ఉత్తర్వులు జారీ చేసింది. 2017-18, 2018-19 ఆర్థిక ఏడాదుల్లో సాఫ్ట్‌వేర్, కన్సల్టెన్సీ సేవల పేరుతో ఎక్సాలాజిక్‌కు సుమారు రూ.1.72 కోట్లు చెల్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే.. 2023లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు చేపట్టి ఈ వ్యవహారాన్ని బయటకు తీసుకొచ్చారు. ఆ తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ దర్యాప్తు చేపట్టాయి. ఈ వ్యవహారంలో ఎక్సాలాజిక్ సంస్థ మొత్తం రూ.2.73 కోట్లు పొందిందని ఎస్ఎఫ్ఐఓ అంచనా వేసింది. కాగా.. ఈ కేసులో విజయన్, వీణా, రియాస్ తదితరులపై అవినీతి నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తొలుత ఈడీ సిఫార్సు చేసింది. అయితే.. నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కాంగ్రెస్ నేతృత్వంలోని కేరళ ప్రభుత్వం రాష్ట్ర క్రైమ్ బ్రాంచ్‌తో ప్రాథమిక విచారణకు ఆదేశించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాజీ సీఎం వీఎస్.అచ్యుతానందన్ వద్ద అదనపు ప్రైవేట్ కార్యదర్శిగా పనిచేసిన కేఎం.షాజహాన్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. అయితే.. వీణా, ఎక్సాలాజిక్ సంస్థలు ఎలాంటి తప్పు చేయలేదని.. సదరు చెల్లింపులు చట్టబద్ధమైన వ్యాపార ఒప్పందాల్లో భాగమేనని సీపీఎం చెప్పుకొచ్చింది. కేవలం రాజకీయ ప్రలోభాల కారణంగానే ఈడీ సోదాలు జరిపిందని ఆరోపించింది. మరోవైపు విజయన్ గతంలో విద్యుత్ మంత్రిగా ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి ఎస్ఎన్‌సీ లావలిన్ కేసులోనూ ఆయనపై సీబీఐ దర్యాప్తు జరిగింది. 1995-97 మధ్య కేరళలోని జలవిద్యుత్ ప్రాజెక్టుల ఆధునికీకరణ కోసం కెనడాకు చెందిన ఎస్ఎన్‌సీ లావలిన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంతో రాష్ట్ర ఖజానాకు రూ.374.50 కోట్ల నష్టం వాటిల్లిందనే అభియోగాలపై విజయన్ నిందితుడిగా ఉన్నారు.

# ఏఐ కాదు.. 'ఎస్‌ఐ' అనాల్సిందే!

### డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

కృత్రిమ మేధ (ఏఐ) పేరును మార్చి 'సూపర్ ఇంటెలిజెన్స్' (ఎస్ఐ) అని పిలవాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఈ పదాన్ని ఉపయోగించకుండా 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే పేరునే కొనసాగించే వారిని వైట్‌హౌస్ శత్రువులుగా పరిగణిస్తామంటూ ఆయన హెచ్చరించినట్టు వార్తలు వెలువడ్డాయి. ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ మేరకు వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.

ప్రస్తుతం ఏఐ సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. అదే సమయంలో ఉద్యోగాలపై ప్రభావం, వ్యక్తిగత సమాచార భద్రత, సాంకేతికత దుర్వినియోగం వంటి అంశాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏఐపై కఠిన నియంత్రణలు విధించాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ట్రంప్ 'సూపర్ ఇంటెలిజెన్స్' అనే పదాన్ని ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కృత్రిమ మేధ రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో ట్రంప్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా 'సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్' ఏర్పాటును కూడా ఆయన ప్రస్తావించారు. అయితే, ఏఐకి కొత్త పేరు పెట్టడం వల్ల సాంకేతికత స్వరూపంలో మార్పు వస్తుందా? లేక ఇది కేవలం పదప్రయోగానికి సంబంధించిన అంశమా? అనే చర్చ మొదలైంది. మరోవైపు, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు కూడా ఈ పేర్ల మార్పుపై ప్రశ్న ఎదురైంది.




ఆయనకు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ పేరును 'స్పేస్‌ఎక్స్ ఎస్ఐ'గా మారుస్తారా అని అడగ్గా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అయితే, 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్', 'సూపర్ ఇంటెలిజెన్స్' రెండూ ఒకే అర్థాన్ని ఇవ్వవు. సూపర్ ఇంటెలిజెన్స్ అనేది మానవ మేధస్సును అనేక రంగాల్లో అధిగమించగల సామర్థ్యమున్న ఏఐ వ్యవస్థను సూచించే భావన. అందువల్ల ఈ పదాల వినియోగంపై చర్చతో పాటు, ఏఐ అభివృద్ధి, నియంత్రణ, భద్రత అంశాలు కూడా అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

## భారత పైలట్‌కు ఇజ్రాయెల్ అత్యున్నత పౌర శౌర్య పురస్కారం



భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ అసాధారణ ధైర్యసాహసాలకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఇజ్రాయెల్‌కు చెందిన ప్రయాణికులు సహా విమానంలోని 174మంది ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించిన ఆయనకు ఆ దేశ అత్యున్నత పౌర శౌర్య పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ అవార్డ్ ఫర్ సివిలియన్ హీరోయిజం' అందజేయనున్నట్టు అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ప్రకటించారు. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్ 1073లో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రయాణ సమయంలో కోపైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. తీవ్రంగా గాయపడిన కెప్టెన్ రక్తస్రావంతో ఇబ్బందిపడుతూ, చూపు మసకబారుతున్నప్పటికీ ధైర్యాన్ని కోల్పోలేదు. కాక్‌పిట్ తలుపు తెరవడంతో బయట ఉన్న ప్రయాణికులు, సిబ్బంది దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు అవకాశం లభించింది. విమానంలో ఉన్న మరో ఇద్దరు పైలట్లు నియంత్రణ చేపట్టి, సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా దించారు. దీంతో పెను విమాన ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కెప్టెన్ మచ్చర్ చూపిన ధైర్యం, వృత్తిపరమైన నైపుణ్యాన్ని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ప్రశంసించారు. ఆయన పూర్తిగా కోలుకున్న తర్వాత పురస్కారాన్ని అందజేస్తామని వెల్లడించారు. ఈ ఘటనలో దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంలో సహకరించిన ఆరుగురు ఇజ్రాయెల్ పౌరులకు ఇప్పటికే ఈ పురస్కారాన్ని అందజేశారు. విమానంలోని ప్రయాణికుల భద్రత కోసం కెప్టెన్ మచ్చర్ చేసిన పోరాటం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.

## ఉద్యోగుల కష్టానికి ఫిదా..

# రూ.43 లక్షల కార్లు గిఫ్ట్‌గా ఇచ్చిన యజమాని

తన కోసం కష్టపడే ఉద్యోగులు చలిలో వణుకుతూ ఎలక్ట్రిక్ స్కూటర్లపై విధులకు రావడం చూసి ఓ యజమాని మనసు చలించింది. తాను కారులో సౌకర్యంగా ప్రయాణిస్తుంటే.. తన సంస్థ అభివృద్ధికి కృషి చేసే ఉద్యోగులు మాత్రం వాతావరణ ప్రతికూలతలను ఎదుర్కోవడం ఎందుకని ఆలోచించారు. అంతే.. వారి కష్టానికి గుర్తింపుగా ఏకంగా బీఎండబ్ల్యూ కార్లనే కానుకగా ఇచ్చారు. ఒక్కో కారు విలువ సుమారు రూ.43 లక్షలు కావడం విశేషం. చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.



**మీటింగ్ పేరుతో తీసుకెళ్లి.. కార్లను బహుమతిగా ఇచ్చి..**

హెనాన్ ప్రావిన్స్‌లోని జియాజువో నగరానికి చెందిన మా యాన్‌లీ ఓ బీఫ్ హాట్‌పాట్ రెస్టారెంట్ చైన్‌ను నిర్వహిస్తున్నారు. తన సంస్థలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన కొందరు ఉద్యోగులకు కార్లు బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 24న వారిని బీఎండబ్ల్యూ షోరూమ్‌కు తీసుకెళ్లారు. మీటింగ్ ఉందని చెప్పడంతో సాధారణంగానే వెళ్లిన ఉద్యోగులు.. అక్కడ తమకు కొత్త కార్లు కానుకగా ఇవ్వబోతున్నారని తెలిసి ఆశ్చర్యపోయారు. ఒక్కో కారు విలువ సుమారు మూడు లక్షల యువాన్లు (దాదాపు రూ.43 లక్షలు). ఈ కార్లను ఆమె రెండు వారాల ముందే నగదు చెల్లించి కొనుగోలు చేసినట్లు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వెల్లడించింది.

**ఉద్యోగిని పరిస్థితి చూసి చలించిన యజమాని**

ఈ నిర్ణయం వెనుక గత శీతాకాలంలో జరిగిన ఓ సంఘటన ఉందని మా యాన్‌లీ తెలిపారు. ఓ ఉద్యోగిని ఉదయాన్నే చలిలో ఎలక్ట్రిక్ స్కూటర్‌పై రెస్టారెంట్‌కు రావడం, చలికి ఆమె ముఖం ఎర్రబడటం చూసి చలించిపోయినట్లు చెప్పారు. తాను కారులో వెచ్చగా ప్రయాణిస్తుంటే.. ఉద్యోగులు మాత్రం చలిగాలులకు ఇబ్బంది పడటం ఆమెను ఆలోచింపజేసింది. తన వ్యాపార విజయానికి ఉద్యోగుల కృషే ప్రధాన కారణమని, ఆ విజయ ఫలాలు వారికీ అందాలని ఆమె పేర్కొన్నారు. కారు అందుకున్న లీ జీ అనే ఉద్యోగిని ఆనందం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద బహుమతి వస్తుందని కలలోనూ ఊహించలేదని, షోరూమ్‌కు వెళ్లేటప్పుడు బాస్ ఓ పెద్ద బొమ్మను బహుమతిగా ఇస్తారని మాత్రమే అనుకున్నానని తెలిపారు. ఉద్యోగులకు పండుగల సందర్భంగా నిత్యావసర వస్తువులు, నగదు బోనస్‌లు అందించే మా యాన్‌లీ.. ఈసారి ఖరీదైన కార్లను కానుకగా ఇచ్చి ప్రత్యేకంగా నిలిచారు.

## భారత మూలాలున్న నవీ పిళ్లైకి నోబెల్ శాంతి



ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి-2026 దక్షిణాఫ్రికాకు చెందిన నవనీతమ్ 'నవీ' పిళ్లైని వరించింది. శాంతి, అంతర్జాతీయ చట్టాల పరిరక్షణకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వే నోబెల్ కమిటీ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. భారత మూలాలున్న నవీ పిళ్లై అంతర్జాతీయంగా మానవ హక్కుల పరిరక్షణ కోసం ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్నారు. నవీ పిళ్లై పూర్వీకులు తమిళనాడు నుంచి దక్షిణాఫ్రికాకు వలస వెళ్లారు. ఆమె 2008 నుంచి 2014 వరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా పనిచేశారు. అంతకుముందు 2003 నుంచి 2008 వరకు అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. దక్షిణా ఫ్రికాలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన వారితో పాటు, రాజకీయ ఖైదీల హక్కుల పరిరక్షణకు కూడా ఆమె తన న్యాయవాద వృత్తిలో కృషి చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంఘర్షణలను దౌత్యం, ఒప్పందాలు, చట్టబద్ధమైన మార్గాల ద్వారా పరిష్కరించుకోవడంలో అంతర్జాతీయ చట్టాలు కీలక పాత్ర పోషిస్తాయని నోబెల్ కమిటీ పేర్కొంది. ప్రపంచంలో అనేక సవాళ్లు, సంఘర్షణలు ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ మరింత అవసరమని అభిప్రాయపడింది. మానవ హక్కులు,న్యాయం,అంతర్జాతీయ చట్టాల పరిరక్షణకు ఆమె చేసిన కృషికి లభించిన ఈ గుర్తింపు ప్రపంచవ్యాప్తంగా చర్చ నీయాంశంగా మారింది. భారత మూలాలున్న వ్యక్తికి ఈ ప్రతిష్ఠా త్మక పురస్కారం దక్కడం భారతీయుల్లోనూ ఆసక్తిని కలిగిస్తోంది.

## ఒంటరిగా గ్రిపెన్ యుద్ధ విమానాన్ని నడిపిన థాయ్‌లాండ్ రాణి సుతిదా



థాయ్‌లాండ్ రాణి సుతిదా తన ఏవియేషన్ కెరీర్‌లో మరో కీలక మైలురాయిని అందుకున్నారు. తొలిసారిగా సింగిల్ సీటర్ జేఏఎస్ 39సీ గ్రిపెన్ యుద్ధ విమానాన్ని ఆమె ఒంటరిగా నడిపారు. దక్షిణ థాయ్‌లాండ్‌లోని సురత్ థాని ప్రావిన్స్‌లో ఉన్న వింగ్ 7 ఎయిర్‌బేస్ నుంచి అక్టోబర్ 8న ఈ విమానాన్ని టేకాఫ్ చేసినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ అరుదైన ఘట్టం సందర్భంగా థాయ్‌లాండ్ రాజు మహా వజిరలాంగ్‌కార్న్ కూడా అక్కడే ఉన్నారు. యుద్ధ విమానంలో విజయవంతంగా విహరించిన రాణి సుతిదాకు ఆయన పుష్పగుచ్ఛం అందజేసినట్లు సమాచారం. రాణి సుతిదాకు విమానాలు నడపడంలో విశేష అనుభవం ఉంది. ఇప్పటివరకు వివిధ రకాల విమానాలను కలిపి సుమారు 1,188 గంటలపాటు ఆమె ప్రయాణించినట్లు కథనాలు పేర్కొన్నాయి. సెస్నా, పిలాటస్, పైపర్ విమానాలతో పాటు బోయింగ్ 737 వంటి జెట్ విమానాలను కూడా ఆమె నడిపారు. 2010 మే 13న ఆమె తొలిసారిగా పైలట్‌గా విమానం నడిపినట్లు సమాచారం. గతంలో సెస్నా టీ-41డీ విమానంతోపాటు రెండు సీట్ల గ్రిపెన్ జేఏఎస్ 39డీ యుద్ధ విమానాన్ని కూడా ఆమె నడిపారు. రాజు దేశీయ, విదేశీ పర్యటనల సందర్భంగా కో-పైలట్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. రెండు సీట్ల యుద్ధ విమానాన్ని నడిపిన అనుభవం నుంచి ఇప్పుడు సింగిల్ సీటర్ గ్రిపెన్‌ను ఒంటరిగా నడిపే స్థాయికి చేరుకోవడం రాణి సుతిదా ఏవియేషన్ నైపుణ్యాన్ని మరోసారి చాటింది.

# ఆశలపై 'హోప్' నీళ్లు

- రెండో టీ20లో భారత్‌పై వెస్టిండీస్ ఘన విజయం
- షై హోప్ మెరుపు శతకం.. రూథర్‌ఫోర్డ్ విధ్వంసం
- సిరీస్ 1-1తో సమం




రాంచీ: స్కోరుబోర్డుపై 249 పరుగులు. టీ20ల్లో ఇంత భారీ స్కోరు ఉంటే గెలుపు ఖాయమని ఎవరైనా అనుకుంటారు. ఒకవేళ ఓడినా స్వల్ప తేడాతోనే అని భారత అభిమానులు ధీమాగా ఉన్నారు. కానీ వెస్టిండీస్ బ్యాటర్లు ఆ అంచనాలను తలకిందులు చేశారు. 250 పరుగుల లక్ష్యం తమకు ఏమాత్రం పెద్దది కాదన్నట్టు బౌండరీల వర్షం కురిపించారు. ఇంకా తొమ్మిది బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అందుకున్నారు. రాంచీ వేదికగా జరిగిన రెండో టీ20లో భారత్‌పై వెస్టిండీస్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ 1-1తో సమమైంది.

తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ స్కోరుతో మ్యాచ్ భారత్ చేతుల్లోనే ఉందని అంతా భావించారు. కానీ ఛేదనలో విండీస్ కెప్టెన్ షై హోప్ మ్యాచ్ గమనాన్నే మార్చేశాడు. కేవలం 45 బంతుల్లోనే అజేయ శతకం (102 నాటౌట్) బాదాడు. అతని ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 9 సిక్సర్లు ఉన్నాయి. అంటే చేసిన పరుగుల్లో 78 బౌండరీల ద్వారానే వచ్చాయి. మరో ఎండ్‌లో షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ కూడా భారతబౌలర్లపై విరుచుకు పడ్డాడు. 37 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సర్లతో 84 పరుగులు చేశాడు. చివర్లో రొమారియో షెఫర్డ్ 13 బంతుల్లోనే 3ఫోర్లు, 3సిక్సర్లతో 34పరుగులు (నాటౌట్) చేసి మ్యాచ్‌ను ముగించాడు. ఈ ముగ్గురే కలిసి 19 సిక్సర్లు బాదడం విశేషం. విండీస్ కేవలం 18.3 ఓవర్లలో 4 వికెట్లకు 252 పరుగులు చేసి గెలుపు తీరాలకు చేరింది. భారత బౌలర్లలో మయాంక్ 3 వికెట్లు, కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ తీశారు. మిగతా బౌలర్లు ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. విండీస్ బ్యాటర్ల దూకుడును అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇంత భారీ స్కోరును కూడా కాపాడుకోలేకపోవడం భారత బౌలింగ్ విభాగంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

హోప్‌కు భారత గడ్డపై ఇది వరుస మెరుపు. ఇదే పర్యటనలో జరిగిన వన్డే సిరీస్ చివరి మ్యాచ్‌లోనూ అతను 162 పరుగులతో అజేయంగా నిలిచి, 352 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేలా చేశాడు. వన్డేల్లో విండీస్‌కు అదే అత్యధిక విజయవంతమైన ఛేదన. ఇప్పుడు టీ20ల్లోనూ అదేజోరు కొనసాగించి భారత్‌కు మరో సారి చుక్కలు చూపించాడు. సిరీస్‌లో మూడో టీ20 మ్యాచ్ ఆదివారం ఇండోర్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో మళ్లీ ఆధిక్యం సాధించాలం టే భారత్ తన బౌలింగ్ లోపాలను సరిదిద్దుకోవాల్సి ఉంటుంది.




## వా రికార్డు బద్దలు..

# స్మిత్ @ 3

- రన్ మెషీన్ ఖాతాలో మరో మైలురాయి..
- ఆసీస్ టెస్టు టాప్-3లో స్టీవ్ స్మిత్
- స్టీవ్ వాను దాటేస్తూ.. డర్బన్‌లో రికార్డు

డర్బన్: ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్, ఫ్యాబ్-4లో ఒకడైన స్టీవ్ స్మిత్ టెస్టు క్రికెట్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు. టెస్టుల్లో ఆస్ట్రేలియా తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో మూడో స్థానానికి చేరాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న పింక్ బాల్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 25 పరుగుల వద్ద మాజీ కెప్టెన్ స్టీవ్ వా రికార్డును అధిగమించాడు. దీంతో వా నాలుగో స్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం స్మిత్ ఖాతాలో 10,945 పరుగులు ఉండగా, వా పేరిట 10,927 పరుగులు ఉన్నాయి. ఈ జాబితాలో రెండోస్థానంలో ఉన్న వెటరన్ అలన్ బోర్డర్ 11,174 పరుగులు చేశాడు. స్మిత్ ఆయనకు కేవలం 229 పరుగుల దూరంలో ఉన్నాడు. ఇక కంగారూల తరఫున అత్యధిక టెస్టు పరుగుల రికార్డు మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ (13,378) పేరిటే కొనసాగుతోంది. ఆయనను అందుకోవాలంటే స్మిత్ ఇంకా 2,433 పరుగులు చేయాలి. ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీలంకతో గాలె టెస్టులో స్మిత్ 10 వేల పరుగుల క్లబ్‌లో చేరాడు. ఈ ఘనత సాధించిన నాలుగో ఆస్ట్రేలియన్‌గా, టెస్టు చరిత్రలో 15వ బ్యాటర్‌గా నిలిచాడు. ఆ జాబితాలో పాంటింగ్, బోర్డర్, వా మాత్రమే అతడికంటే ముందున్నారు. సిడ్నీలో భారత్‌తో జరిగిన టెస్టులో 9,999 పరుగుల వద్ద ఔటై ఆ మైలురాయిని తృటిలో కోల్పోయిన స్మిత్, గాలెలో తాను ఆడిన తొలి బంతికే పరుగు తీసి 10 వేల మార్కును చేరుకున్నాడు. 2018 బాల్ ట్యాంపరింగ్ వివాదంతో ఏడాదిపాటు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైనా, తిరిగొచ్చి నిలకడగా పరుగులు సాధిస్తూ ఆధునిక టెస్టు క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన బ్యాటర్లలో ఒకడిగా కొనసాగుతున్నాడు.

# పునరాగమనంలో పీడకల..

- మాడిసన్ చెత్త రికార్డు.. 33 బంతులు.. జీరో
- పదేళ్ల తర్వాత వచ్చి డకౌటైన వైనం..

డర్బన్: దాదాపు పదేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి తిరిగొచ్చిన ఆస్ట్రేలియా ఓపెనర్ నిక్ మాడిసన్‌కు పునరాగమనం కలిసిరాలేదు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో 33 బంతులు ఎదుర్కొన్నా ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. దీంతో అత్యధిక బంతులు ఆడి డకౌటైన ఆసీస్ ఓపెనర్‌గా, 21వ శతాబ్దంలోనే అత్యంత చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. 2016లో సఫారీలపైనే అరంగేట్రం చేసిన మాడిసన్, అదే ఏడాది పాకిస్థాన్‌తో చివరి టెస్టు ఆడాడు. అరంగేట్ర మ్యాచ్‌లోనూ 12 బంతులు ఆడి డకౌటయ్యాడు. అప్పటినుంచి అవకాశం రాలేదు. ఇప్పటి వరకు నాలుగు టెస్టుల్లో చేసింది 27 పరుగులే. 34 ఏళ్ల ఈ లెఫ్టాండర్ ఎంపిక వెనుక ఆసక్తికర నేపథ్యముంది. గత ఏడాది క్యాన్సర్ చికిత్స తీసుకున్న అతడు, 20 నెలలుగా ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడలేదు. కామెరూన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్ గాయాలతో దూరమవడంతో సెలక్టర్లు అతడిని ఎంచుకున్నారు. డర్బన్ పిచ్ స్పిన్‌కు అనుకూలిస్తుందని, బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎక్కడైనా ఆడగలడని చీఫ్ సెలక్టర్ జార్జ్ బెయిలీ చెప్పాడు. ఇటీవల వన్డే కప్‌లో శతకం బాదడం కూడా అతడికి కలిసొచ్చింది. మరోవైపు టెస్టు చరిత్రలో తొలిసారి ఆస్ట్రేలియా 30 ఏళ్లు దాటిన ఆటగాళ్లతోనే బరిలోకి దిగింది. 38 ఏళ్ల నాథన్ లయన్ అందరికంటే పెద్దవాడు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్‌కు ఆరంభంలోనే దెబ్బ తగిలింది. వంద పరుగులలోపే నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది. ట్రావిస్ హెడ్ (9) విఫలమవగా, మార్నస్ లబుషేన్ (37), స్టీవ్ స్మిత్ (25) ఆదుకునే ప్రయత్నం చేసినా స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. మూడు టెస్టుల ఈ సిరీస్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో భాగం.



# పంజాబ్‌లో హాకీ పోరు..

- ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ విడుదల
- పాక్ ఔట్.. బంగ్లా ఇన్!
- ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ఇదే

న్యూఢిల్లీ: హాకీ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ 2026కు భారత ఆతిథ్యం ఇవ్వనుంది. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ వేదికగా టోర్నీ జరగనుంది. ఈ ట్రోఫీకి పంజాబ్ ఆతిథ్యమివ్వడం ఇదే తొలిసారి. తాజాగా హాకీ ఇండియా షెడ్యూల్‌ను విడుదల చేసింది. జలంధర్‌లో ప్రారంభ వేడుకలు, లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. సెమీఫైనల్స్ (నవంబర్ 4), ఫైనల్ (నవంబర్ 5) మొహాలీలో నిర్వహిస్తారు. భారత్, బంగ్లాదేశ్, మలేసియా, జపాన్, కొరియా, చైనా జట్లు పోటీపడుతున్నాయి. పాకిస్థాన్‌కు మాత్రం అవకాశం దక్కలేదు. దాని స్థానంలో బంగ్లాదేశ్ ఆడుతోంది.

**పాక్ లేకపోవడానికి కారణమదే..**

భారత్‌లో ఆడేందుకు పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ (పీహెచ్ఎఫ్) నిరాకరించింది. ద్వైపాక్షిక సంబంధాల్లో సున్నితమైన పరిస్థితి, భద్రతా కారణాలను చూపుతూ టోర్నీని వేరే దేశానికి తరలించాలని, లేదంటే తమ మ్యాచ్‌లను తటస్థ వేదికలో నిర్వహించాలని ఆసియా హాకీ ఫెడరేషన్‌ను కోరింది. అయితే వేదిక మార్పు ఉండదని, ఆడాలంటే భారత్‌కు రావాల్సిందేనని హాకీ ఇండియా కార్యదర్శి భోలానాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రిజర్వ్ జట్టుగా ఉన్న బంగ్లాదేశ్‌కు పాక్ స్థానంలో అవకాశం దక్కింది. నిజానికి షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1న జలంధర్‌లో భారత్-పాక్ మ్యాచ్ జరగాల్సి ఉంది. పాక్ చివరిసారిగా 2023 చెన్నై ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌లో ఆడి, ఆరు జట్లలో ఐదో స్థానంలో నిలిచింది.

***భారత్ మ్యాచ్‌లివీ (అన్నీ రాత్రి 7 గంటలకు)***

***అక్టోబర్ 27: బంగ్లాదేశ్‌తో***
***అక్టోబర్ 29: చైనాతో***
***అక్టోబర్ 30: జపాన్‌తో***
***నవంబర్ 1: మలేసియాతో***
***నవంబర్ 2: కొరియాతో***



చైతన్య రథం
సినిమా
శనివారం 10 అక్టోబరు 2026 X

# భోగి.. పల్లె పాట వచ్చేసింది



శర్వానంద్ కథానాయకుడిగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా'భోగి'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న మూవీ నవంబరు 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రకృతి రమణీయత ఆలవాలమైన తెలంగాణ పల్లెటూరి అందాలను, మనుషుల జీవనశైలిని వర్ణిస్తూ 'ఎగిలి వారంగాలేసి..' అంటూ సాగే పాటను చిత్ర బృంద విడుదల చేసింది. భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చినపాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు. నల్గొండ గద్దర్ నరసన్న, కందుకూరి శంకర్బాబు, రేలారే గోపాల్ ఆలపించారు. ఈ లిరికల్ వీడియో చూస్తున్నంత సేపూ ప్రతి ఒక్కరి మదిలో తమ గ్రామమే గుర్తొస్తుందంటే అతిశయోక్తి కాదు.

# బాలీవుడ్ డైరక్టర్‌కు చరణ్ నో



రామ్ చరణ్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న మెగా హీరో.. ఇప్పుడు తదుపరి సినిమాల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. కథల ఎంపిక నుంచి దర్శకుల వరకు ప్రతి అంశంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఓ బాలీవుడ్ దర్శకుడు చెప్పిన కథకు చరణ్ నో చెప్పారంటూ తాజాగా సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబోకు టాలీవుడ్‌లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించడమే కాకుండా, నటుడిగా చరణ్‌కు మంచి గుర్తింపు తెచ్చింది. ఇప్పుడు ఈ విజయవంతమైన జోడీ మరోసారి కలిసి పనిచేయనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తాత్కాలికంగా 'ఆర్‌సీ17'గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించనున్నట్టు సమాచారం. దసరా సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కూడా ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే, బాలీవుడ్ దర్శకుడు అపూర్వ లఖియా ఇటీవల రామ్‌చరణ్‌ను కలిసి కథ వినిపించారనే వార్తలు తెరపైకి వచ్చాయి. అయితే ఆ కథపై చరణ్ ఆసక్తి చూపలేదని, ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం తన కెరీర్‌లో కీలకమైన దశలో ఉన్న చరణ్.. బలమైన కథాబలం ఉన్న చిత్రాలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. రామ్ చరణ్, అపూర్వ లఖియా గతంలో 'జంజీర్' సినిమాకు కలిసి పనిచేశారు. అమితాబ్ బచ్చన్ నటించిన హిందీ క్లాసిక్‌కు రీమేక్‌గా రూపొందిన ఈ చిత్రం తెలుగులో 'తుఫాన్' పేరుతో విడుదలైంది. ఇందులో ప్రియాంకా చోప్రా కథానాయికగా నటించగా, సంజయ్ దత్, ప్రకాశ్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. మరి గతంలో కలిసి పనిచేసిన దర్శకుడి కథను రామ్ చరణ్ నిజంగానే తిరస్కరించారా? ఒకవేళ అదే నిజమైతే, అందుకు 'జంజీర్' ఫలితం కారణమా? అన్నది ప్రస్తుతానికి ఊహాగానాలకే పరిమితమైంది. ఈ వార్తలపై రామ్ చరణ్ లేదా చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

# ఓటీటీలో.. ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్



ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన ఏ రేటెడ్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. దర్శకుడు ఆదిత్యహాసన్ తెరకెక్కించిన సినిమా థియేటర్లలో విడుదలైనప్పుడు యూత్‌లో ఆసక్తిని కలిగించినప్పటికీ.. గతంలో రూపొందించిన '90స్' వెబ్ సిరీస్ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. దీంతో ఈ సినిమా ఓటీటీ విడుదల కోసం ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు ఇప్పుడు గుడ్ న్యూస్ అందింది. తాజాగా చిత్రాన్ని ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ తన ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. నేటినుంచే పాన్ ఇండియా భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్నట్లు సమాచారం. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయినవారు, అలాగే రొమాంటిక్ కామెడీ చిత్రాలను ఇష్టపడేవారు ఇప్పుడు ఇంటినుంచే ఈ సినిమాను వీక్షించవచ్చు. ఇక ఈ చిత్రంలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో నటించగా.. సీనియర్ నటుడు శివాజీ, వాసుకి తదితరులు కీలక పాత్రలు పోషించారు.

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు చెందిన సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించారు. మొత్తానికి థియేటర్లలో ఆశించిన స్థాయి లో సందడి చేయలేకపోయిన 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను ఏమేరకు ఆకట్టుకుంటుందో చూడాలి. ముఖ్యంగా యూత్‌ను లక్ష్యంగా చేసుకుని తెరకెక్కించిన ఈ రొమాంటిక్ కామెడీకి డిజిటల్ వేదికపై ఎలాంటి స్పందన లభిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# ఇప్పుడిక హీరోగా.. జాసన్

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ త్వరలోనే నటుడిగా వెండితెరకు పరిచయం కానున్నారా? ప్రస్తుతం కోలీవుడ్‌లో ఈ వార్త ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే 'సిగ్మా' చిత్రంతో దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభిం చిన జేసన్ సంజయ్.. ఇప్పుడు హీరోగా కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. జేసన్ సంజయ్‌తో ఇప్పటికే 'సిగ్మా' చిత్రాన్ని నిర్మిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్, ఆయనతో మరో ప్రాజెక్ట్‌ను తెరకెక్కించేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది.అయితే ఈసారి దర్శకుడిగా కాకుండా, హీరోగా జేసన్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయాలని సంస్థ భావిస్తున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే జేసన్ సంజయ్ హీరోగా నటించబోయే సినిమా కోసం పలువురు దర్శకులు కథలు వినిపించినట్టు సమాచారం. ప్రముఖ దర్శకుడు లింగుసామి కూడా ఈ ప్రాజెక్ట్ కోసం కథను సిద్ధం చేసినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. మరోవైపు, జేసన్‌కు బంధువైన నటుడు సంజీవ్ సైతం ఈ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం ఉందంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే, జేసన్ సంజయ్ నటుడిగా అరంగేట్రం చేయనున్నారనే వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం ఇవన్నీ



కోలీవుడ్‌లో వినిపిస్తున్న వార్తలు, ఊహాగానాలుగానే ఉన్నాయి.

# డిసెంబర్ 4న.. 'అలియాస్ రుక్మిణి'




వరుస పరాజయాలతో సతమతమవుతున్న నితిన్ సాలిడ్ హిట్ కోసం చూస్తున్నాడు. ఈ క్రమంలో అతని ఆశలన్నీ తాజా ప్రాజెక్టు 'అలియాస్ రుక్మిణి' పైనే ఉన్నాయి. దర్శకుడు మురళీకాంత్ తెరకెక్కిస్తున్న రోమ్‌కామ్‌లో నితిన్‌కు జోడీ వైష్ణవి చైతన్య. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ ప్రకటించారు. నితిన్‌తో డిజైన్ చేసిన సింపుల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ.. సినిమాను డిసెంబర్ 4న థియేటర్లకు తెస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు.

ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. అనుకున్న సమయానికి చిత్రీకరణ పూర్తి చేసి, ప్రమోషన్లను వెళ్లేందుకు మేకర్స్ సన్నద్ధం చేసుకున్నట్టు కనిపిస్తోంది. తాజా ప్రాజెక్టు నితిన్ కెరీర్‌కు ఎలాంటి మలుపు ఇస్తుందన్నది తెలియాలంటే.. డిసెంబర్ 4 వరకూ ఆగాలి. ఈ చిత్రానికి మరో ప్రత్యేక ఆకర్షణ.. నేచురల్ స్టార్ నాని నిర్మాత కావడం. నాని నిర్మాణంలో వస్తున్న సినిమా కావడంతో ప్రాజెక్టుపై సినీ వర్గాల్లోనూ మంచి అంచనాలున్నాయి.



# ట్రోలర్స్‌కు కత్రినా స్ట్రాంగ్ కౌంటర్

ఇటీవల నటి కత్రినా కైఫ్ వరుసగా వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. ప్రసవానంతరం తన శరీరాకృతిలో మార్పులపై వచ్చిన విమర్శలపై తాజాగా పరోక్షంగా స్పందించారు. తన బ్యూటీ బ్రాండ్ (కే బ్యూటీ) యూకేలో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా లండన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. "సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు.. మన ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ప్రభావితం చేయకుండా జాగ్రత్తపడాలి. అక్కడ ఎన్నో రకాల అభిప్రాయాలుంటాయి. వాటన్నింటికీ అనుగుణంగా నడుచుకోవాలని ప్రయత్నిస్తే.. మనం ఏ విషయంలోనూ సరైన నిర్ణయాలు తీసుకోలేం. ప్రపంచం మనల్ని ప్రశంసించే సందర్భాలు ఉంటాయి. అలాగే, ఒక్కోసారి మనల్ని మనం ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగాల్సిన సందర్భాలూ ఎదురవుతాయి. అలాంటప్పుడు మనకు మనమే అభిమానిగా మారాలి" అని కత్రినా వివరించారు. అంబానీ ఇంట జరిగిన వినాయక చవితి వేడుకలకు భర్త విక్కీ కౌశల్‌తో కలిసి కత్రినా హాజరయ్యారు. ఆ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రసవానంతరం ఆమె చాలా బరువు పెరిగారంటూ కొందరు ట్రోల్ చేయగా.. సెలబ్రిటీలు ఖండించి కత్రినాకు మద్దతుగా నిలిచారు.